


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★



మోదీకి తగిన గుణపాఠం **06**

సంపుటి 07, సంచిక: 185 | గురువారం | 06-06-2024 | కరీంనగర్ Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar పేజీలు: 8+8 | వెల రూ. 5.00









భర్తృహరి నీతి శతకము
రూ॥ 40/-
పేజీలు: 48

నవచేతన పబ్లిషింగ్ హౌస్
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సంపుటి 07, సంచిక: 185 | గురువారం | 06-06-2024 | కరీంనగర్ Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar పేజీలు: 8+8 | వెల రూ. 5.00

### పాలిసెట్‌లో స్టేట్ 24వ ర్యాంకు విజేత పవన్ తేజ



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** పాలిసెట్ ఫలితాల్లో విద్యార్థులు సత్తా చాటారు. రాజధాని హైదరాబాద్ రామంతపూర్‌లో ఉంటున్న భీమగోని పవన్ తేజ సోమవారం విడుదలైన పాలిసెట్ ఫలితాల్లో స్టేట్ 24వ ర్యాంకు సాధించారు. తన తల్లిదండ్రులైన భీమగోని ప్రవీణ్ కుమార్ గౌడ్, సామ్రాజ్య లక్ష్మి తో పాటు ఉపాధ్యాయులకు ధన్యవాదములు తెలియజేస్తున్నానని ఈ సందర్భంగా పవన్ తేజ తెలిపారు.

## విప్లవ జోహార్లు



కమ్యూనిస్టు యోధులు
**కా॥ చండ్ర రాజేశ్వరరావు**
(1914-1994)
**111వ జయంతి**

### హిమాలయాల్లో ట్రెక్కింగ్ చేస్తూ
## 9 మంది మృతి

**న్యూఢిల్లీ/ఉత్తరకాశి :** ఉత్తరాఖండ్‌లోని ఎగువ హిమాలయ పర్వతాల్లో సహస్త్రతాల్ సరస్సు వద్దకు ట్రెక్కింగ్‌కు వెళ్లిన బృందంలో 9 మంది ప్రాణాలు కోల్పోయారు. మరికొందరు ట్రెక్కర్లు అక్కడే చిక్కుకుపోయారు. చిక్కుకుపోయిన వారిలో ఐదుగురిని ఉత్తరాఖండ్ రాష్ట్ర విపత్తు నిర్వహణ బృందాలు కాపాడాయి. మిగిలిన వారిని రక్షించేందుకు ముమ్మరంగా సహాయక చర్యలు చేపట్టాయి. హిమాలయాల్లో 4 వేల 400 మీటర్ల ఎత్తున సహస్త్రతాల్ సరస్సు ఉంది. మే 29న 22 మందితో కూడిన ట్రెక్కింగ్ బృందాన్ని హిమాలయన్ వ్యూ ట్రెక్కింగ్ ఏజెన్సీ సరస్సు వద్దకు పంపింది. వారిలో 18మంది ట్రెక్కర్లు కర్ణాటకకు చెందిన వారు కాగా, ఒకరు మహారాష్ట్ర వాసి. ముగ్గురు స్థానిక గైడ్లు వారిని తీసుకుని వెళ్లారు. అయితే జూన్ 7న తిరుగు ప్రయాణంలో ప్రతికూల వాతావరణం కారణంగా వారు దారి తప్పారు.



# సరైన సమయంలో సరైన అడుగులు

మోదీ పాలన తిరస్కరించిన దేశ ప్రజల కోరిక నెరవేరుస్తాం
ప్రస్తుతం ప్రభుత్వం ఏర్పాటు చేయాలని అనుకోవడం లేదు
కూటమిలో ఉన్న ప్రతిపక్షాలన్నీ ఐక్యంగా పనిచేస్తాయి : ఖర్గే

**న్యూఢిల్లీ :** నరేంద్రమోడీ పరిపాలనను తిరస్కరించిన దేశ ప్రజల కోరిక నెరవేర్చేందుకు తాము సరైన సమయంలో సరైన అడుగులు వేస్తామని కాంగ్రెస్‌పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చెప్పారు. కేంద్రంలో ఇప్పుడు ప్రభుత్వం ఏర్పాటు చేయాలని 'ఇండియా' కూటమి అనుకోలేదని, సరైన సమయం కోసం వేచి చూస్తామని, అప్పటివరకూ ఆ అవకాశాలు తెరచుకునే ఉంటాయన్నారు. భాగస్వామపార్టీలన్నీ కలిసి ముక్తకంఠంతో ఈ నిర్ణయం తీసుకున్నాయన్నారు. కూటమిలో ఉన్న ప్రతిపక్షాలన్నీ ఐక్యంగా కలిసి పని చేస్తాయన్నారు. ఎన్నికల ఫలితాల తర్వాత రెండు గంటలసేపు జరిగిన 'ఇండియా' కూటమి తొలి సమావేశం ముగిశాక బుధవారంనాడు రాత్రి ఖర్గే మీడియాతో మాట్లాడారు. ప్రజలకకు ఇచ్చిన మాట నిలబెట్టుకునేందుకు నిక్కచ్చిగా నిలబడి సమైక్యంగా కృషిని కొనసాగిస్తామని ఖర్గే ఉద్ఘాటించారు. బిజెపి నాయకత్వంలోని నరేంద్రమోదీ ఫాసిస్టు నియంతృత్వ పరిపాలనపై పోరాటం కొనసాగించాలని ప్రతిపక్ష పార్టీల నాయకులు తీర్మానించారని చెప్పారు. ప్రభుత్వం ఏర్పాటు చేసే ఉద్దేశం లేదని, సరైన సమయం వచ్చే వరకూ ప్రత్యామ్నాయాలను అన్వేషిస్తామని అన్నారు. అప్పటి వరకూ మోదీ నియంతృత్వ పాలపై పోరాటం కొనసాగిస్తామన్నారు. కూటమికి బ్రహ్మాండంగా మద్దతు తెలియజేసిన దేశ ప్రజలకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ''బిజెపి ప్రభుత్వ పరిపాలన వద్దు అని కోరుకున్న ప్రజల కోరిక నెరవేర్చేందుకు సరైన సమయంలో మేం సరైన చర్యలు తీసుకుంటాం'' అని కూటమి తొలి సమావేశ ప్రకటనను మీడియాకు చదివి వినిపించారు.

**రాజ్యాంగానికి కట్టుబడిన పార్టీలకు 'ఇండియా' ఆహ్వానం**

దేశ రాజ్యాంగ పీఠికలో ప్రతిష్టించిన విలువలకు కట్టుబడిన రాజకీయ పార్టీలన్నీ 'ఇండియా' కూటమిలోకి రావాలని కాంగ్రెస్‌పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆహ్వానం పలికారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎంతో గొప్ప తరువాయి 7లో

# ఎన్‌డిఎ నేత మోదీ



### ఈనెల 8 లేదా 9న ప్రమాణం?
మోదీ నివాసంలో ఎన్‌డిఎ పక్షనేతల భేటీ
కీలక తీర్మానాలకు కూటమి ఆమోదం

**న్యూఢిల్లీ :** జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్‌డిఎ) పక్ష నేతగా నరేంద్ర మోదీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాని మోదీ నివాసంలో బుధవారం జరిగిన సమావేశంలో ఈ మేరకు ఎన్‌డిఎ పక్షాల నేతలు ఎన్నుకున్నారు. అయితే ఈనెల 7న మరోసారి ఎన్‌డిఎ ఎంపిలు సమావేశమై మోదీని అధికారికంగా ఎన్నుకుని, అనంతరం కూటమి నేతలంతా కలిసి తమ మద్దతు లేఖను రాష్ట్రపతి అందజేయనున్నట్లు హెచ్‌ఎఎం (సెక్యులర్) నేత బీహార్ మాజీ సిఎం జీతన్ రామ్ మాంజీ చెప్పారు. ఈనెల 8న లేదా 9వ తేదీన మూడోసారి మోదీ ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉన్నట్లు వర్గాలు తెలిపాయి. ఢిల్లీ కర్తవ్యపథ్‌లో మోదీ ప్రమాణస్వీకారం చేయనున్నట్లు సమాచారం. 60 ఏళ్ల సుదీర్ఘ విరామం అనంతరం జవహర్‌లాల్ నెహ్రూ తర్వాత వరుసగా మూడోసారి ప్రధాని పదవి చేపట్టే నేతగా మోదీ రికార్డులకెక్కనున్నారు. కాగా, సమాశంలో కీలక తీర్మానాలు ఆమోదించారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం చేపట్టిన ప్రజాసంక్షేమ విధానాల కారణంగా గత పదేళ్లలో దేశంలోని 140కోట్ల మంది ప్రజలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందినట్లు ఓ తీర్మానం ఆమోదించారు. దాదాపు 6 దశాబ్దాల సుదీర్ఘ విరామం తర్వాత దేశ ప్రజలు వరుసగా మూడోసారి సంపూర్ణ మెజారిటీతో బలమైన నాయకత్వాన్ని ఎన్నుకున్నట్లు ఎన్‌డిఎ నేతలు పేర్కొన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో నరేంద్ర మోదీ నాయకత్వంలో ఎన్‌డిఎ ఐక్యంగా పోరాడి విజయం సాధించినట్లు తెలిపారు. మోదీ నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం పేదలు, మహిళలు, యువత, రైతులు, దోపిడీకి గురవుతున్న, అణగారిన వర్గాలకు అభివృద్ధికి కట్టుబడి ఉన్నట్లు ఎన్‌డిఎ నేతలు పేర్కొన్నారు. భారతదేశ వారసత్వాన్ని పరిరక్షించడం ద్వారా దేశం సర్వతోముఖాభివృద్ధి కోసం, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి ఎన్‌డిఎ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఈ సమావేశంలో బిజెపి జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా, అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు, జెడియు నేత, బీహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్, శివసేన నేత, మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే, ఎల్‌జెపి నేత చిరాగ్ పాసవాన్, ఎన్‌సిపి నేత ప్రఫుల్ పటేల్, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రధాని రాజీనామా : ఆమోదం**

ఇదిలా ఉండగా, ప్రధాని నరేంద్రమోదీ బుధవారం తన పదవికి రాజీనామా చేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసి తనతో పాటు కేంద్రమంత్రుల రాజీనామాలు సమర్పించారు. వెంటనే ప్రధాని రాజీనామాను ఆమోదించిన రాష్ట్రపతి ముర్ము, తదుపరి ప్రభుత్వం ఏర్పాటయ్యే వరకు పదవిలో కొనసాగాలని మోదీకి సూచించినట్లు రాష్ట్రపతి భవన్ ఒక ప్రకటనలో పేర్కొంది. అంతకు ముందు కేంద్ర మంత్రి వర్గం సమావేశమై 17వ లోక్‌సభను రద్దు చేయాలని సిఫార్సు చేసినట్లు వర్గాల వెల్లడించాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రపతి 17వ లోక్‌ను రద్దు చేశారు. అంతకుముందు లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ మెజారిటీ సీట్లు సాధించిన నేపథ్యంలో ప్రభుత్వ ఏర్పాటుపై సమీక్షించేందుకు ప్రధాని మోదీ అధ్యక్షతన ఢిల్లీలో కేంద్ర మంత్రివర్గం సమావేశమైంది. రెండో దఫా మోదీ ప్రభుత్వంలో ఏర్పాటైన కేబినేట్, మంత్రిమండలికి ఇదే చివరి సమావేశం. ప్రస్తుత లోక్‌సభ పదవీకాలం తరువాయి 7లో

# బిజెపి అభ్యర్థుల గెలుపుకోసం కెసిఆర్ అరాచకం



బూడిదైన బిఆర్‌ఎస్ మళ్లీ పుట్టేది లేదు
గెలుపోటములకు పూర్తిబాధ్యత నాదే
కాంగ్రెస్ పరిపాలన పట్ల ప్రజలు సంతృప్తిగా ఉన్నారు
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/ హైదరాబాద్

లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో బిజెపిని గెలిపించేందుకు కెసిఆర్ దురాగతానికి పాల్పడ్డారని సిఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బిఆర్‌ఎస్ ఓట్లను బిజెపికి బదలాయించి కెసిఆర్ రాజకీయ అరాచకానికి పాల్పడ్డారని, బిఆర్‌ఎస్ చచ్చిపోతూ బిజెపిని గెలిపించిందని విమర్శించారు. కెసిఆర్ తనంతట తానే అంతర్ధానమై బిజెపికి మద్దతుగా నిలిచారని, ఫలితంగా చరిత్రలో బిఆర్‌ఎస్‌కు ప్రాతినిథ్యం లేకుండా పోయిందన్నారు. వంద రోజుల్లోనే కాంగ్రెస్‌పై ఆరోపణలు చేస్తూ కాంగ్రెస్‌ను అస్థిరపరచాలనే కుట్రపూరితంగా వ్యవహరించిన బిఆర్‌ఎస్‌ను ప్రజలు తిరస్కరించి తగిన గుణపాఠం చెప్పారన్నారు. బూడిదైన బిఆరెస్ మళ్లీ పుట్టేదిలేదన్నారు. ఇప్పటికైనా బిఆర్‌ఎస్ నాయకులు వ్యవహార శైలి మార్చుకోవాలని సిఎం సూచించారు. సిఎం నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రులు, పార్టీ సీనియర్ నాయకులతో కలిసి రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ''లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మంచి ఫలితాలు వచ్చాయి. అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఓట్ల శాతం కంటే లోక్‌సభ ఎన్నికల్లో ఎక్కువ ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ పరిపాలన పట్ల ప్రజలు సంతృప్తిగా ఉన్నారని తాము భావిస్తున్నాం. ఎనిమిది మంది ఎంపిలను గెలిపించి ఆశీర్వదించారు'' అని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి చెప్పారు. 2023 శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 39.5శాతం ఓట్లు వస్తే లోక్‌సభ ఎన్నికల్లో 41 శాతం ఓట్లు రావడం, 2019 ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 3 ఎంపి సీట్లు వస్తే ఇప్పుడు ఆ సంఖ్య ఎనిమిదికి పెరగడం ద్వారా కాంగ్రెస్ ప్రజాపాలనకు ప్రజలు ఆమోదం తెలిపారని సిఎం వివరించారు. గతంలో గెలిచిన 64 ఎంఎల్‌ఎ స్థానాలతో పాటు ఇప్పుడు కంటోన్మెంట్ స్థానాన్ని గెలిపించి 65 స్థానాలను ఇవ్వడం, లోక్‌సభ స్థానాల్లో భారీ మెజారిటీ ఇవ్వడం ద్వారా ప్రజలు కాంగ్రెస్ పాలనను సమర్థించారన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో అనుకున్న స్థాయిలో తరువాయి 7లో



# రేవంత్‌రెడ్డికి సిపిఐ నేతల అభినందనలు

సిఎంతో కమ్యూనిస్టు పార్టీ నేతల భేటీ
లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై చర్చ
ఎన్‌డిఎ ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరించకుండా అడ్డుకట్ట పడుతుందన్న కూనంనేని

ప్రజాపక్షం / హైదరాబాద్

లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో కూటమి తరుపున కాంగ్రెస్ 8 లోక్‌సభ స్థానాలను, ఉప ఎన్నికలో ఒక ఎంఎల్‌ఎ స్థానాన్ని గెలుచుకోవడం పట్ల టిపిసిసి అధ్యక్షులు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సిపిఐ నాయకులు అభినందనలు తెలిపారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి, కార్యదర్శివర్గ సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి, పశ్య పద్మ, ఇ.టి.నర్సింహా బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో కలిసి సానికి వెళ్ళి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో, జాతీయ స్థాయిలో తరువాయి 7లో

### ఇక ఏక పార్టీ
# నియంతృత్వానికి తెర

ఇండియా కూటమి మధ్య సీట్ల పంపకాలు సరిగా జరిగి వుంటే మరిన్ని సీట్లు వచ్చేవి : సిపిఐ ప్రకటన



**న్యూఢిల్లీ :** దేశంలో ఏకపార్టీ నియంతృత్వ పాలనకు తెర పడిందని భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ) జాతీయ కార్యదర్శివర్గం బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది. అదేవిధంగా 'ఇండియా' కూటమి భాగస్వామ్యపక్షాల మధ్య సీట్ల సర్దుబాట్లు గనుక మరింత ఉత్తమస్థాయిలో జరిగి ఉంటే బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఎ కూటమి మరిన్ని తక్కువ స్థానాలకు మాత్రమే పరిమితమై ఉండేదని ఇదే విషయాన్ని సిపిఐ విశ్వసిస్తోందని, బిజెపి పూర్తిగా ఈ ఎన్నికల్లో దివాళా తీసి ఉండేదని పార్టీ తన ప్రకటనలో పేర్కొంది. ''18వ లోక్‌సభ ఎన్నికల ఫలితాలు ఏకపార్టీ నియంతృత్వానికి తెర దించాయి. కార్పొరేట్‌శక్తుల మద్దతు ఉన్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ సారథ్యంలోని బిజెపి మతోన్మాద ఫాసిస్టు శక్తుల పరిపాలన అంతమైంది. రాజ్యాంగానికి, లౌకిక ప్రజాస్వామ్య సామాజిక వ్యవస్థకు రక్షణ కల్పిస్తూ, విద్వేష రాజకీయాలు, వివక్ష, పెరుగుతున్న నిరుద్యోగం, సమాఖ్య వ్యవస్థపైన, అల్పసంఖ్యాక వర్గాలపైన, ప్రజాస్వామ్యం, మానవ హక్కులపై జరుగుతున్న దాడులు వంటి విధానాలకు వ్యతిరేకంగా, పెరుగుతున్న ధరలతో అసాధారణ రీతిలో పెరిగిపోయిన ప్రజల కష్టాలు, బాధలకు వ్యతిరేకంగా మనదేశ ప్రజలు ఈ ఎన్నికల్లో తీర్పు ఇచ్చారు. దేశ రాజ్యాంగంలో ఎంతో పవిత్రంగా ప్రతిష్టించిన ''భారత దేశ భావన''కు రక్షణ కల్పిస్తూ, బిజెపిని వ్యతిరేకిస్తూ, సవాలు చేస్తూ తీర్పు చెప్పిన ప్రజలకు భారత కమ్యూనిస్టు పార్టీ అభినందనలు తెలియజేస్తున్నది. 'ఇండియా' కూటమిలో భాగస్వామ్యపార్టీలు ఈ ఎన్నికల్లో నిర్వహించిన పాత్ర కనబరిచిన పనితీరుకు అభినందనలు తెలియజేస్తూ, కూటమిలోని భాగస్వామ్యపక్షాల మధ్య సీట్ల పంపకాలు, సమైక్యంగా ఎన్నికల ప్రచారం మరింత ఉత్తమస్థాయిలో జరిగి ఉంటేగనుక బిజెపి మరిన్ని తక్కువస్థానాలకు పరిమితమైపోయి ఉండేది.అదే విధంగా ప్రజలను మతప్రాతిపదికపై విభజించేందుకు ప్రధామంత్రి నరేంద్రమోదీ చేసిన విద్వేష ప్రసంగాలను భారత ఎన్నికల సంఘం అదుపు చేయలేకపోయింది. దీనికి వ్యతిరేకంగా సిపిఐ తన నిరసన తెలియజేయాలని భావిస్తున్నది. దేశ ప్రజల ప్రాథమిక హక్కులు రక్షించడం కోసం, వారికి ఎంతో మెరుగైన భవిష్యత్తు చేకూర్చడం కోసం 'ఇండియా' కూటమిలో సిపిఐ ఇక ముందు కూడా ఎంతో కీలకమైనపాత్ర నిర్వహించడం కొనసాగిస్తుంది. మొత్తంగా వామపక్షాలకు ప్రత్యేకించి సిపిఐకి వచ్చిన ఫలితాలపై ఆత్మావలోకనం చేసుకోవాలని ఈ ఎన్నికలు చెబుతున్నాయి. ఈ ఎన్నికల ఫలితాలకు సంబంధించిన సవివరణాత్మకమైన నివేదికలు లభించిన తర్వాత సిపిఐ విమర్శనాత్మకంగా దీనిపై సమీక్ష చేస్తుంది'' అని సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం తన ప్రకటనలో తెలియజేసింది.

**రాజ్యాంగ రక్షణకోసం దృఢంగా నిలబడిన ప్రజలకు ఎఐటియుసి అభినందన**

రాజ్యాంగాన్ని రక్షించుకోవడంకోసం ఎంతో దృఢంగా నిలబడిన దేశ ప్రజలకు ఎఐటియుసి తరువాయి 7లో

# నేటి నుండి ''ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట''

పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపేలా అవగాహన
జిల్లా అధికారులతో సమన్వయ బాధ్యత జిల్లా విద్యాశాఖాధికారిదే
10న పుస్తకాల పంపిణీ
19 వరకు 'బడిబాట' వరుస కార్యక్రమాలు
మార్గదర్శకాలు విడుదల

ప్రజాపక్షం/హైదరాబాద్

''ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట'' కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా గురువారం ప్రారంభంకానుంది. ఈ కార్యక్రమానికి సంబంధించిన పూర్తి మార్గదర్శకాలను 'సమగ్ర శిక్ష' బుధవారం విడుదల చేసింది. ఈ నెల 19 వరకు నిర్వహించే 'బడిబాట'లో జిల్లా కలెక్టర్ నుంచి మొదలు జిల్లా విద్యాశాఖ, ఎంపిడివో, ఎంఇవో, హెడ్ మాస్టర్ వరకు నిర్వహించే పాత్రను మార్గదర్శకాల్లో పొందపర్చింది. బడిబాట కార్యక్రమంలో ఎస్‌హెచ్‌జి, ఎఎపిసిలను భాగస్వామ్యం చేయనున్నారు. అంగన్‌వాడి కేంద్రాల సమీపంలో పాఠశాలకు వెళ్లని పిల్లలను గుర్తించి, వారిని సమీప ప్రభుత్వ పాఠశాలలకు పంపించేలా విద్యాశాఖ లక్ష్యంగా పెట్టుకున్నది. ముఖ్యంగా మధ్యలో చదువును వదిలేసిన బాలికలను గుర్తించి, వారు తిరిగి ప్రభుత్వ పాఠశాలకు వెళ్లేలా చూడాలని, విద్యా హక్కు చట్టం పట్ల కూడా క్షేత్రస్థాయిలో అవగాహణ కల్పించాలని విద్యాశాఖ ఆదేశించింది. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించడంతో పాటు పిల్లలను పాఠశాలలకు పంపించేలా అవగాహన కల్పించాలని, అలాగే ప్రభుత్వ పాఠశాలలో చదువుకునేలా విద్యార్థులకు ప్రభుత్వం అందేజేసే టెక్స్ట్‌బుక్స్, యునిఫామ్, మధ్యాహ్న భోజనం, తదితర సౌకర్యాలను కూడా విస్తృతంగా ప్రచారం చేస్తారు. విలేజ్ ఎడ్యుకేషన్ రిజిస్టర్ (విఇఆర్) అప్‌డేట్ చేయాల్సి ఉంటుంది. జిల్లాలోని అన్ని శాఖలకు సంబంధించిన అధికార తరువాయి 7లో

# అర్ధరాత్రి వరకూ తేలని ఫలితం

కొనసాగుతున్న వరంగల్– ఖమ్మం– నల్లగొండ పట్టభద్రుల కౌంటింగ్
4 హాళ్లు.. 96 టేబుళ్లు..

ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి




నల్లగొండ–వరంగల్–ఖమ్మం శాసన మండలి పట్టభద్రుల ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపు ప్రక్రియ నల్లగొండ జిల్లా కేంద్రంలోని దుప్పలపల్లి వేర్ హౌస్ గోదాంలో బుధవారం ప్రారంభించారు. మూడు ఉమ్మడి జిల్లాల్లో పట్టభద్రుల నియోజకవర్గానికి గత నెల 27న పోలింగ్ జరిగింది. ఎన్నికల బరిలో అధికార పార్టీ కాంగ్రెస్ నుండి తీన్మార్ మల్లన్న, బిఆర్‌ఎస్ నుంచి ఏనుగుల రాకేష్ రెడ్డి, బిజెపి నుంచి ప్రేమేందర్‌రెడ్డిలతో పాటు మరో 49 మంది స్వతంత్ర అభ్యర్థులు బరిలో ఉన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 4,63,839 మంది పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోగా అందులో 2,88,189 మంది పురుషులు, 1,75,645 మంది స్త్రీలతో పాటు 5 మంది ట్రాన్స్‌జెండర్స్ ఓటర్లు ఉన్నారు. 27న జరిగిన పోలింగ్‌లో 605 పోలింగ్ కేంద్రాలలో 3,36,013 మంది పట్టభద్రులు బ్యాలెట్ ద్వారా ఓటు వేయగా, మరో 2139మంది పట్టభద్రులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకున్నారు. అయితే ఈ కౌంటింగ్ ఉదయం 8 గంటల నుంచి ప్రారంభించారు. పట్టభద్రుల ఎన్నికల్లో అభ్యర్థుల ప్రాధాన్యతను గుర్తిస్తూ ఓట్ల లెక్కింపు ప్రక్రియను కొనసాగిస్తారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియను గోదాంలోని నాలుగు హాళ్లలో హాల్‌కు 24 చొప్పున 96 ఏర్పాటు తరువాయి 7లో

# కేజ్రీవాల్‌కు దక్కని బెయిల్..

జూన్ 19 వరకు జ్యుడిషియల్ కస్టడీ

**న్యూఢిల్లీ :** మధ్యంతర బెయిల్ కోసం ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ చేసిన అభ్యర్థనను ఢిల్లీ కోర్టు తిరస్కరించింది. బరువు తగ్గడం, కిడ్నీ సమస్యలకు సంబంధించి వైద్య పరీక్షలు చేయించుకునేందుకు మధ్యంతర బెయిల్ పొడిగించాలని కేజ్రీవాల్ అభ్యర్థన చేసుకున్న సంగతి తెలిసిందే. దానిపై ఇప్పటికే వాదనలు విన్న న్యాయస్థానం తీర్పు బుధవారానికి వాయిదా వేసింది. ఆయన పిటిషన్‌ను తోసిపుచ్చుతూ తాజాగా ఆదేశాలు ఇచ్చింది. జూన్ 19 వరకు జ్యుడిషియల్ కస్టడీని పొడిగించింది. జైలు అధికారులు ఆయన వైద్య అవసరాలు చూసుకోవాలని కోర్టు ఆదేశించింది. మద్యం కుంభకోణం కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై మార్చి 21న కేజ్రీవాల్‌ను ఇడి అధికారులు తరువాయి 7లో




www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★



లక్ష్యాలు చేరాలంటే ఆర్థిక విధానాలు మారాలి **04**

సంపుటి 07, సంచిక: 185 | గురువారం | 06-06-2024 | కరీంనగర్ | Published from: **Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar** | పేజీలు: 8+8 | వెల రూ. 5.00



ప్రజాపక్షం

గురువారం, జూన్ 06

## బిజెపి రొట్టె నేతిలో పడింది

లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి తెలంగాణ రాష్ట్రంలో తన పలుకుబడి, ప్రాబల్యం, శక్తిసామర్థ్యాలకు మించిన ఫలితాలు సాధించింది. ప్రధాని నరేంద్రమోదీ జనాకర్షక శక్తితో తమకు రెండంకెల సీట్లు లభిస్తాయని బిజెపి నాయకులు ముందునుండీ ప్రచారంలో పెట్టినందున వారు 8 స్థానాలు గెలుచుకోవటం ఎవరికీ ఆశ్చర్యం కలిగించలేదు. ఆ ప్రచారానికి తగినట్టే మోదీ, అమిత్‌షా రాజ్‌నాథ్‌సింగ్ తదితర కేంద్రనాయకులు రాష్ట్రంలో పలుమార్లు పర్యటించటం, కాంగ్రెస్ సర్కార్‌పై, ప్రతిపక్ష బిఆర్‌ఎస్‌పై తీవ్రవిమర్శలు చేస్తూ జనాలను ఆకట్టుకునే ప్రయత్నంచేశారు. అంతకుముందు గత నవంబర్– డిసెంబర్ మాసాల్లో అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేది తామేనని బిజెపి ఇంతకు ఏమాత్రం తగ్గని ప్రచారం చేసినా, అవినీతిపాలన, కుటుంబ పాలన అంటూ బిఆర్‌ఎస్‌పై దుమ్మెత్తి పోసినా అప్పుడు వచ్చింది 8 సీట్లే, అటువంటప్పుడు ఆరు మాసాల్లో తమ లోక్‌సభ స్థానాల సంఖ్యను 4 నుంచి 8కి పెంచుకునేంత అద్భుతం ఏమి జరిగిందబ్బా అని నింపాదిగా ఆలోచిస్తే రహస్యం బయటపడింది. అది బలుపుకాదు కృత్రిమమైన వాపు అని తేలింది. ఏమైతేనేం రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం తామేనని జనాల్లో అభిప్రాయం పెంపొందించేందుకు, అవకాశవాద రాజకీయులను తమ గూటికి ఆకర్షించేందుకు ఈ వాపు ఉపకరిస్తుంది. అంతేగాక దేశవ్యాప్తంగా మోదీగాలి తగ్గి బిజెపికి లోక్‌సభలో అది కోరుకున్న 370 సీట్లు కాదుకదా కనీసమెజారిటీకి దూరంగా ఉన్న పరిస్థితిలో ఈ 8 సీట్లు దానికి ప్రోత్సాహకారి అయినాయి. 2019 ఎన్నికల ఫలితాలనాడు కూడా అంతే – 299 వద్ద ఆగిన బిజెపి ప్రయాణానికి ఈ రాష్ట్రం నుండి చివరగా వచ్చిన 4 సీట్లు పార్టీ బలాన్ని 303కు చేర్చి –పార్టీ ఒక మైలురాయి దాటిందన్న ఒక విధమైన మానసిక సంతృప్తిని చేకూర్చాయి.

ఇదిలావుండగా, పాలక కాంగ్రెస్ పార్టీ తాను అంచనావేసుకున్న రెండంకెల (10 నుంచి 15) సంఖ్యలో సీట్లు గెలుచుకోలేకపోయినా గతంలోని 3 సీట్లను 8కి చేర్చి ఆత్మసంతృప్తి పొందిందనవచ్చు. అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే ఒకటిన్నర శాతం ఓట్లు పెంచుకోవటం ఉపఎన్నికలో కంటోన్మెంట్ అసెంబ్లీ సీటు గెలుచుకోవటం తమ ఆరుమాసాల పాలనకు ప్రజామోదంగా భాష్యం చెప్పుకుంటున్నది. అయితే ప్రధాన ప్రతిపక్షపార్టీ బిఆర్‌ఎస్ ఖాతా ఎందుకు తెరవలేదన్న ప్రశ్న ఎవరికైనా ఉదయిస్తుంది. అసెంబ్లీ ఎన్నికల్లో 39 సీట్లు, 37,35 శాతం ఓట్లు పొందిన పార్టీకి ఇంతలోనే ఏమైంది? 17 సీట్లలో అభ్యర్థులను నిలబెట్టగా 14 సీట్లలో మూడవస్థానం, వాటిలో 8 సీట్లలో డిపాజిట్లు కోల్పోవటం వాస్తవానికి ఆ పార్టీకి పిడుగుపాటు. బిఆర్‌ఎస్ పుట్టి పెరిగిన గత రెండు దశాబ్దాల్లో లోక్‌సభలో ప్రాతినిధ్యం కోల్పోవటం ఇది తొలిసారి. హతవిధి! ఈ దురవస్థ శత్రవుకు కూడా రాకూడదు! అయితే తమ చేతితో తమ కన్ను తామే పొడుచుకున్న స్వయం కృతాపరాధాన్ని విస్మరిస్తే అది సరైన గుణపాఠాలకు దారితీయదు. తప్పుమీద తప్పులు చేయిస్తూనే ఉంటుంది. బిఆర్‌ఎస్ ఓటు వాటా 37.35 నుంచి 16.68 శాతానికి పడిపోయింది. తమకు వ్యతిరేకంగా కాంగ్రెస్ –బిజెపి లోపాయికారి ఒప్పందం చేసుకున్నాయని బిఆర్‌ఎస్ నాయకులు, కాంగ్రెస్‌ను ఓడించేందుకు బిజెపి, బిఆర్‌ఎస్ ముసుగులో గుద్దులాటనాటకం ఆడుతున్నాయని కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ప్రచార కాలంలో పరస్పర ఆరోపణలు చేసుకోవటం విన్నాం. కాని ఆచరణలో కాంగ్రెస్‌పై ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై కసితో బిఆర్‌ఎస్ తమ ఓట్లను బిజెపి అభ్యర్థులకు మళ్లించినట్లు కనీసం 7–8 నియోజకవర్గాల్లో ఓటింగ్ సరళి సాక్ష్యంగా నిలిచింది. ఉదాహరణకు సీనియర్ నాయకుడు హరీశ్‌రావుకు పెట్టనికోటలాంటి సిద్దిపేట అసెంబ్లీ సెగ్మెంట్‌ను తీసుకుంటే అసెంబ్లీ ఎన్నికల్లో 80,000 మెజారిటీతో గెలుపొందారు. అయితే లోక్‌సభ పోలింగ్‌లో బిఆర్‌ఎస్ అభ్యర్థికి సుమారు 3 వేల ఓట్ల మెజారిటీయే లభించింది. కొన్నిచోట్ల నాయకులు ఒక పథకం ప్రకారం బిజెపికి ఓట్లు మళ్లిస్తే, మరికొన్నిచోట్ల స్థానిక నాయకులు 'మా శత్రువుకు శత్రువు మాకు మిత్రుడనే' రీతిగా వ్యవహరించటం బిజెపి విజయాలకు తోడ్పడింది. బిఆర్‌ఎస్ 8 చోట్ల డిపాజిట్లు కోల్పోవటం వెనుక ఉన్న రహస్యం ఇదే కావచ్చు. ఈ లోపాయికారి వ్యవహారం కన్నా బిజెపితో పొత్తుపెట్టుకుని ఎన్‌డిఎలో చేరి ఉ ంటే అది రాజకీయ వ్యూహంగానైనా ఉండేది కాదా? తమ ఓట్లను ధనరాసులున్న పెద్దపార్టీకి ఒకసారి బదలాయించాక, మనం కోరుకున్నప్పుడు అవి తిరిగి వస్తాయన్న భ్రమలో ఉంటే తమగోతిని తామే తవ్వుకున్న వారవుతారు సుమా!

### లక్ష్యాలు చేరాలంటే..

# ఆర్థిక విధానాలు మారాలి

ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగడం.. స్థూల జాతీయోత్పత్తి (జిడిపి)లో గణనీ మైన ప్రగతిని సాధించడం.. 2047 నాటికి అభి వృద్ధి చెందిన దేశాల సరసన చేరడం.. వంటి లక్ష్యాలు చెప్పడానికి బాగానే ఉంటాయి. అంద మైన ఊహా ప్రపంచాన్ని మన ముందు ఉంచు తాయి. కానీ, కేవలం మాటల గారడీతో అభివృద్ధి సాధ్యం కాదని గత పదేళ్ల కాలంలో ప్రత్యక్షంగా చూశాం. ఏ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది? ఎవరి బలం ఎంత? వంటి ప్రశ్నలు ఎలావున్నా, దేశాన్ని అనుకున్న గమ్యానికి చేర్చడానికి అనుస రించాల్సిన మార్గాలను అన్వేషించడం కొత్త ప్రభు త్వానికి అత్యవసరం. సంపద వికేంద్రీకరణ జరిగి తీరాలన్నది సామాజిక కార్యకర్తలేకాదు... ఆర్థిక నిపుణులు కూడా పలుకుతున్న హితం. అతి కొద్ది మంది వ్యక్తులు, సంస్థల చేతిలో సుమారు 80 శాతం ఆదాయం, సంపద కేంద్రీకృతం కావడం దేశ ఆర్థిక విధానాల్లోని డొల్లతనాన్ని బహిర్గతం చేస్తున్నది. పేదలకు ఫలాలు దక్కనప్పుడు, అభి వృద్ధి ఎందుకు? ప్రజల ఆకలికేకలతో దేశం మారు మోగుతున్నప్పుడు, గణాంకాల విశ్లేషణలు, అభి వృద్ధి నినాదాలు ఎవరిని ఉద్ధరించడానికి? 140 కోట్ల పైచిలుకు జనాభా ఉన్న దేశంలో, కనీసం 80 కోట్ల మంది ఉచిత ఆహార పథకంపై ఆధారపడడం దేనికి సంకేతం? 'ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన' (పిఎంజికెఎవై) కింద ఉచిత ఆహార ధాన్యాలు ఇస్తున్నట్టు మోదీ ప్రభుత్వమే పలు సంద ర్భాల్లో ప్రకటించింది. మరోవైపు ప్రపంచంలోనే అతి పెద్ద ఆర్థిక వ్యవస్థల జాబితాలో ఐదో స్థానానికి చేరినట్టు ఘనంగా చాటింపు వేసింది. అభివృద్ధి సామాన్యుడి వరకూ ఎందుకు చేరలేదనేది ప్రశ్న. సమాధానం తెలిసినా మోదీ సర్కారు పట్టించుకో లేదు. కార్పొరేట్ శక్తులకు దేశాన్ని తాకట్టుపెట్టే రీతిలో తీసుకున్న పలు ఆర్థిక విధానాలు మార కుంటే, భవిష్యత్తు అంధకారమే. ఇక నుంచైనా మార్పు దిశగా అడుగులు పడాలి. సామాన్యుల బతుకులు బాగుపడాలి. లక్ష్యాలను ప్రకటించడం సులభం. అందుకోవడమే కష్టం. అమెరికా, చైనా తర్వాత, మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించాలంటే, జర్మనీ, జపాన్ దేశాలను అధిగ మించాలి. జిడిపిని కొనుగోలు శక్తితో కొలవాలి. లేకపోతే, జిడిపి వృద్ధి రేటు ఘనంగా కనిపిస్తున్నా, ప్రజల కొనుగోలు శక్తి మారదు. పేదరికం తగ్గదు. ఆకలి కేకలు తప్పవు. జిడిపి వృద్ధి, అభివృద్ధి దిశగా అడుగులు నిజానికి 2011లోనే ప్రారంభమ య్యాయి. రాజీవ్ గాంధీ హయాంలో మొదలైన భారీ మార్పులు, పివి నరసింహారావు, మన్మోహన్ సింగ్ పాలనలోనూ కొనసాగాయి. సరళీకృత ఆర్థిక విధానాలతో దేశం శరవేగంగా అభివృద్ధి చెందడం ప్రారంభమైంది. కాంగ్రెస్ అప్పట్లో వేసిన పునాదుల పైనే ఎన్‌డిఎ ప్రభుత్వం బలమైన ఆర్థిక సౌధం కట్టడం ప్రారంభించింది. కానీ, అందులో పేద లకు, బడుగులకు చోటు లేకుండా చేసింది. దేశ ప్రజల కోసం.. ముఖ్యంగా అన్ని రకాలుగా వెనుక బడిన వర్గాల కోసం ప్రారంభమైన ప్రయత్నాలను, సంపన్నుల ఆదాయాన్ని, ఆస్తులను కొన్ని వందల రెట్లు పెంచే మార్గాలుగా బిజెపి సర్కారు మార్చే సింది. ఫలితంగా ధనిక, పేద వర్గాల మధ్య విపరీత మైన అంతరం కనిపిస్తున్నది. ఈ పరిస్థితికి ఎంత త్వరగా తెరవేస్తే దేశానికి అంత మంచిది. గత మూడు ఆర్థిక సంవత్సరాల్లో సాధించిన 7.5 శాతం జిడిపి వృద్ధిని తక్కువ అంచనా వేయడానికి వీల్లేదు.



కరోనా మహమ్మారి సృష్టించిన ఆర్థిక విధ్వంసం నుంచి కోలుకొని, ఈ వృద్ధి రేటును అందుకోవడం హర్షణీయం. అయితే, ఈ వృద్ధి, వికాసం అతి తక్కువ మందికే పరిమితం కావడం, అత్యధికులు ఆకలితో అలమటించడం అమానుషం. ఈ పద్ధతి పోవాలంటే, ప్రస్తుతం అనుసరిస్తున్న ఆర్థిక విధా నాల్లో విప్లవాత్మక మార్పులు రావాలి. అట్టడుగున ఉన్న వారు ఆర్థికంగా ఎదిగేందుకు మార్గాన్ని నిర్మించాలి. వాణిజ్య పరంగా, వివిధ వస్తు సేవ లకు విస్తారమైన మార్కెట్ మన దేశంలోనే ఉంది. ఎన్నో విదేశీ కంపెనీలు మన మార్కెట్‌నే లక్ష్యంగా చేసుకుంటున్నాయి. ఇదే మార్కెట్‌ను దేశీయ ఉత్ప త్తుల కోసం వినియోగించుకుంటున్న పరిస్థితి లేదు. 'స్టార్టప్'లు, 'మేకిన్'లు సరైన ఫలితాలను ఇవ్వలేక పోతున్నాయి. చైనా ఉత్పత్తులు ప్రపంచ దేశాలను ముంచేస్తున్న రీతిలో, భారత ఉత్పత్తులు ఎందుకు పెరగడం లేదనే ప్రశ్నకు సమాధానాలను అన్వేషిం చుకోవాలి. సమస్యలను పరిష్కరించుకోవాలి. 2004–05లో 37 శాతంగా ఉన్న పేదిరక సూచీ 2011–12 నాటికి 22 శాతానికి పడిపోయింది. అదే ఒరవడిని కొనసాగిస్తే, ఈ దశాబ్దకాలంలో పేదరికం మరింత తగ్గాలి. కానీ, అనూహ్యంగా పెరుగుతున్నది. మోదీ ప్రభుత్వం తీసుకున్న అస్త వ్యస్త నిర్ణయాలు, చేస్తున్న ప్రయోగాలే ఈ పరిస్థితికి కారణమన్న ఆరోపణలు చాలాకాలంగా వినిపిస్తు న్నాయి. వివిధ పథకాలను, చట్టాలను పునఃసమీ క్షించాల్సిన అవసరం ఉందని ప్రతిపక్ష 'ఇండియా' కూటమి పదేపదే చెప్తున్న వైనాన్ని ఈ సందర్భంగా గుర్తుచేసుకోవాలి. కొవిడ్ కారణంగా దేశంలో ఎంతో మంది ఉపాధి కోల్పోయారు. లక్షలాది కుటుంబాలు పతనావస్థకు చేరుకున్నాయి. సరైన ఆదాయం లేకపోవడంతో, కొనుగోలు శక్తి దారు ణంగా పడిపోయింది. మరోవైపు ద్రవ్యోల్బణ సమస్య రోజురోజుకూ పెరుగుతున్నది. పరిస్థితి దారుణంగా ఉంది కాబట్టే, కోట్లాది మంది ఉచిత ఆహార పథకంపై ఆధారపడాల్సి వస్తున్నది. పేదరి కంపై పోరాటం ఇప్పుడు తక్షణావసరంగా మారింది. దేశంలో వేగవంతమైన జిడిపి సాధ్యమ వుతున్నప్పటికీ, ఉపాధి కల్పన జరగడం లేదని ప్రతి పక్ష పార్టీలు విమర్శిస్తున్నాయి. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల ప్రచారంలోనూ ఈ అంశాన్నే ప్రధానంగా ప్రస్తావించాయి. ధనికులకు అనుకూల మైన, పక్షపాతంతో కూడిన విధానాలు అమలవుతు న్నాయన్నది విపక్షాల ఆరోపణ. పెరుగుతున్న ధరలు.. పడిపోతున్న ఆదాయ వనరులు మధ్యతర గతి వారిని పేదలుగానూ, పేదలను నిరుపేదలు గానూ మారుస్తున్నాయి. సంపద వికేంద్రీకరణ లేక పోవడంతో, కోటీశ్వరులే మరిన్ని కోట్లకు పడగలె త్తుతున్నారు. అత్యధికులు క్రమంగా పేదరికంలోకి జారిపోతున్నారు. ఇవి కళ్లకు కనిపిస్తున్న దృశ్యాలు. ఈ పరిస్థితి మారాలంటే, సంపద పంపిణీ వక్రంగా లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ సమస్యలకు తోడు, సరికొత్తగా పర్యావరణ కాలుష్యం వచ్చి చేరింది. వపరీతమైన కాలుష్యం కారణంగా ఉష్ణోగ్ర త్తలు క్రమంగా పెరుగుతున్నాయి. అకాల వర్షాలు, వరదలు ఆనవాయితీగా మారాయి. ఈ సమస్యలు ఆరోగ్య సమస్యలను తెచ్చిపెడుతున్నాయి. అసలే అంతంత మాత్రంగా ఉన్న ఆర్థిక పరిస్థితులు, వైద్యానికి అవుతున్న ఖర్చుల కారణంగా మరిం తగా పతనమవుతున్నాయి. అదే సమయంలో ఉత్ప త్తిపైన కూడా పర్యావరణ ప్రభావం ఎక్కువగా కని పిస్తున్నది. పర్యావరణ పరిరక్షణకు యుద్ధ ప్రాతిప దికపై చర్యలు తీసుకోవడం కూడా అవసరం. బడ్జె ట్‌లో సరైన కేటాయింపులు జరపాలి. ఉత్పత్తికి విఘాతం కలగని రీతిలో వసతులు కల్పించాలి. నమోదవుతున్న వేవగంతమైన వృద్ధి సమగ్రం గానూ, స్థిరంగానూ ఉండేలా జాగ్రత్తలు తీసుకో వాలి. రాజకీయాలకు అతీతంగా, ఉపాధి కల్పనకు అవసరమైన చర్యలు ప్రభుత్వం చేపట్టాలి. అన్ని పార్టీలు మద్దతునివ్వాలి. ఏటా కోటి ఉద్యోగా లంటూ 2014లో బిజెపి ఇచ్చిన హామీ నీటిమూట గానే మిగిలింది. ఇకనైనా కేవలం మాటలకు పరి మితం కాకుండా, ఉద్యోగ కల్పనకు ప్రభుత్వం చిత్త శుద్ధితో ప్రయత్నించాలి. రోజురోజుకూ పెరుగు తున్న నిరుద్యోగ సమస్యను పరిష్కరించడానికి ఆర్థిక విధానాల్లో తగిన మార్పులు తీసుకురావాలి. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారిలో నిరుద్యోగిత 29 శాతం ఉందంటే, మిగతా స్థాయిల్లో నిరు ద్యోగం యువతను ఎంతలా వేధిస్తున్నదో అర్థం చేసుకోవచ్చు. అభివృద్ధి... ఉద్యోగిత అనే రెండు ప్రధాన లక్ష్యాలను చేరుకోవడానికి, ప్రజల జీవన స్థితిగతులను మెరుగుపరచడానికి అనుగుణంగానే ఆర్థిక పరమైన నిర్ణయాలు, విధానాలు ఉండాలి. గ్రామీణ యువత ఎక్కువగా వ్యవసాయేతర ఉపా ధిని కోరుతున్నారు. తయారీ రంగ ఉపాధి వాటా దాదాపు 12 శాతం వద్ద నిలిచిపోయింది. నిర్మాణం, సేవా రంగాల్లో మాత్రమే కొంత మెరు గైన పరిస్థితి ఉంది. ప్రభుత్వ పరంగా ఉద్యోగావకా శాలు కల్పించలేనప్పుడు, స్వయం ఉపాధికి తోడ్పాటు అందించాలి. కార్పొరేట్ కంపెనీలకు వేల కోట్ల రూపాయలు రుణాలనిచ్చి, నిలువునా మునిగి పోతున బ్యాంకులు, నిజాయితీగా ఉపాధి కోసం ప్రయత్నిస్తున్న వారికి లక్షల్లో కూడా రుణాలు ఇవ్వడం లేదన్నది వాస్తవం. ఉన్నత వర్గాలకే బ్యాంకులు సహకరిస్తున్న వైనం. స్వయం ఉపాధికి అవసరమైన మార్గాలను అన్వేషించి, ఆర్థికంగా తోడ్పాటును అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. బ్యాంకులకు ఈ విషయంలో విస్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలి. స్వయం ఉపాధి ద్వారా ఎంతో మందికి ఉపాధి లభిస్తుంది. ఉత్పత్తి పెరుగుతుంది. ఆదాయం లభిస్తుంది కాబట్టి, కొను గోలు శక్తి పెరుగుతుంది. పేదలికం నుంచి బయట పడే మార్గాలు విస్తృతమవుతాయి. కార్మిక శక్తి ఎక్కువగా ఉన్న మన దేశంలో, పరిశ్రమల స్థాపన పెరిగితేనే ఆర్థిక రంగం పురోగమిస్తుంది. లేకపోతే, లక్ష్యానికీ, వాస్తవానికి పొంతన ఉండదు. 2030 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఎగుమతులను సాధించాలనేది లక్ష్యంగా మోదీ ప్రభుత్వం ఇది వరకు ప్రకటించింది. కానీ, ఇంత వరకూ ఆ దిశగా బలమైన అడుగులు పడలేదు. సంస్థాగతమైన పెట్టు బడులతోపాటు, విదేశీ పెట్టుబడులను కూడా ఆక ర్షించినప్పుడే, ఉత్పత్తి పెరుగుతుంది. ఎగుమతులు కూడా పెరుగుతాయి. ఎగుమతి సుంకాలను తగ్గిం చడం, ఆంక్షలను సడలించడం వంటి చర్యలు అత్యవసరం. ఎగుమతులను ప్రోత్సహించే విధా నాలు అమలుకావాలి. విదేశీ పెట్టుబడులను ఆక ర్షించే వ్యవస్థను రూపుదిద్దాలి. మదుపరులకు దేశ ఆర్థిక పరిస్థితిపై నమ్మకం కలిగించాలి. సమా జంలో ప్రతి విషయం ప్రత్యక్షంగానో, పరోక్షం గానో డబ్బుతో ముడిపడి ఉంటుంది. ఆదాయాన్ని సంపాదించే మార్గాలు ఉన్నప్పుడే, డబ్బు ఉంటుంది. ఉద్యోగ లేదా స్వయం ఉపాధి కల్పనే ఆదాయాలను పెంచడానికి సులువైన మార్గం. సూక్ష్మంగా చెప్పాలంటే, ఆర్థిక అసమానతలను తగ్గించి, ప్రజల జీవన ప్రమాణాలను పెంచే విధంగా నిర్ణయాలు ఉండాలి. గత పదేళ్లుగా అను సరిస్తున్న విదానలను కొనసాగిస్తే మాత్రం, లక్ష్యా లను సాధించే మాట ఎలావున్నా, దేశ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతుంది. ధనిక, పేద అంతరం పెరుగు తుంది. అంతర్యుద్ధాలు తలెత్తే ప్రమాదం పొంచి ఉంటుంది. కొత్త ప్రభుత్వం సరైన దిశలో చర్యలు చేపట్టాలి.

**చంద్రం**

## స్నేహ పూర్వక పోటీతో 20 నుండి 25 సీట్లు

# కోల్పోయిన 'ఇండియా'

ఏడు దశల్లో 543 లోక్‌సభ స్థానాలకు రెండు నెలలపాటు ఎన్నికలు జరగగా...ఉత్కంఠ గా ఎదురు చూస్తున్న 18 వ లోకసభ ఎన్నికల ఫలితాలు వచ్చినవి.. ఎన్నికల ముందు దేశవ్యాప్తంగా చేపట్టిన సర్వేలు( ఎగ్జిట్ పోల్స్) అప్ కి బార్ చార్ సౌ మోడీ నినాదానికి అను కూలంగా ఎన్ డి ఏ కు 350 కి పైగా వస్తాయని కొన్ని సంస్థలు 370 వరకు వస్తున్నాయని వివిధ సర్వే సంస్థలు ఎన్ డి ఏ మోడీకి జై కొట్టాయి..ఒక దశాబ్దం పాటు మోడీ పాలన వ్యవహారాలు చూసిన తర్వాత ఈ ఎన్నికల్లో ఎన్ డి ఏ, మోడీ కి ఊ హించని ఫలితాలు అంటే బోటా.. బోటి మెజారిటీ మాత్రమే వచ్చినవి. అంటే 2014 లో అప్పుడు ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, ధరలు పెరుగుదల తది తర సమస్యలతో కొన్ని సామాజిక చారిత్రక,ఆర్థిక, కారణాలవల్ల బిజెపి అధికారానికి రాగలిగింది. అప్పుడు కాంగ్రెస్ కు వచ్చినవి 44 మాత్రమే. తిరిగి 2019లో గొప్ప అభివృద్ధిలో మార్పు రాకపోయినా పుల్వామా, బాలాకోట్ సంఘటనలు, దేశ బార్డర్ లో కవ్వింపు చర్య లను ఆసరా చేసుకొని బిజెపికి 303 సీట్లు సాధించిన ఆ పార్టీ.. ఇప్పుడు 240కి పరిమితమైంది. మ్యాజిక్ ఫిగర్ కు 32 సీట్ల దూరం లోనే ఉంది. 10 ఏండ్లు గా అధికారంలో ఉన్న ఎన్డీఏ మోడీ పాలనకు కాంగ్రెస్ ఆధ్వర్యంలోని ఇండియా కూటమి గట్టి పోటీ ఇచ్చింది.గత ఎన్నికలతో పోలిస్తే 63 సీట్లు మైనస్..' ఆప్ కి బార్ చార్ సౌ పార్ 'నినాదం బెడిచి కొట్టింది. మోడీ హవా దేశవ్యాప్తంగా వెలిగిపోతుం దని, తమకు ఎదురేలేదని, ఒంటరిగానే 370 సీట్లు దక్కించుకుంటా మన్న బిజెపి మ్యాజిక్ ఫిగర్ (272సీట్లు) కు దూరంలో ఓటర్లు నిల బెట్టారు. మోడీ నాయకత్వంలోని ఎన్డీఏ కూటమికి వచ్చినవి 292 మాత్రమే.

2019 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కేవలం 52 సీట్లు గెలుచుకోగా,.. ఈ ఎన్నికల్లో 99 సీట్లు గెలిచింది. ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తారు మారు చేస్తూ ఆ పార్టీ మంచి సిట్లను పొందింది. కాంగ్రెస్ పార్టీ నేతృ త్వంలోని ఇండియా కూటమి 234 సీట్లు కైవసం చేసుకుంది. ఇందులో ఉత్తర ప్రదేశ్ లో ఆ కూటమిలోని భాగస్వామి పక్షం సమా జవాది పార్టీ 37 సీట్లను గెల్చుకుంది. అదేవిధంగా కూటమిలోని టీఎంసీ పశ్చిమ బెంగాల్లో 29 సీట్లను కైవసం చేసుకుంది. ముఖ్యంగా యూపీలో కోలుకోలేని దెబ్బ కొట్టింది.2019 ఎన్నికల్లో ఈ రాష్ట్రంలో ఒక బీజేపీ నే 62 సీట్లను గెలుచుకుంది.ఇప్పుడు దాదాపు సగం సీట్లను కోల్పోయింది.



ఇండియా కూటమిలో భాగస్వామ్య పార్టీలలో సీట్ల పంచాయ తీతో20 నుండి 25 సీట్లను కోల్పోయింది.

' బీజేపీని దెబ్బతీయాలంటే.. రాబోయే లోకసభ ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థిని నిలబెట్టాలి. మనలో మనం పోటీ పడకూడదు' గత ఏడాది జులై 17న బెంగళూరులో జరిగిన ఇండియా కూటమి( 40 పార్టీలు ) సమావేశంలో సూత్రధాయంగా తీసుకున్న నిర్ణయం ఇది. ఆ తర్వాత ఆగస్టు 31, సెప్టెంబర్ 1 తేదీల్లో ముంబైలో జరిగిన సమావే శాల్లోనూ ఇది అంశంపై చర్చ జరిగింది.క్షేత్ర స్థాయిలో మాత్రం కొన్ని రాష్ట్రాల్లో ఇది సాధ్యం కాలేదు. స్నేహపూర్వక పోటీని కూటమి పక్షాలు ప్రకటించుకున్నాయి. ఇప్పుడు ఆ స్నేహపూర్వక పోటీలే కూటమి కొంపముంచాయని అభిప్రాయాలు వ్యక్తమ వుతున్నాయి.

మిత్రుల మధ్యాపోటి తో కోల్పోయిన సీట్లు : ఇండియా కూటమిలోని వంచిత్ బహుజన్ అఘాడి వంటి పలు చిన్న పార్టీలు కొన్ని చోట్ల కాంగ్రెస్ పై తమ అభ్యర్థులను నిలిపాయి. వీటి ద్వారా కొంతమేర నష్టం జరగ్గా.. కేరళ, పశ్చిమ బెంగాల్ పంజాబ్ లలో మాత్రం పూడ్చలేని నష్టం వాటిని. కాంగ్రెస్ కూటమి ఈ మూడు రాష్ట్రాలలో అదనంగా 11నుండి16 సీట్లు వచ్చి ఉండేవి. తాజా ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ స్నేహ పూర్వక పోటీ పంజాబ్ లో ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు విజయాన్ని కట్టబెట్టింది. పశ్చిమబెంగాల్లో ఇండియా కూటమిలోని టీఎంసీ,కాంగ్రెస్, సిపిఎం పరస్పర పోటీ వల్ల 8నుండి10 సీట్లలో బిజెపి పాగా వేసింది. కేరళ లోని త్రిచూర్ నియోజకవర్గంలో నుంచి నటుడు బిజెపి అభ్యర్థి సురేష్ గోపి ఘన విజయం సాధించారు. కేరళలో కాంగ్రెస్ గెలిచిన స్థానాల్లో చాలావరకు కమ్యూనిస్టులే రెండో స్థానంలో ఉన్నారు.

## కాంగ్రెస్, ఎస్‌పిలకు పెరిగిన ఓట్లు

# తగ్గిన బిజెపి ఓట్ షేర్

**న్యూఢిల్లీ:** ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తారుమారు చేస్తూ వెల్లడైన లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో, 2019తో పోలిస్తే, కాంగ్రెస్, సమాజ్‌వాది పార్టీ (ఎస్‌పి)లకు ఓట్లు పదెరగ్గా, బిజెపి ఓట్ షేర్ తగ్గింది. అప్పటి కంటే ఎక్కువ స్థానాల్లో బిజెపి పోటీ చేసినప్పటికీ, ఆ స్థాయిలో స్థానాలను కైవసం చేసుకోలేకపోయింది. అప్పుడు బిజెపి 303 స్థానాలను గెల్చుకోగా, ఎన్‌డిఎ బలం 353కు చేరింది. కానీ, ఈసారి ఎన్నికల్లో ఎన్‌డిఎకు 292 స్థానాలు దక్కించుకోగా, బిజెపి బలం 240కి పడిపోయింది. పోలైన ఓట్లలో వాటాను పరిశీలిస్తే, 36.57 శాతం ఓట్లు దక్కించుకుంది. గత ఎన్నికలతో పోలిస్తే ఇది దాదాపు 0.73 శాతం తక్కువ. కాగా, కాంగ్రెస్ ఓట్ల శాతం 1.74 శాతం పెరిగి 21.20 శాతానికి చేరుకుంది. 2019లో ఆ పార్టీ ఓట్ల శాతం 19.46గా నమోదైంది. అప్పుడు సాధించిన దాని కంటే రెట్టింపు స్థానాలను (99) కైవసం చేసుకుంది. రాజస్థాన్, హర్యానా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో కాంగ్రెస్ తన పరిస్థితిని మెరుగుపరచుకోవడం విశేషం. ఉత్తరప్రదేశ్‌లో, అఖిలేశ్ యాదవ్ నేతృత్వంలోని సమాజ్‌వాది పార్టీ (ఎస్‌పి)తో జతకట్టి, మెరుగైన ఫలితాలు రాబట్టింది. ఎస్‌పికి లభించిన ఓట్లు, 2019లో 2.55 శాతం నుండి 4.59 శాతానికి, అంటే దాదాపు రెట్టింపు అయింది. జనతాదళ్ (యునైటెడ్) 2019లో 1.45 శాతంతో పోలిస్తే 1.25 శాతం ఓట్లను సాధించడంతో దాని ఓట్ల వాటాలో స్వల్ప తగ్గుదల కనిపించింది. పశ్చిమ బెంగాల్‌లోని అధికార తృణమూల్ కాంగ్రెస్ 2019 ఎన్నికల్లో 4.06 శాతం ఉన్న ఓట్ల వాటా ఈసారి 4.37 శాతానికి పెరిగింది. మరోవైపు, మాయావతి నేతృత్వంలోని బహుజన్ సమాజ్ వాదీ పార్టీ (బిఎస్‌పి) ఓట్ల శాతం 1.58 శాతం తగ్గి 2.04 శాతానికి చేరుకుంది. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) 2019లో 0.44 శాతం ఓట్లను సంపాదించగా, ఈసారి 1.11 శాతానికి పెరిగింది. దక్షిణాది రాష్ట్ర పార్టీలలో, డిఎంకె ఓట్ల శాతం 2019లో 2.34 శాతం నుండి 1.82 శాతానికి పడిపోయింది. బిజెపికి ఆంధ్రప్రదేశ్‌లో మిత్రపక్షమైన టిడిపి ఓట్ షేర్ ఐదేళ్ల క్రితం 2.04 శాతం నుండి 1.98 శాతానికి స్వల్పంగా తగ్గింది. వైఎస్‌ఆర్‌సిపి 2019లో 2.53 శాతం ఉన్న ఓట్ల శాతం 2.06 శాతానికి తగ్గింది.

## అధికారంలో ఏ పార్టీ ఎంత కాలం...

భారత దేశానికి 1947లో స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత, 1951–52లో తొలి సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకూ కాంగ్రెస్ అత్యధికంగా 54 సంవత్సరాలా, 123 రోజులు అధికారంలో ఉంది. ఒక తాత్కాలిక ప్రధాని (గుల్జారీలాల్ నందా)సహా మొత్తం 7 ప్రధాన మంత్రులు ఆ పార్టీ తరఫున అధికారంలో ఉన్నారు. జవహరల్‌లాల్ నెహ్రూ, లాల్ బహదూర్ శాస్త్రి, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, పివి నరసింహారావు, మన్మోహన్ సింగ్ భారత ప్రధానులుగా సేవలు అందించారు. కాగా, బిజెపి, 16 సంవత్సరాలా, 90 రోజులు అధికారంలో ఉంది. ఇద్దరు ప్రధానులు, అటల్ బిహారీ వాజ్‌పేయి, నరేంద్ర మోదీ, ఆ పార్టీకి ప్రాతినిథ్యం వహించారు. జనతాదళ్ 2 సంవత్సరాలా, 269 రోజులు అధికారంలో కొనసాగింది. విశ్వనాథ్ ప్రతాప్ సింగ్, దేవెగౌడ, ఐకె గుజ్రాల్ ఈ పార్టీ తరఫున ప్రధాన మంత్రి హోదాలో కొనసాగారు. జనతా పార్టీ 2 సంవత్సరాలా, 126 రోజులు అధికారంలో ఉంది. ఆ పార్టీ తరఫున మొరార్జీ దేశాయ్ ప్రధానిగా ఉన్నారు. జనతా పార్టీ (సెక్యులర్) తరఫున చౌదరి చరణ్ సింగ్ 170 రోజులు అధికారంలో కొనసాగారు. సమాజ్‌వాది జనతా పార్టీ (రాష్ట్రీయ) 223 రోజులు అధికారంలో ఉండగా, చంద్రశేఖర్ ప్రధానిగా వ్యవహరించారు.

## ప్రధానులుగా నెహ్రూ రికార్డు..

అత్యధిక కాలం దేశ ప్రధానిగా కొనసాగిన రికార్డు జవహరల్‌లాల్ నెహ్రూ(కాంగ్రెస్/ మూడు పర్యాయాలు) పేరిట ఉంది. ఆయన 16 సంవత్సరాలా, 286 రోజులు అధికారంలో ఉన్నారు. ఇందిరా గాంధీ (కాంగ్రెస్/రెండు పర్యాయాలు) 15సంవత్సరాలా, 350 రోజులు, నరేంద్ర మోదీ (బిజెపి/ రెండు పర్యాయాలు) 10సంవత్సరాలా, 10 రోజులు, మన్మోహన్ సింగ్ (కాంగ్రెస్/ రెండు పర్యాయాలు) 10సంవత్సరాలా, 4రోజులు, అటల్ బిహారీ వాజ్‌పేయి (బిజెపి/రెండు పర్యాయాలు) 6 సంవత్సరాలా, 80 రోజులు, రాజీవ్ గాంధీ 5 సంవత్సరాలా, 32రోజులు, పివి నరసింహారావు(కాంగ్రెస్) 4సంవత్సరాలు, 330 రోజులు, మొరార్జీ దేశాయ్ (జనతా పార్టీ) 2సంవత్సరాలా, 126రోజులు, లాల్ బహదూర్ శాస్త్రి (కాంగ్రెస్) ఒక సంవత్సరం, 216 రోజులు, విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ (జనతాదళ్) 343 రోజులు, ఇందర్ కుమార్ గుజ్రాల్ (జనతాదళ్) 332రోజులు, హెచ్‌డి దేవెగౌడ (జనతాదళ్) 324 రోజులు, చంద్ర శేఖర్ (సమాజ్‌వాది జనతా పార్టీ (రాష్ట్రీయ) 223రోజులు, చరణ్‌సింగ్ (జనతా పార్టీ సెక్యులర్) 170రోజులు ప్రధానులుగా వ్యవహరించారు. గుల్జారీలాల్ నందా (కాంగ్రెస్) 13 రోజులు తాత్కాలిక ప్రధానిగా వ్యవహరించారు.

# '400కే పార్'.. రాజీవ్‌కే సాధ్యం..

'అబ్‌కే బార్.. చార్ సౌకే పార్' అంటూ ఈసారి సార్వత్రిక ఎన్నికల బరిలోకి దిగిన బిజెపికి తీవ్ర నిరాశ తప్పలేదు. 2019 ఎన్నికల కంటే తక్కువ సీట్లతో, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ఎన్‌డిఎలోని మిగతా మిత్ర పక్షాలపై ఆధారపాల్సిన దుస్థితిని ఎదుర్కొంటున్నది. లోక్‌సభలో 543 స్థానాలకుగాను 400కు మించి సీట్లను కైవసం చేసుకోవడం అనుకున్నంత సులభం కాదు. ఇప్పటి వరకూ అది కేవలం రాజీవ్ గాంధీకి మాత్రమే సాధ్యమైంది. ఇందిరా గాంధీ హత్య తర్వాత, తాత్కాలిక ప్రధానిగా బాధ్యతలు తీసుకున్న ఆమె కుమారుడు రాజీవ్ గాంధీ 1984 సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తిరుగులేని ఆధిక్యాన్ని సంపాదించిపెట్టాడు. రాజీవ్ గాంధీకి ఉన్న క్లీన్ ఇమేజ్‌కి తోడు ఇందిరా గాంధీ మృతి పట్ల సానుభూతి కూడా కలిసిరావడంతో కాంగ్రెస్ ఆ ఎన్నికల్లో 414 స్థానాలను గెల్చుకుంది. అ ఏడాది తొలుత 514 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ 404 స్థానాలను కైవసం చేసుకుంది. అనంతరం మిగతా స్థానాలకు పోలింగ్ జరగ్గా, మరో పది స్థానాలను సంపాదించుకుంది. అంతకు



ముందుగానీ, ఆ తర్వాతగానీ, మరే నాయకుడూ తన పార్టీకి ఈ స్థాయిలో మెజారిటీని అందించలేకపోయాడు. దేశ స్వాతంత్ర్యానంతరం కాంగ్రెస్ ఆధిపత్యం ఉన్నప్పటికీ, 1957లో అత్యధికంగా 371 స్థానాలను దక్కించుకుంది. అంతకు ముందు, 1951–52 నాటి తొలి ఎన్నికలతోపాటు, 1957, 1962, 1971 సంవత్సరాల్లో కాంగ్రెస్‌కు 300లకు పైగా సీట్లు లభించాయి. అయితే 1977లో ఎమర్జెన్సీ తర్వాత 154 సీట్లకు పడిపోయింది. 1980 నాటికి, కాంగ్రెస్ 353 స్థానాలకు పుంజుకుంది. ఓటింగ్ శాతాన్ని పరిగణలోకి తీసుకున్నా, 1984లో కాంగ్రెస్‌దే రికార్డు. ఆ పార్టీకి అత్యధికంగా 48.12 శాతం ఓట్లు లభించాయి. రాజీవ్ గాంధీకి అమేథీ నియోజకవర్గంలో అత్యధికంగా 83.67 శాతం ఓట్లు వచ్చాయి. 1984లో ఉత్తరప్రదేశ్, బీహార్, మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక, ఒడిశా వంటి రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఆధిపత్యం చెలాయించింది. అయినప్పటికీ, ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్, పంజాబ్ రాష్ట్రాల్లో తీవ్రంగా పోరాడాల్సి వచ్చింది. 1984లో సిక్కిం, త్రిపుర, దాద్రా నగర్ హవేలీలలో ఏ సీటును గెలుచుకోలేకపోయింది. అయితే, ఆతర్వాత 1989లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ 197 సీట్లకే పరిమితమై అధికారాన్ని కోల్పోయింది, జనతాదళ్ కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని అభినందించిన టిపిసిసి కార్యవర్గం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ సాధించిన ఫలితాలపై హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని టిపిసిసి కార్యవర్గం అభినందించింది. గతంలో మూడు పార్లమెంట్ స్థానాలకే పరిమితమైన కాంగ్రెస్.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో 8 స్థానాలకు చేరుకోవడంపై సంతోషం వ్యక్తం చేశారు. పిసిసి అధ్యక్షుడిగా , ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి కృషి ఫలితంగానే కాంగ్రెస్ 8స్థానాలు గెలుచుకుందని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, హర్కర వేణుగోపాల్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్,ఎంపీ మల్లు రవి, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిన్ రెడ్డి, ఫహీం ఖురేషీ, ఈరవత్రి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరాపై అసత్య ప్రచారాలు వద్దు

### బిఆర్ఎస్‌కు ఉద్యోగ సంఘం నేత కోటేశ్వరరావు హితవు

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** విద్యుత్ సరఫరాపై అసత్య ప్రచారాలు ఆపండని బిఆర్ఎస్ పార్టీ నేతలకు విద్యుత్ ఉద్యోగ సంఘం జాయింట్ సెక్రటరీ డి కోటేశ్వర రావు బుధవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలతో విద్యుత్ లైన్లపై పని చేయడం అత్యంత ప్రమాదకరమైన పని అని, వర్షాలు, ఈదురు గాలులతో లక్షల కిలోమీటర్ల పొడవునా ఉండే లైన్ల మీద చెట్ల కొమ్మలు పడ్డా ఫీడర్ ట్రిప్ అవుతుందని అన్నారు. ఎక్కడా విద్యుత్ సరఫరా నిలిచి పోకుండా తమ విద్యుత్ సిబ్బంది కృషి చేస్తున్నారన్నారు. పవర్ ట్రిప్‌ల సమస్యను పరిష్కరించేందుకు కొంత సమయం పట్టడం సహజం అని అంత మాత్రాన విద్యుత్ శాఖ సిబ్బందిని తిట్టుకోవడం సరికాదన్నారు. కేంద్ర ఇందన శాఖ రూపొందించిన పౌర సేవా పత్రం ప్రకారం ఎక్కడైనా విద్యుత్ అంతరాయం ఏర్పడితే దాన్ని సరిచేయడానికి నిర్దేశించిన సమయం నగరాలు, పట్టణాల్లో నాలుగు గంటలు, గ్రామాల్లో 6 గంటలు సమయం తీసుకోవచ్చని ఉందని, కానీ తమ అమూల్యమైన వినియోగదారులకు కోతల విషయంలో అసౌకర్యం కలగొద్దని రాత్రింబవళ్లు అన్న తేడా లేకుండా తమ సిబ్బంది పని చేస్తున్నారన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా, వనపర్తి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చాలా ప్రాంతాల్లో కరెంటు లైన్లు దెబ్బతిన్నాయని, తమ ఉద్యోగుల నిరంతర సేవలతో అతి తక్కువ కాలంలోనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారని కోటేశ్వరరావు అన్నారు. గత పదేళ్ల పాటు పెద్ద పెద్ద పదవులు అనుభవించిన వారు ఇప్పుడు చౌకబారు అసత్య ప్రచారాలు చేయడం, వాటిని తమ ట్విట్టర్ లో పోస్ట్ చేయడం మంచిది కాదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కావాలనే కొందరు విద్యుత్ సరఫరా పై సోషల్ మీడియా వేదికగా ట్విట్ చేస్తున్నారని ఆరోపించారు.

**రూ.200 కోట్ల టోకరా కేసులో..**

## పోలీస్ కస్టడీకి వాణిబాల కుటుంబం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎక్కువ వడ్డీ ఇస్తామని నమ్మించి డిపాజిట్ దారుల నెత్తిన రూ.200 కోట్లు కుచ్చుటోపి పెట్టిన నిందితులను సిసిఎస్ పోలీసులు బుధవారం కోర్టు అనుమతితో తమ కస్టడీలోకి తీసుకున్నారు. ఈ కేసులో నిందితులైన అపెక్స్ బ్యాంక్ జనరల్ మేనేజర్ వాణిబాల, ఆమె భర్త నేతాజి, కుమారుడు శ్రీహర్షలను వారం రోజుల క్రితం సిసిఎస్ పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. నిందితులను మరింతలోతుగా విచారించేందుకు కస్టడీకి ఇవ్వాలని దాఖలు చేసిన పిటిషన్‌కు కోర్టు సానుకూలంగా స్పందించింది. దీంతో చంచల్‌గూడ జైలులో ఉన్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వీరిని వీరు నిర్వహించిన ఆబిడ్స్‌లోని శ్రీప్రియాంక ఎంటర్‌ప్రైజెస్ కార్యాలయానికి తీసుకెళ్లారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. డిపాజిటర్ల నుంచి వసూలు చేసిన రూ.200 కోట్లు ఏమి చేశారనే కోణంలో వారిని విచారిస్తున్నారు. వీరి ఆస్తులు, ఇతర డిపాజిట్లు ఏమైనా ఉన్నాయా అని తెలుసుకుంటున్నారు. ఖాతాదారుల నుంచి తీసుకున్న డబ్బుతో స్టేషనరీ వ్యాపారాలు నిర్వహించినట్లుగా తేలింది. ఈ వ్యాపారంలో నిజంగా నష్టపోయారా లేక డబ్బును ఇతర మార్గాలకు తరలించారా అనే విషయాలపై కూడా ఆరా తీస్తున్నారు.వారి బ్యాంక్ ఖాతాలను సైతం పరిశీలిస్తున్నారు.

## నీట్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన గురుకుల విద్యార్థులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నీట్ ఫలితాలలో తెలంగాణ గురుకుల విద్యాలయాల సంస్థకు చెందిన 34 మంది విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించారు. 202324 విద్యా సంవత్సరానికి గాను 35 జూనియర్ కళాశాలలకు చెందిన సుమారు 34 మంది విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడం పట్ల తెలంగాణ గురుకుల విద్యాలయ సంస్థ కార్యదర్శి సి.హెచ్.రమణకుమార్ హర్శం వ్యక్తం చేశారు. ఆయా కళాశాల ప్రిన్సిపాల్స్‌ను, ఉపాధ్యాయులను, విద్యార్థులను ఆయన అభినంధించారు.

**135 మంది బిసి గురుకులాల విద్యార్థులు**

నీట్ ఫలితాల్లో మహాత్మా జ్యోతిభా పూలే బిసి గురుకుల సంస్థకుచెందిన 135 మంది విద్యార్థులు అర్హత సాధించారు. ఇందులో 120 మంది బాలికలు ,15 మంది బాలురు ఉన్నారు. ఏడుగురు బాలికలు, మరో ఏడుగురు బాలురు 400లకు పైగా మార్కులను సాధించారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ,బోధన సిబ్బందిని బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, బిసి గు రుకుల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు అభినంధించారు.

# డ్రగ్స్‌పై ప్రత్యేక నిఘా

### మొదలైన దాడులు
### మూడు చోట్ల పట్టుబడిన డ్రగ్స్ ముఠాలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పోలీసులు, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు డ్రగ్స్‌పై ప్రత్యేక నిఘా పెట్టారు. సరఫరాదారులు, అమ్మకందారులపై దాడులు నిర్వహిస్తూ డ్రగ్స్, గంజాయి, మత్తు మందుబాబులను అదపు చేసినా. ఎక్కడో ఒక్క చోట అక్రమార్కులు అమ్మకాలు తిరిగి సాగిస్తూనే ఉన్నారు. రోజు రోజుకు హైదరాబాద్‌తో పాటు చుట్టుపక్కడ పట్టణాల్లో గంజాయి, ఇతర మత్తు మందు మాదకద్రవ్యాల అమ్మకాలు జరుగుతూనే ఉన్నాయి. నిన్నమొన్నటి వరకు రేవ్ పార్టీల పేరుతో మత్తు మందుబాబులు విచ్చల విడిగా డ్రగ్స్‌ను వినియోగించారు. తెలంగాణలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం డ్రగ్స్‌ను తుదిముట్టించాలని నిర్ణయం తీసుకుంది. ఈ మధ్యనే ఎక్సైజ్‌తోపాటు పోలీస్ శాఖలకు డ్రగ్స్ వినియోగంపై కఠిన చర్యలు చేపట్టాలని స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అదేశించిన విషయం తెలిసిందే. సిఎం అదేశాల మేరకు తెలంగాణ అబ్కారీశాఖ కమిషనర్ ఇ. శ్రీధార్, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి. కమలాసన్ డ్రగ్స్ వినియోగంపై ఎక్కడిక్కడ కట్టడి చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలోనే సోమవారం కూకట్‌పల్లి ప్రాంతంలో షేక్ ఫారూఖ్ నుంచి ఎండిఎంఎ మత్తు మందును అమ్మకాలు జరుపుతుండగా సిఐ శ్రీధార్, ఎస్ఐ రఘుపతి పట్టుకున్నారు. రూ. 50 వేల విలువ చేసే 4.1 గ్రాముల డ్రగ్స్ పట్టుకున్నారు. మూడు రోజుల్లోనే మంచి ఫలితాలు సాధించిన సిబ్బందిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్ రెడ్డి అభినందించారు. అలాగే భద్రాచలం ప్రాంతంలో ఒరిస్సా, భువనేశ్వర్ ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్న గంజాయిని పెద్దా మొత్తంలో పట్టుకున్నారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో రూ. 1.73 కోట్ల విలువ చేసే గంజాయి, బెల్లం పట్టుకొని రికార్డులు సృష్టించారు. అనంతరం 30 గ్రాముల ఎండిఎంఎ, 80 గ్రాములు హేరాయిన్, 117.2 గ్రాములు 3.69 ఒపియంలను పట్టుకున్నారు. రెండు నెలల్లో భారీగా గంజాయి పట్టుబడిన సంఘటనలు ఉన్నాయి. హైదారాబాద్‌లో రూ. 1.70 కోట్ల విలువ చేసే మత్తుమందు, రూ. రెండు కోట్ల విలువ చేసే స్పిరిట్‌ను పట్టుకున్నారు. భద్రాచలంలో ఎక్కువగా గంజాయి పట్టుబడింది. మణుగూర్లో రూ. కోటి విలువ చేసే 477 కేజీల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఇదే భద్రాచలంలో 492 కెజిలు, 26 కెజిల గంజాయిని పట్టుకున్నారు. గతంలో ఎన్నడు లేని విధాంగా దాడులు నిర్వహిస్తూ ఒక వైపు నాటుసారా తయారీకి వినియోగించే బెల్లం, అలంతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి అవుతున్న మద్యాన్ని, మరో పక్క డగ్స్, ఇతర మత్తు మందులను పట్టుకున్నారు. రాబోయే ఆగస్టు నాటికి తెలంగాణలో డ్రగ్స్, గంజాయి, నాన్ పెయిడ్ లిక్కను అరికట్టడానికి లక్ష్యంగా అబ్కారీశాఖ ముందుకుసాగుతుంది.

**పిడి కేసులు కూడా పెడతాం : ఎక్సైజ్ కమిషనర్ శ్రీధర్**



తరచు డ్రగ్స్ నేరాలకు పాల్పడే నిందితులపై కఠినంగా వ్యవహరిస్తాం. అవసరమైతే వారిపై పిడి యాక్ట్‌ను ప్రయోగిస్తాం. డ్రగ్స్ రహిత తెలంగాణే మా లక్ష్యం.

## లోక్‌సభ ఎన్నికలు ఫలితాలు : బిజెపి, కాంగ్రెస్ గ్రాఫ్

| రాష్ట్రం /యుటి | బి.జె.పి సీట్లు | | కాంగ్రెస్ సీట్లు | |
|---|---|---|---|---|
| | 2024 | 2019 | 2024 | 2019 |
| 1. ఆంధ్రప్రదేశ్ (25) | 3 | 0 | 0 | 0 |
| 2. అరుణాచల్ ప్రదేశ్ (2) | 2 | 2 | 0 | 0 |
| 3.అసాం (14) | 9 | 9 | 3 | 3 |
| 4. బిహార్ (40) | 12 | 17 | 3 | 1 |
| 5. చత్తీశ్ఘడ్ (11) | 10 | 9 | 1 | 2 |
| 6. గోవా (2) | 1 | 1 | 1 | 1 |
| 7. గుజరాత్ (26) | 25 | 26 | 1 | 0 |
| 8. హర్యానా (10) | 5 | 10 | 5 | 0 |
| 9. జార్ఖండ్ (14) | 8 | 11 | 1 | 1 |
| 10. హిమాచల్‌ప్రదేశ్ (4) | 4 | 4 | 0 | 0 |
| 11. జమ్మూ–కాశ్మీర్ (5) | 2 | 3 | 0 | 0 |
| 12. కర్నాటక (28) | 17 | 25 | 9 | 1 |
| 13. కేరళ (20) | 1 | 0 | 14 | 15 |
| 14. మధ్యప్రదేశ్ (29) | 29 | 28 | 0 | 1 |
| 15. మహారాష్ట్ర (48) | 10 | 23 | 13 | 1 |
| 16. మణిపూర్ (2) | 0 | 1 | 2 | 0 |
| 17. మేఘాలయ (2) | 0 | 0 | 1 | 1 |
| 18. మిజూరం (1) | 0 | 0 | 0 | 0 |
| 19. నాగాలాండ్ (1) | 0 | 0 | 1 | 0 |
| 20. ఒడిశా (21) | 19 | 8 | 1 | 1 |
| 21. పంజాబ్ (13) | 0 | 2 | 7 | 8 |
| 22. రాజస్థాన్ (25) | 14 | 24 | 8 | 0 |
| 23. సిక్కిం (1) | 0 | 0 | 0 | 0 |
| 24. తమిళనాడు (38) | 0 | 0 | 9 | 8 |
| 25. తెలంగాణ (17) | 8 | 4 | 8 | 3 |
| 26. త్రిపుర (2) | 2 | 2 | 0 | 0 |
| 27. ఉత్తరప్రదేశ్ (80) | 33 | 62 | 6 | 1 |
| 28. ఉత్తరాఖండ్ (5) | 5 | 0 | 0 | 0 |
| 29. పశ్చిమబెంగాల్ (42) | 12 | 18 | 1 | 2 |
| 30. అండమాన్‌నికోబార్(1) | 1 | 0 | 0 | 1 |
| 31. చండీఘర్ (1) | 0 | 1 | 1 | 0 |
| 32. దాద్రానగర్‌హవేలి (1) | 1 | 0 | 0 | 0 |
| 33. లక్షద్వీప్ (1) | 0 | 0 | 1 | 0 |
| 34. ఢిల్లీ (7) | 7 | 7 | 0 | 0 |
| 35. పుదుచ్చేరి (1) | 0 | 0 | 1 | 1 |

## కార్మిక హక్కులను కాలరాసిన మోదీ ప్రభుత్వం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** నాటి కాంగ్రెస్ కేంద్ర ప్రభుత్వ హయాంలో కష్టపడి సాధించుకున్న ప్రాథమిక కార్మిక హక్కులను మోడీ ప్రభుత్వం కాలరాసిందని, కార్మికుల జీవనోపాధి, పని పరిస్థితులపై కనికరంలేకుండా దాడి చేసిందని ఐఎన్‌టియుసి జాతీయ అధ్యక్షులు అంబటి కృష్ణమూర్తి ఆరోపించారు. మెజార్టీ రాకపోయినా బిజెపి అడ్డదారిన కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తోందన్నారు. మరోసారి మోదీ ప్రధాని అయితే కార్మికుల ఉద్యోగాలు, హక్కులు, రక్షణ నిబంధనలు పుర్తిగా తొలగిస్తారని,బడా కార్పొరేట్లకు దోపిడీని సులభతరం చేస్తారని ఆరోపించారు. బి zజెపి కార్మిక వ్యతిరేక విధానాలను అడ్డుకునేందుకు కార్మిక సంఘాల ఐక్య పోరాటాలను బలోపేతం చేయడం తక్షణ అవసరమన్నారు. భారతీయ కార్మిక సంఘాల సమాఖ్య అధ్యక్షులు గొల్లపల్లి దయానంద్ రావు అధ్యక్షతన హైదరాబాద్,గన్ ఫౌండ్రి,ప్యూపిల్స్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ హాల్‌లో బుధవారం ఐఎన్‌టియుసి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ముఖ్యకార్మిక నేతల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అంబటి కృష్ణమూర్తి ముఖ్యఅతిథిగా హాజరవ్వగా, ఐఎన్‌టియుసి సీనియర్ నేతలు, మాజీ కేంద్ర మంత్రులు సర్వే సత్యనారాయణ, ఎస్.వేణుగోపాలచారి విశిష్ట అతిథులుగా, ఐఎన్‌టియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి బి. అమర్ బాబు, కార్యదర్శి ఎన్. నాగరాజ్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శి గుంజ శ్రీనివాస్, గూడా ఐలయ్య గౌడ్, సంఖ్యాశాస్త్రవేత్త దైవజ్ఞ శర్మ, సంఘ సంస్కర్తలు విజిఆర్. నారగోని, సిహెచ్. బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్వే సత్యనారాయణ మాట్లాడుతూ అధిక వేతనాలు,మెరుగైన పని పరిస్థితులు, కార్మికుల సంక్షేమం,వారి అభ్యున్నతి కోసం ఐఎన్‌టియుసి అనేక దశాబ్దాలుగా పోరాటాలు చేస్తుందన్నారు. ఆధునిక టెక్నాలజీ యుగంలో కార్మికుల, ఉద్యోగాలు హక్కులు ప్రమాదంలో పడ్డాయని, వీటిని ఎదుర్కోనేందుకు కార్మిక ఉద్యమానికి కొత్తగా దిశానిర్దేశం చేయాల్సిన అవసరముందన్నారు. ఎస్.వేణుగోపాలచారి మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా విభజించడంతో కార్మికుల వేతనాలు, వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితులు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. మోదీ ప్రభుత్వం రద్దు చేసిన ఇరవై తొమ్మిది కార్మిక చట్టాలను తిరిగి సాధించుకునేందుకు దేశ వ్యాప్తంగా ఉద్యమాలు బలోపితం చేయాలని కోరారు. అనంతరం అంబటి కృష్ణమూర్తి 61 వ జన్మదిన సంబరాలను ఐఎన్‌టియుసి నేతలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కేక్ కట్ చేయించి, శాలువాలతో ఆయనను సత్కరించారు.

## మాదిగ జనసభ పోస్టర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మాదిగల జనసభ పోస్టర్‌ను బుధవారం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. మాదిగ జెఎసి వ్యవస్థాపకులు, ఎస్‌సి కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి.రవి అధ్యక్షతన నిర్వహించిన జనసభ పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు వక్కలగడ్డ.చంద్రశేఖర్, మాదిగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గడ్డే.యాదయ్య, డా.బి.ఆర్.అంబేద్కర్ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు గజ్జెల్లి మల్లిఖార్జున్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిడమర్తి రవి మాట్లాడుతూ మాదిగలకు 12% రిజర్వేషన్ సాధనే లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలలో ఈ నెల 7న నిర్వహించనున్న మాదిగల జనసభను జయప్రదం చేయాలని మాదిగ జే.ఏ.సి. మరియు అనుబంధ సంఘాల రాష్ట్ర,జిల్లా నాయకులను కోరారు.

# హైదరాబాద్‌లో వరి ప్రపంచ సదస్సు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రపంచ వరి సదస్సుకు హైదరాబాద్ నగరం వేదిక కానుంది. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. తెలంగాణ రాష్ట్ర సహకారంతో అమెరికాకు చెందిన అంతర్జాతీయ కమాడిటీస్ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 7,8, తేదీల్లో రెండు రోజుల పాటు హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో నిర్వహించనున్నారు. ఈ సదస్సులో ప్రపంచ ప్రఖ్యాత సంస్థ అంతర్జాతీయ వరి పరిశోధనా సంస్థ, అంతర్జాతీయ వ్యవసాయ పరిశోధన సంస్థల కన్సార్టియం (సిజిఐఎఆర్)తో పాటు భారతదేశ వరి పరిశోధన సంస్థ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని చంద్రశేఖర్ ఆజాద్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఒరిస్సాలోని వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, భారతదేశ వరి ఎగుమతిదారుల ఫెడరేషన్ (ఐఆర్ఈఈ), ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ (ఫిక్కి), టిఆర్ఇఎ (వరి ఎగుమతిదారుల అసోసియేషన్), తదితర సంస్థల ప్రతినిధులతో పాటు దాదాపు 30 దేశాల నుంచి దాదాపు 150 మంది అంతర్జాతీయగా ధాన్యం ఎగుమతి, దిగుమతి దార్లతో పాటు ఫిలిప్పైన్స్‌లోని అంతర్జాతీయ వరి పరిశోధన సంస్థ ప్రముఖ వరి శాస్త్రవేత్తలు, దేశంలోని ఇతర రాష్ట్రాల నుంచి మరో 150 మంది వరి ధాన్యం ఎగుమతిదారులు, వరి విత్తన కంపెనీల ప్రతినిధులు వ్యవసాయ శాస్త్రవేత్తలు, తెలంగాణలోని 30 మంది అభ్యుదయ రైతులు, 30 మంది రైస్ మిల్లర్లకు పలు పంచుకోనున్నారు.

**రాష్ట్ర రైతులు, ఎగుమతిదారులు మంచి అవకాశం**

హైదరాబాద్ వేదికగా ఈనెల 7,8 తేదీలో జరగనున్న ప్రపంచ వరి సదస్సు రాష్ట్ర రైతులతో పాటు వరి ధాన్యం ఎగుమతి, దిగుమతిదార్లుకు ఎంతో ఉపయోగ పడనుంది. మనదేశంలో స్వాతంత్ర్యం తర్వాత బియ్యం ఉత్పత్తి దాదాపు 8 రెట్లు పెరిగి ప్రస్తుతం 14 కోట్ల మెట్రిక్ టన్నులకు చేరింది. ఇదే క్రమంలో ప్రస్తుతం ప్రపంచంలోని అభివృద్ధి చెందిన యూరప్, అమెరికా, ఆస్ట్రేలియా వంటి దేశాలే కాకుండా ఆఫ్రికా ఖండంలోనే అనేక దేశాలు, లాటిన్ అమెరికాలో కొన్ని దేశాలు వరి దిగుమతులకు సంబంధించి భారత్ వైపు చూస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రపంచ వరి సదస్సు రూపంలో అంది వచ్చిన ఈ అవకాశాలను రైతాంగం పూర్తిస్థాయిలో వినియోగించుకున్నట్లైతే మన భారతదేశం ముఖ్యంగా మన తెలంగాణ రైతాంగానికి సరైన ధరతో పాటు పెద్దమొత్తంలో ఉన్న మార్కెట్ నిల్వల సమస్య పరిష్కరించుకునేందుకు మార్గం సుగమమం కానుంది. అయితే ఇతర రాష్ట్రాల వారితో పోలిస్తే తెలంగాణ రాష్ట్ర ఎగుమతిదారులకు అధిక రవాణా ఖర్చులు, హ్యాండ్లింగ్ చార్జీలతో పాటు మన రాష్ట్రంలో పండే బియ్యంలో అధికంగా ఉండే పురుగుమందు అవశేషాలు, భూగర్భ జలాల కాలుష్యంతో ఆర్సెనిక్ విలువలు పెరగడంలాంటివి ప్రతిబంధకంగా మారుతున్నాయి. ఈ తరుణంలో కొత్తగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సమస్యలకు పరిష్కారం చూపించే దిశలో భాగంగా భారతదేశంలో మొట్టమొదటిసారిగా అందర్నీ ఒక దగ్గరికి తీసుకువచ్చి అంతర్జాతీయ కమాడిటీస్ సంస్థ సహకారంతో ప్రపంచ వరి సదస్సును నిర్వహిస్తుంది. ఈ సదస్సు ద్వారా దిగుమతి, ఎగుమతిదారులకు ఒక వేదిక కల్పించి వ్యాపార అవకాశాలు వృద్ధి చేయడం ద్వారా తెలంగాణలో వరి పండించే రైతులందరికి దోహదపడేలా వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చోరవతో సదస్సును అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

**బియ్యం ఎగుమతుల్లో భారత్ – వినియోగంలో చైనా మొదటి స్థానం**

ప్రపంచ దేశాల్లో బియ్యం ఎగుమతుల్లో భారత్ ప్రథమ స్థానంలో ఉండగా, వినియోగంలో చైనా మొదటి స్థానంలో ఉంది. ప్రతి ఏటా బియ్యం వినియోగంలో చైనా (155.0మిలియన్ మెట్రిక్ టన్నులు), భారత్ (114.5 మిలియన్ మెట్రిక టన్నులు) రెండవ స్థానంలో ఉంది. తర్వాత బంగ్లాదేశ్ (37.5 మిలియన్ మెట్రిక్ టన్నులు), ఇండోనేషియా (35.6 మిలియన్ మెట్రిక్ టన్నులు), వియాత్నం (21.9 మిలియన్ మెట్రిక్ టన్నులు) ఉండగా మిగిలిన దేశాల ఈ తర్వాత స్థానాల్లో ఉన్నాయి. అయితే ప్రపంచ వ్యాప్తంగా వరి ధాన్యం (బియ్యం) అత్యధికంగా దిగుమతి చేసుకునే దేశాల్లో ఫిలిప్పైన్స్ సంవత్సరానికి (3.065 మిలియన్ మెట్రిక్ టన్నులు) మొదటి స్థానంలో ఇంది. వీటి 1.18 మిలియన్ యుఎస్ డాలర్లుగా ఉంది. అ తర్వాత చైనా, ఇరాక్, బెనిస్, మొజాంబిక్ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. 2022–23 ఆర్థిక సంవత్సరంలో 191 దేశాలు 420లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని దిగుమతి చేసుకున్నాయి. బియ్యం ఎగుమతులకు సంబంధించి ప్రపంచంలో భారత్‌దే ప్రథమ స్థానంలో ఉంది.

**గత ఏడాది వివిధ దేశాల బియ్యం ఎగుమతుల వివరాలు**

| దేశం | మెట్రిక్ టన్నులు మిలియన్లలో | యుఎస్ డాలర్లు మిలియన్లలో |
|---|---|---|
| భారతదేశం | 17.866 | 9400.16 |
| థాయ్‌లాండ్ | 6.786 | 3544.30 |
| వియాత్నం | 4.776 | 1990.66 |
| పాకిస్థాన్ | 3.124 | 1692.84 |
| చైనా | 2.071 | 822.42 |



**గత 5 ఏళ్లలో ప్రపంచ దేశాల్లో బియ్యం ఉత్పత్తి వివరాలు**

| సంవత్సరం | ప్రపంచం (మె.టన్నులు లక్షల్లో) | భారతదేశం (మె. టన్నులులక్షల్లో) | తెలంగాణ (మె .టన్నులులక్షల్లో) | ప్రపంచ ఉత్పత్తిలో భారత్ శాతం | భారత్ ఉత్పత్తిలో తెలంగాణ శాతం |
|---|---|---|---|---|---|
| 2018–19 | 7656.78 | 1164.78 | 66.7 | 15.21% | 5.73% |
| 2019–20 | 7537.97 | 1188.71 | 74.28 | 15.77% | 6.25% |
| 2020–21 | 7725.44 | 1234.68 | 102.17 | 15.98% | 8.28% |
| 2021–22 | 7790.45 | 1294.71 | 129.11 | 16.41% | 9.59% |
| 2022–23 | 7764.61 | 1357.55 | 158.77 | 17.48% | 11.70% |
| 2023–24 | 7200.45 | 1367.00 | 166.31 | 18.98% | 12.17% |

## పర్యావరణాన్ని కాపాడుకోవాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షులు ఎం.కోదండ రెడ్డి గాంధీ భవన్ ప్రాంగణంలో బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో పర్యావరణ సమతుల్యం లోపించడంతో అనేక విపత్తులు సంభవిస్తున్నాయని అన్నారు. దుబాయ్ వర్షాలతో అతలాకుతలం అవుతోందన్నారు. ఒక్కప్పుడు పర్యావరణ సమతుల్యంతో సహజంగా వర్షాలు కురిసేవన్నారు. ఇప్పుడు అన్ని కాలాల్లో వ్యత్యాసలను చూస్తున్నామన్నారు. భూగర్భ జలాలు అడుగంటిపోకుండా ఉండాలంటే పర్యావరణాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పర్యావరణం సమత్యం లేక హైదరాబాద్ ప్రాంతం అనేక ఇబ్బందులు ఎదుర్కుటోందన్నారు.

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR WARANGAL**

**ARB.NO. 332 of 2024**

Between:

**M/s. Akshayadharani Chit Funds Pvt. Ltd., Warangal Branch** ..... **Disputant**

And

**SRI. DUNNA AMBEDKAR & Others** .....**Opponents**

To,

**Opp.No. 1.** Sri. Dunna Ambedkar, S/o. Pichaiah, Age: 45 Years, Occ: Advocate. R/o. H.No: 6-36/3, 1st Floor, Budha Nagar, Boduppal, Hyderabad, Telangana.-500092.

**Opp.No. 2.** Sri. Dunna Indira, D/o. Pichaiah, Age: 48 Years, Occ: Staff Nurse, Employee Code: 1959122. Area Hospital Vaidya Vidhana Parshad, Ramannapet, Yadadri Bhuvanagiri, Telangana.-508113. R/o. Plot No: 07, Sri Sai Dwarakapuri Colony, Charlapally, Nalgonda, Telangana.-508001.

**Opp.No. 3.** Sri. Nelavelli Sneha Latha, D/o. Bhaskar Rao, Age: 41 Years, Occ: Asst. Manager, Employee Code: 23699. The NDCC ( Nalgonda Dist. Co-oprative Central ) Bank, Bhuvanagiri, Telangana.-508116. R/o. H.No: 6-36/3, Road No: 07, Budha Nagar, Boduppal, Hyderabad, Telangana.-500092

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on.**14-06-2024** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** before the Deputy Registrar referred above. Otherwise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATION, WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR WARANGAL**

**ARB.NO. 333 of 2024**

Between:

**M/s. Akshayadharani Chit Funds Pvt. Ltd., Warangal Branch** ..... **Disputant**

And

**SRI. A. RAMAKRISHNA & Others** .....**Opponents**

To,

**Opp.No. 3.** Sri. Komaram Nagabhushanam, S/o. Buchi Ramaiah, Age: 48 Years, Occ: Teacher (School Assistant), Employee No: 1537052. O/o. K.R.M. Zilla Parishad High School, Gajasingavaram, Gambhiraopet, Rajanna Sircilla, R/o. H.No: 4-5-107, Near: High School, Ambedhakar Nagar, Rajanna Siricilla, Telangana.-505301.

**Opp.No. 4.** Sri. Mohammed Abdul Quddus, S/o. Basheer Hussain, Age: 54 Years, Occ: M.P.H.E.O., Employee No: 1505295. O/o. P.H.C. Ellanthakunta, Rajanna Siricilla, R/o. H.No: 2-7-647, Mukarampuram, Near: Collectorate Office, Karimnagar, Telangana.-505001. C/o. H.No: 3-2-81, Savaran Street, Karimnagar, Telangana.-505001.

**Opp.No. 5.** Sri. Mekala Kumar, S/o. Lingaiah, Age: 54 Years, Occ: Police Constable, PC No: 2323, Employee No: 1507446. O/o. Police Station Jagitial Town, Jagitial, R/o. H.No: 5-24/12/1/B, Near: Sai Baba Temple, By Pass Roadm Jagitial, Telangana.-505327.

**Opp.No. 6.** Sri. Bhokya Ramjee Naik, S/o. Mangya Nayak, Age: 46 Years, Occ: Teacher (School Assistant), Employee No: 1536304. O/o. K.R.M. Zilla Parishad High School, Gajasingavaram, Gambhiraopet, Rajanna Siricilla, R/o. H.No: 1-89/9, Sevalal Thanda, Mustabad, Rajanna Siricilla, Telangana.-505404.

**Opp.No. 8.** Sri. Peddi Charan Raj, S/o. Sriramullu, Age: 36 Years, Occ: Business, Prop: Sri Dartta Computers Sales & Services, Gopal Nagar, Rajanna Siricilla, R/o. H.No: 5-4-6, Parupelly, siddipet, Telangana.-502103. C/o. H.No: 12-6-62, Gopal Nagar, Rajanna Siricilla, Telangana.-502301.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on.**14-06-2024** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** before the Deputy Registrar referred above. Otherwise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATION, WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR WARANGAL**

**ARB.NO. 327 of 2024**

Between:

**M/s. Akshayadharani Chit Funds Pvt. Ltd., Warangal Branch** ..... **Disputant**

And

**SRI. Y. VISHWANATH & Others** .....**Opponents**

To,

**Opp.No. 2.** Sri. Peyyala Venkateshwarlu, S/o. Malyadri, Age: 37 Years, Occ: Office Subordinate, Employee No: 2323. O/o. Telangana State Civil Supplies Corporation Ltd., R/o. H.No: 8-2-603/H/15, Road No: 10, Income Tax Quaaters, Guru Brahma Nagar, Banjara Hills, Hyderabad,

**Opp.No. 5.** Smt. Taluka Maheswari, W/o. Vijendar, Age: 39 Years, Occ: Office Subordia-nate, Employee No: 2325. O/o. Telangana State Civil Supplies Corporation Ltd., R/o. H.No: 10-4-22/A, Ligojiguda, Saroor Nagar, L.B. Nagar, Ranga Reddy, Telangana. 500035

**Opp.No. 6.** Smt. Arram Padma, W/o. Suresh, S/o. Srinivas Rao, Age: 42 Years, Occ: Office Subordinate, Employee No: 2385. O/o. Telangana State Civil Supplies Corporation Ltd., R/o. H.No: 1-3-445/10/5, Kavadiguda, Muggu Basti, Musheerabad, Hyderabad, Telangana. 500080

**Opp.No. 7.** Sri. Soma Rajendar, S/o. Venkat Narayana, Age: 43 Years, Occ: Assistant Grade II, Employee No: 2152. O/o. Telangana State Civil Supplies Corporation Ltd., R/o. H.No: 4-185/180, Mythri Sripuram, Pedda Amberpet, Hayath Nagar, Hyderabad, C/o. H.No: 4-1-216/102, Karthikeya Nagar, Nacharam, Uppal, K.V. Rangar Reddy, Telangana.-500076

**Opp.No. 8.** Sri. Gullapalli Rajesh Kumar, S/o. Sadhanandam, Age: 36 Years, Occ: Private Employee, R/o. H.No: 11-18-1092, Vivekananda Colony, Kashibugga, Warangal, C/o. H.No: 45-101, Uppur Guda, Moulali, Hyderabad, Telangana. 500047

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on.**14-06-2024** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** before the Deputy Registrar referred above. Otherwise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATION, WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR WARANGAL**

**ARB.NO. 328 of 2024**

Between:

**M/s. Akshayadharani Chit Funds Pvt. Ltd., Warangal Branch** ..... **Disputant**

And

**SRI. T. SHARADHA & Others** ....**Opponents**

To,

**Opp.No. 4.** Sri. Sirikonda Sree Vidya, D/o. Sudhakar Rao, Age: 49 Years, Occ: Staff Nurse, Employee Code: 2152330. O/o. M.G.M. Hospital, Warangal, R/o. H.No: 3-9-106/1, Reddy Colony, Hanamkonda, Telangana.-506001,

**Opp.No. 6.** Sri. Jabu Lavanya, D/o. Narsimha Murthy, Age: 40 Years, Occ: Staff Nurse, Employee Code: 2152228. O/o. M.G.M. Hospital, Warangal, R/o. H.No: 2-388/1/D, Bank Colony, K.U, Opp: S.R. Digi School, Bheemaram, Hanamkonda, Telangana.-506015.

**Opp.No. 7.** Sri. Bonkuri Satya Sree, D/o. Satyanarayana, Age: 48 Years, Occ: Staff Nurse, Employee Code: 2152188. O/o. M.G.M.Hospital, Warangal, R/o. H.No: 6, Unmarried Nurses Hostel, M.G.M. Compos, Warangal, Telangana.-506007

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on.**14-06-2024** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** before the Deputy Registrar referred above. Otherwise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATION, WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR, WARANGAL**

**ARB.NO. 329 of 2024**

Between:

**M/s. Akshayadharani Chit Funds Pvt. Ltd., Warangal Branch** ..... **Disputant**

And

**SRI. SHAIK AZEEM & Others** .....**Opponents**

To,

**Opp.No. 1.** Sri. Shaik Azeem, S/o. Chotamiya, Age: 36 Years, Occ: Private Employee (Manager), O/o. Celekart Bobile Store, Uppal Road, Hyderabad, Telangana. R/o. Plot No: 70, Kamala Nagar, Near: Axis ATM, Medipally, Ghatkesar, Ranga Reddy, Telangana. - 500098.

**Opp.No. 2.** Sri. Bommagani Bhanu Chander, S/o. Narsaiah, Age: 35 Years, Occ: Police Constable (Civil Including Police Women Constable), P.C. 6760. Employee Code: 1471153. O/o. P.S. Malkajgiri, Rachakonda City, Hyderabad, Telangana.-500047. R/o. H.No: 1-37, Wangapally, Yadadri, Telangana.-508206.

**Opp.No. 3.** Sri. Mohamad Ramzan, S/o. Osman, Age: 43 Years, Occ: Village Revenue Officer, Employee Code: 2042531. O/o. Vill: Karatikal, Dist: Yadadri, Telangana.-508111. R/o. H.No: 5-41, Vill: Aroor, Mdl: Vallgonda, Dist: Yadadri, Telangana.-508112.

**Opp.No. 4.** Sri. Kethavath Narsimma, S/o. Ramachandru, Age: 33 Years. R/o. H.No: 2-106/1, A.T.B. Thanda, Bhongiri, Dist: Yadadri, Telangana.- 508285

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on.**14-06-2024** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** before the Deputy Registrar referred above. Otherwise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATION, WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR WARANGAL**

**ARB.NO. 330 of 2024**

Between:

**M/s. Akshayadharani Chit Funds Pvt. Ltd., Warangal Branch** ..... **Disputant**

And

**SRI. MD. RAFEEQ PASHA & Others** .....**Opponents**

To,

**Opp.No. 1.** Sri. Mohammed Rafeeq Pasha, S/o. Lal Mohammed, Age: 47 Years, Occ: M.A Hindi Pandith, O/o. Raos Techno International School, Hasanparthy, Hanamkonda, R/o. H.No 14-7-162/2, Nizampura, Charbouli, Warangal, Telangana. - 506002.

**Opp.No. 2.** Sri. Mohammed Sarwar Pasha, S/o. Afzal, Age: 45 Years, Occ: Male Nursing Order, Employee Code: 2109531. O/o. M.G.M Hospital, Warangal, R/o. H.No: 11-23-1240/A, L.B Nagar, Warangal, Telangana.-506002.

**Opp.No. 3.** Sri. Mirza Anwar Baig, S/o. Dawood Baig, Age: 48 Years, Occ: Attender GWMC, O/o. Greater Warangal Municipal Corporation, Warangal, R/o. H.No: 14-7-162, Nizampura, Charbouli, Warangal, Telangana.-506002.

**Opp.No. 4.** Sri. Mohammed Sajid Ahmed, S/o. Yahiah, Age: 52 Years. Occ: Dy Inspector of Survey Employee Code: 2117709 O/o. Revenue Divisinol Officer, Kothagudem,. R/o. H.No: 14-7-170, Nizampura, Charbouli, Warangal, Telangana – 506002.

**Opp.No. 5.** Sri. Shaik Afzal, S/o. Yakub Ali, Age: 37 Years, Occ: Bussiness, Afzal Mission Tools & Marbel Works, Mandibazar, Warangal, R/o. H.No: 9-2-168, Charbouli, Warangal, Telangana.-506002

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on.**14-06-2024** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** before the Deputy Registrar referred above. Otherwise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATION, WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR WARANGAL**

**ARB.NO. 331 of 2024**

Between:

**M/s. Akshayadharani Chit Funds Pvt. Ltd., Warangal Branch** ..... **Disputant**

And

**SRI. KARRA RAMAIAH & Others** .....**Opponents**

To,

**Opp.No. 1.** Sri. Karra Ramaiah, S/o. Kistaiah, Age: 53 Years, Occ: Police Head Constable, Employee No: 2111687. R/o. H.No: 55-3-351/2/13, Nakshatra Colony, Gopalpuram, Hanamkonda, Telangana.-506009.

**Opp.No. 2.** Sri. Mohd Rafi, S/o. Razak, Age: 50 Years, Occ: Police Constable, Employee No: 2112666. R/o. H.No: 5-11-1358/3, Hanuman Nagar, Vidyaranyapuri, Hanamkonda, Telangana.-506009.

**Opp.No. 3.** Sri. Chittireddy Chiranjeevi, S/o. Srinivasa Reddy, Age: 42 Years, Occ: Police Constable, Employee No: 2104881. R/o. H.No: 4-1-284, Opp: St. Grammer High School, Kumarpally, Hanamkonda, Telangana.-506001.

**Opp.No. 4.** Sri. Akula Srinivas, S/o. Sambaiah, Age: 48 Years, Occ: Police Head Constable, Employee No: 2112677. R/o. H.No: 5-11-38/A, Near: Tejaswani High School, Naimnagar, Hanamkonda, Telangana.-506009.

**Opp.No. 5.** Sri. Boilla Ravi, S/o. Rathna, Age: 49 Years, Occ: Police Constable, Employee No: 2112756. R/o. H.No: 2-210, 2nd Ward, Chalvai, Govindarapeta, Mulugu, Telangana.-506344. C/o. H.No: 5-4-267, Bokkalagadda, Eid Road, Kumarpalli, Hanamkonda, Telangana.-506001.

**Opp.No. 6.** Sri. Sirikonda Ramanarsimha Rao, S/o. Srinivas Rao, Age: 48 Years, Occ: Police Head Constable, Employee No: 2112738. R/o. H.No: 1-7-335/1, Revenue Colony, Subedari, Hanamkonda, Telangana.-506001.

**Opp.No. 7.** Sri. Ainavolu Vijay Kumar, S/o. Madhu Sudhan Rao, Age: 49 Years, Occ: Police Constable, Employee No: 2112738. R/o. Q.No: B/10, New Block, Police Head Quaters, Hanamkonda, Telangana.-506009

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on.**14-06-2024** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** before the Deputy Registrar referred above. Otherwise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATION, WARANGAL**

# సిఆర్ ఫౌండేషన్‌కు బర్దన్ మేనల్లుడు విరాళం

ప్రజాపక్షం/హైదరాబాద్ : సిఆర్ ఫౌండేషన్‌కు పిఇ ఇంజనీర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ అధినేత రాజీవ్ మహాదేవ్ రూ.4లక్షల విరాళం ఇచ్చారు. హైదరాబాద్‌లో నివాసం ఉండే ఆయన సిఆర్ ఫౌండేషన్ మాజీ గౌరవ అధ్యక్షుడు, సిపిఐ మాజీ ప్రధాన కార్యదర్శి ఎబిబర్ధన్‌కు స్వయాన మేనల్లుడు. విరాళానికి సంబంధించిన చెక్కును సిఆర్ ఫౌండేషన్ కార్యదర్శి, మాజీ ఎంఎల్‌సి పిజె.చంద్రశేఖరరావుకు అందజేశారు. రాజీవ్ మహాదేవ్‌కు సిఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ కె.నారాయణ, ప్రధాన కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు.

# సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన వరంగల్ ఎంపి కడియం కావ్య



ప్రజపక్షం/హన్మకొండ ప్రతినిధి : హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని సిఎం నివాసంలో వరంగల్ లోక్‌సభ స్థానం నుంచి భారీమెజార్టీతో విజయం సాధించిన డాక్టర్ కడియం కావ్య, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి బుధవారం సిఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి వరంగల్ పార్లమెంటు స్థానం నుంచి భారీ మెజార్టీతో విజయం సాధించిన డాక్టర్ కడియం కావ్యను రేవంత్‌రెడ్డి అభినందించారు. వీరితో పాటు మంత్రి కొండా సురేఖ, పరకాల, స్టేషన్ ఘన్‌పూర్, వర్ధన్నపేట, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యేలు కేఆర్ నాగరాజు, నాయిని రాజేందర్‌రెడ్డి, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, డీసీసీబి చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, కాంగ్రెస్ నాయకులు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బిజెపితో బిఆర్‌ఎస్ కుమ్మక్కు

## నీలం మధు నైతికంగా విజయం సాధించారు

## మెదక్ జిల్లా కాంగ్రెస్ నేతలు



ప్రజాపక్షం/నర్సాపూర్ : పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపితో బిఆర్‌ఎస్ నేతలు కుమ్మక్కయ్యాయని మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆవుల రాజిరెడ్డి ఆరోపించారు. బుధవారం నర్సాపూర్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు తెరవెనక రాజకీయం చేసి బిజెపితో కుమ్మక్కై బిజెపి అభ్యర్థి రఘునందన్‌రావును గెలిపించారని ఆరోపించారు. సిద్దిపేట నుంచి బిఆర్‌ఎస్ అభ్యర్థికి లక్ష మెజారిటీ అందిస్తానని మాజీ మంత్రి హరీష్‌రావు ప్రకటనలు చేసి కేవలం 2వేల మెజార్టీ అందించడమే అందుకు నిదర్శనమన్నారు. కాంగ్రెస్ పార్టీని దెబ్బతీసేందుకే మాజీముఖ్యమంత్రి కెసిఆర్, మాజీమంత్రి హరీష్‌రావులు బిజెపితో రహస్య ఒప్పందం కుదిరించుకున్నారని తెలిపారు. బిఆర్‌ఎస్ పార్టీని బిజెపిలో విలీనం చేయాలని వారు సూచించారు. కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధుకు నర్సాపూర్ నియోజకవర్గం నుంచి 18వేల మెజార్టీ అందించడం జరిగిందన్నారు. అందుకు కృషిచేసిన ప్రతికార్యకర్తకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. నర్సాపూర్ నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్ పార్టీ వైపే వున్నారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్ పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు నైతికంగా విజయం సాధించారన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు రవీందర్‌రెడ్డి, సుహాసినిరెడ్డి, శ్రీనివాసగుప్తా, మాజీ ఎంపీపీలు లలిత నర్సింగ్ నాయక్, శ్రీనివాస్‌గౌడ్, నాయకులు మల్లేశం, హకీం, శ్రీనివాస్ రెడ్డి, అశోక్‌గౌడ్, వెంకటేశం, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# నిత్యం ప్రజాసేవలోనే ఉంటా


## బిఆర్‌ఎస్ నాయకురాలు మాలోత్ కవిత



ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి : పోరాటాలు నాకేం కొత్త కాదని, అధికారంలో లేకపోయినా ప్రజాసేవలోనే ఉంటానని మహబూబాబాద్ పార్లమెంట్ బిఆర్‌ఎస్ అభ్యర్థి, మహబూబాబాద్ బిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత అన్నారు. బుధవారం మహబూబాబాద్ కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించి కవిత మాట్లాడుతూ గెలుపు ఓటములు సహజమేనని, గెలుపుతో పొంగిపోయేది ఏది లేదు ఓడితే కుంగిపోయేది లేదన్నారు. ఓటమితో పోరాడే జోరు తగ్గదని నిత్యం ప్రజాసేవలోనే ఉంటానని కవిత అన్నారు. తను గెలవాలని ఓట్లు వేసిన ప్రతిఒక్కరికీ శిరస్సు వంచి వందనాలు చేస్తున్నానన్నారు. అడ్డగోలు హామీలు ఇచ్చి అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు ప్రజల పక్షాన పోరాడుతామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్‌రావు, మాజీమంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్, జడ్పీ చైర్‌పర్సన్ అంగోత్ బిందు పాల్గొన్నారు.

# ఎన్నికల సామాగ్రికి భద్రతా ఏర్పాట్లు

## జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ ఇలా త్రిపాఠి



ప్రజాపక్షం/ములుగు జిల్లా ప్రతినిధి : ఎన్నికల సామాగ్రికి పటిష్ట భద్రత కల్పించినట్లు జిల్లా ఎన్నికల అధికారిణి కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. మంగళవారం రాత్రి జిల్లా పరిధిలో గల ములుగు అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన మహబూబాబాద్ నుండి కౌంటింగ్ ముగిసిన అనంతరం తిరిగి వచ్చిన ఈవిఎంలు, వివి ప్యాట్‌లతో పాటు ఎన్నికల సంబంధ పేపర్‌లు (సామాగ్రి)ని పరిశీలించి, కలెక్టరేట్‌లోని ఈవిఎం గోడౌన్‌లో భద్రత పరిచి, సీల్ వేసి భద్రత కల్పించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల మెటీరియల్‌ను 45 రోజుల పాటు ఎన్నికల పిటిషన్ గడువు ముగిసే వరకు పటిష్ట భద్రతలో, నిత్యం పర్యవేక్షణలో ఉంచడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ రాజ్ కుమార్, సంబంధిత ఎన్నికల అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మోదీకి తగిన గుణపాఠం

## ఎన్నివేషాలు వేసినా..400 సీట్లు సాధించలే..

## చంద్రబాబునాయుడు, నితీష్‌కుమార్ మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే పరిస్థితి

## సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ




ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రధాని మోదీ ఎన్ని వేషాలు వేసినా బిజెపి ప్రకటించిన 400 సీట్లు సాధించలేకపోయిందని, చంద్రబాబునాయుడు, నితీష్‌కుమార్ మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే పరిస్థితి ఏర్పడిందని సిపిఐ జాతీయకార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. మోదీ ప్రధాని అయ్యే పరిస్థితి లేదని, చివరకు రామాలయాన్ని నిర్మించామని గొప్పగా ప్రచారం చేసుకున్న అయోధ్యలోనే బిజెపిని ప్రజలు ఓడించారని విమర్శించారు. రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా మాట్లాడిన మొట్టమొదటి రాజ్యాంగ వ్యతిరేక వ్యక్తి మోదీ అని మండిపడ్డారు. మోదీ హయాంలో అవినీతి కుంభ కోణాలు పెరిగాయని, మతతత్వాన్ని పెంచారని, అంత ఘోరమైన తప్పిదాలు చేసిన మోదీకి, బిజెపికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్ధూంభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిపిఐ ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి కె.రామకృష్ణతో కలిసి డాక్టర్ నారాయణ మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో వామపక్షాల బలం పెరిగిందని, సిపిఐ ఎంపిల సంఖ్య 5 నుంచి 8 పెరిగిందని, సిపిఐ(ఎం)కు కూడా ఒక ఎంపి స్థానం పెరిగిందని ఆయన వివరించారు. రానున్న రోజుల్లో దేశంలో సంకీర్ణ ప్రభుత్వం తప్పదని, భాగస్వామ్య పక్షాలు సంకీర్ణ ధర్మాన్ని పాటిస్తే ఏమీ కాదని, మరింత అభివృద్ధి సాధ్యమని నారాయణ అన్నారు. కూటమి రూపొందించుకున్న మార్గదర్శకాలకు అనుగుణంగా అంగీకృత విధానాలను అమలు చేస్తూ పరిపాలన సాగాలని, సంకీర్ణ ప్రభుత్వం కూడా సంకీర్ణ ధర్మాన్ని పాటించాల్సి ఉంటుందన్నారు. కమ్యూనిస్టుల వల్లనే కేంద్రంలో స్థిరమైన ప్రభుత్వం ఉన్నదని, కమ్యూనిస్టుల చొరవతోనే గ్రామాలలో స్థిరమైన ఆర్థిక వ్యవస్థ ఉన్నదని నాటి కేంద్ర మంత్రి చిదంబరం సాక్షాత్తూ పార్లమెంట్‌లో చెప్పిన విషయాన్ని నారాయణ గుర్తు చేశారు.

### పాలనపైనే రేవంత్ దృష్టి పెట్టాలి

కెసిఆర్ చేసిన తప్పులను కాంగ్రెస్ చేయరాదని, కక్షసాధింపు చర్యలకు పాల్పడవద్దని సూచించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చిహ్నాల వివాదాలకు పోయి సమయం వృథా చేసుకోవద్దని నారాయణ తెలిపారు. పాలన ద్వారా భవిష్యత్‌లో సొంతమార్కులు వేసుకోవాలని, భూసమస్యలు, కాళేశ్వరం లాంటి సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా వాస్తు ఎందుకు అని ప్రశ్నించారు. కెసిఆర్ చాలా వాస్తు చూశారని చివరకు ఫామ్‌హౌస్‌లో పడుకున్నారని, మోదీ కూడా వాస్తు, సాం ప్రదాయాలు బాగా పాటించే వారని ఫలితాలు ఎలా ఉన్నాయో అందరూ చూశారని ఎద్దేవా చేశారు.

### ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ వద్దు

హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధానిగా ఇవ్వాలని కొందరు కోరుతున్నారని, ఒక్క క్షణం కూడా హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధానిగా ఉండేందుకు వీలులేదని, ఈ అవకాశమే ఇవ్వకూడదని డాక్టర్ నారాయణ అన్నారు. చంద్రబాబుకు హైదరాబాద్‌పై ఆశ ఉన్నదని, కానీ రాజధాని మాత్రం ఎపిలోనే ఉండాలన్నారు. ఎపిలో టిడిపి విజయాలే కనిపిస్తున్నాయని, బిజెపి విజయాలు కనిపించడంలేదన్నారు. బిజెపికి కేటాయించిన రెండు స్థానాల్లో వైసిపి గెలిచిందన్నారు. విభజన చట్టంలోని హామీలను ఏదీ అమలు చేయకుండా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పదేళ్లుగా తొక్కిపెట్టిందని విమర్శించారు. ఎపికి ప్రత్యేక హోదా ఇవ్వలేదని, అమరావతి రాజధానికి నిధులు ఇవ్వడానికి కేంద్రం అంగీకరించలేదన్నారు. ఇండియా కూటమి గెలిస్తే ఎపికి ప్రత్యేక హోదా ఇస్తామని రాహుల్ గాంధీ హామీనిచ్చారని గుర్తు చేశారు. విభజన హామీలు నెరవేర్చకపోతే ఎందుకు ఎన్‌డిఏతో ఉండాలని, ఇచ్చేవారు(ఇండియా కూటమి) సిద్ధంగా ఉన్నారు కదా అని చంద్రబాబుకు నారాయణ సూచించారు.

### ఎపిలో జగన్ ఉండాలా? వద్దా అనే అంశంపైనే ఎన్నికలు : రామకృష్ణ

ఎపి ఎన్నికల్లో ఎన్‌డిఎ, ఇండియా కూటమిల చర్చే జరగలేదని, కేవలం జగన్‌ను సిఎంగా కొనసాగించాలా? వద్దా? అనే అంశంపైనే జరిగాయిని కె.రామకృష్ణ అన్నారు. ఒక రాష్ట్రాన్ని ఏ విధంగా పరిపాలించకూడదో చెప్పడానికి ఎపి మాజీ సిఎం జగన్ పాలన ఒక కేస్ స్టడీగా పనికొస్తుందన్నారు. గత పదేళ్లలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఎపికి తీరని అన్యాయం చేసిందని, ఎపికి జరిగిన అన్యాయాన్ని అదంతా ముగిసిన అధ్యాయమని ప్రధాని వ్యాఖ్యానించడం గర్హనీయమన్నారు. చంద్రబాబునాయుడు ఆ విషయాలన్నింటినీ దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రయోజనాల కోసం పాటుపడాలని, అలా చేస్తేనే ప్రజలు హర్షిస్తారన్నారు.

# బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన



ప్రజాపక్షం/వాజేడు : ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని కొంగల అటవీ ప్రాంతంలో మావోయిస్టులు పెట్టిన మందు పాతర పేలి మృతిచెందిన ఇల్లందుల ఏసు కుటుంబానికి న్యాయంచేయాలని వాజేడు, వెంకటాపురం మండలాల నుంచి ప్రజలు తరలి వచ్చి జనగ్నాథపురం గ్రామంలోని వై జంక్షన్ నుండి హనుమాన్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రజల కోసం పోరాటాలు చేస్తున్నామనే మావోయిస్టులు, ఇలా ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని నినాదాలు చేశారు. ఆదివాసి బిడ్డలు అడవికి వెళ్ళి ప్రకృతి సహజ సిద్ధమైన అటవీ సంపదను సేకరిస్తూ ఉంటారు. ఆవులు, మేకలు మేపడం కోసం అటవీ ప్రాంతానికి నిత్యం వెళుతూ ఉంటారు. ఇలా మందు పాతరలు అమర్చితే అమాయక ఆదివాసీ గిరిజనులు ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మావోయిస్టులు అమర్చిన మందు పాతర కారణంగా మృతి చెందిన యేసు కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

# నైతిక విజయం ఇండియా కూటమిదే

## సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి విజయసారథి



ప్రజాపక్షం/మహబూబాద్ : పార్లమెంటు ఎన్నికల్లో సిపిఐ బలపరిచిన ఇండియా కూటమి మహబూబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి బలరాం నాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించిన మహబూబాబాద్ పార్లమెంటు ప్రజలందరికీ సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం మహబూబాబాద్ సిపిఐ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బలరాం నాయక్ గెలుపునకు సిపిఐ శ్రేణులు విశేషంగా కృషిచేసాయన్నారు. దేశవ్యాప్తంగా వచ్చిన ఫలితాల్లో ఇండియా కూటమిదే నైతిక విజయం అన్నారు. 400 సీట్లు వస్తాయన్న బిజెపి కనీసం మ్యాజిక్ ఫిగర్ కూడా చేరుకోలేదన్నారు. స్వయంగా ప్రధానమంత్రి మోదీ వారణాసిలో గత ఎన్నికల్లో 4 లక్షల మెజార్టీతో గెలిచి, ఈ ఎన్నికల్లో కేవలం లక్ష మెజార్టీతో గెలవడం అంటే బిజెపికి ఇది ఘోర ఓటమేనన్నారు. దేశంలో 30 సీట్లలో బిజెపి అత్యల్ప మెజార్టీతో గెలిచిందన్నారు. నైతికంగా ఇండియా కూటమి గెలిచిందన్నారు. రాష్ట్రంలో బిఆర్‌ఎస్ తమ ఓట్లను బిజెపికి బదలాయించిందన్నారు. రాష్ట్రంలో ఇక బిఆర్‌ఎస్ శకం ముగిసినట్టేనన్నారు. ప్రజలు పార్లమెంటు ఎన్నికల్లో బిఆర్‌ఎస్‌ను ఛీ కొట్టారన్నారు. రాష్ట్రంలో ఎనిమిది సీట్లు గెలిచిన బిజెపి భుజాలు తరుముకుంటుందని కానీ, బిజెపి, బిఆర్‌ఎస్ చీకటి ఒప్పందంలో భాగంగా ఆ విజయం వచ్చిందన్నారు. రాబోయే కాలంలో ఇండియా కూటమి అధికారాన్ని చేపట్టడం ఖాయమన్నారు. ఈ సందర్భంగా బలరాంనాయక్‌ను గెలిపించిన మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలోని అన్ని వర్గాల ప్రజలకు, మేధావులకు, ఉద్యోగస్తులకు, విద్యార్థులకు, వ్యాపారస్తులకు, కార్మికులకు, యువతీ యువకులకు బి.విజయసారథి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి, నాయకులు పెరుగు కుమార్, రేషపల్లి నవీన్ నర్రా శ్రావణ్, వెలుగు శ్రావణ్, మాలోతు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# కళాశాలలో వసతులకు ప్రతిపాదనలు

## జయశంకర్ జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా



ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు ప్రతిపాదనలు అందచేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ భవేష్‌మిశ్రా భూపాలపల్లి పట్టణం, కృష్ణకాలనీలలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. ప్రభుత్వ కళాశాలల్లో మౌలిక వసతులు కల్పనలో భాగంగా మరమ్మతులు, మరుగుదొడ్ల నిర్మాణాలు, నీటి కొరత సరఫరాకు బోర్లు, పైపులైన్స్ ఏర్పాటు ఇతరత్రా సదుపాయాల కల్పనకు అంచనా నివేదికలు అందజేయాలని సంబంధిత ప్రిన్సిపాల్‌లను కలెక్టర్ ఆదేశించారు. కళాశాలల్లో మౌలిక వసతులను జిల్లా ఇంటర్మీడియట్ అధికారిని అడిగి తెలుసుకున్నారు. కళాశాలల్లో చదివే బాలురు, బాలికల సంఖ్యను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 5జూనియర్ కళాశాలలు ఉండగా అన్నికళాశాలల్లో మౌలిక వసతుల కల్పన కోసం ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన మరమ్మతులు లాగే జూనియర్ కళాశాల్లో త్వరలోనే పనులను చేపడుతామని తెలిపారు. జూన్ 10 నుండి 12 వరకు కళాశాలలు పునఃప్రారంభం కానున్నందున విద్యార్థుల సంఖ్య పెరిగేలా చూడాలన్నారు. జిల్లాలోని కాటారం, మహాదేవ్ పూర్, తాడిచర్ల, భూపాలపల్లి, చిట్యాల మండలాల్లో ఉన్న జూనియర్ కళాశాలల్లో చదువుకునే వారి సంఖ్య పెరిగేలా చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో ఇంటర్మీడియట్ అధికారి దేవరాజం తదితరులు పాల్గొన్నారు.



### అభివృద్ధి పనులకు ఇసుక

కాటారం : ప్రభుత్వ అభివృద్ధి పనుల ఇసుకు తరలింపునకు అనుమతులివ్వాలని కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం మండలంలోని విలాసాగర్ గ్రామ సమీపంలోని మానేరు నదిలోని ఇసుక రీచ్‌లను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన సంబందిత అధికారులతో మాట్లాడుతూ కాటారం మండలంలోని పలు ప్రభుత్వపనుల అభివృద్ధి రీత్యా ఇసుక రవాణాకు విలాసాగర్ గ్రామ సమీపంలోని మానేరు నది నుండి ఇసుక రవాణాకు అవకాశం కల్పించాలన్నారు. ఐదు హెక్టార్లకు నీటి సామర్థ్యాన్ని పరిశీలించి నివేదికను అందజేయాలని భూగర్భజల వనరులశాఖ అధికారులను ఆదేశించారు. ఇందుకు మొత్తం 12.5 ఎకరాలకు ఒక బౌండరీని ఏర్పాటు చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నూతన ఇసుక రీచ్‌ల ఏర్పాటుకు కావలసిన అనుమతులు ఈసీలను సిద్ధం చేసి త్వరితగతిన నివేదికలు అందజేయాలని అదేశించారు. కార్యక్రమంలో మైనింగ్ అధికారి జయరాజు, భూగర్భ జలవనరుల అధికారి శ్రీనివాస రావు, తహసీల్దార్ నాగరాజు, ఇరిగేషన్ ఏఈలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ అనుమతి లేని కళాశాలల రద్దు

## ఎఐఎస్‌ఎఫ్ డిమాండ్



ప్రజాపక్షం/హన్మకొండ టౌన్ : ప్రభుత్వ అనుమతిలేని, కనీస మౌలిక సదుపాయలు లేని ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలను అనుమతులు రద్దు చేయాలని ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఉట్కూరి ప్రణీత్‌గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం ఇంటర్ విద్యాశాఖ హన్మకొండ జిల్లా అధికారికి ఎఐఎస్‌ఎఫ్ జిల్లా నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రణీత్‌గౌడ్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల సమస్యలు పరిష్కరించాలని, ప్రైవేటు, కార్పోరేట్ విద్యాసంస్థలలో ఫీజులను నియంత్రించాలని, అనుమతిలేని కళాశాలల జాభితా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇంటర్ నిబంధనలు పాటించని కళాశాలలపై చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులను కోరారు. లేనిపక్షంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల చరణ్, జిల్లా సమితి సభ్యులు హజారుద్దీన్, కుశాల్ పాల్గొన్నారు.

### ప్రభుత్వ కళాశాలలో వసతులు



జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : ప్రభుత్వ కళాశాలల్లో మెరుగైన వసతులు కల్పించాలని ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి నేరెళ్ల జోసఫ్ డిమాండ్ చేశారు. బుధవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని, ప్రయివేట్, కార్పోరేట్ విద్యాసంస్థల్లో ఫీజులు నియంత్రించాలని, అనుమతి లేని కళాశాలల జాబితా విడుదల చేయాలనీ కోరుతూ ఎఐఎస్‌ఎఫ్ నాయకులు జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి దేవారాజాంకు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా నేరేళ్ళ జోసఫ్ మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల సమస్యలు పరిష్కరించాలని, ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులు భర్తీ చేసే విధంగా చర్యలు చేపట్టాలని, ప్రైవేట్, కార్పోరేట్ కళాశాలల్లో వసూలు చేస్తున్న అధిక ఫీజులను నియంత్రించి, ప్రభుత్వ అనుమతి లేని కళాశాలల జాబితాను బహిర్గతం చేసి, ఇంటర్ నిబంధనలు పాటించని కళాశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ నాయకులు కాసార బోయిన సిద్ధు, ఇంధరపు అరవింద్, మాతంగి దిలీప్, భగవాన్, లావణ్య, వైష్ణవి పాల్గొన్నారు.

# రాజకీయ, ఆర్థిక సాధికారతకు ఉద్యమిద్దాం

## మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి





ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి : మహిళా సమాఖ్య ఆవిర్భావ దినోత్సవ స్ఫూర్తితో రాజకీయ, ఆర్థిక సాధికారతకై ఉద్యమిద్దాం అని మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి పిలుపునిచ్చారు. బుధవారం హన్మకొండ బాల సముద్రంలోని జిల్లా కార్యాలయంలో భారత జాతీయ మహిళా సమాఖ్య 70వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హన్మకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సుకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత మహిళా సమాఖ్య పతాకాన్ని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మండ సదాలక్ష్మి ఎగురవేసిన అనంతరం మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మంచాల రమాదేవి అధ్యక్షతన జరిగిన సదస్సులో నేదునూరి జ్యోతి మాట్లాడుతూ మహిళా హక్కుల పరిరక్షణకై, నూతన మహిళా చట్టాల కోసం,మహిళల జీవన హక్కుల పరిరక్షణకు 1954 జూన్ 4న కలకత్తాలో అరుణాఅసఫ్ అలీ, రేణూ చక్రవర్తి, అజారా బేగం, విమలా ఫరూఖీ, గీతా ముఖర్జీ వంటి అనేక మంది మహిళా నాయకుల ఆద్వర్యంలో భారత జాతీయ మహిళా సమాఖ్య ఏర్పడిందన్నారు.గడిచిన 70 సంవత్సరాలుగా దేశంలో మహిళల హక్కుల సధనకై పరాటాలు నిర్వహించటంలో భారత జాతీయ మహిళా సమాఖ్య ముందు భాగాన ఉందని అన్నారు. షసంఘటిత రంగంలో పనిచేస్తున్న మహిళలకు కూడా హక్కులు కల్పించాలని,మహిళలపై జరుగుతున్న వివక్ష అరికట్టాలని ఇతర మహిళా సంఘాలను కలుపుకుని భారత జాతీయ మహిళా సమాఖ్య అనేక ఉద్యమాలు నిర్వహించందని చెప్పారు. హిందూ వివాహ చట్టం, మనోవర్తి బిల్లు, హిందూ కోడ్, విడాకులు పొందే హక్కు, ఆస్తి హక్కు తదితర చట్టాలను సాధించిన ఘనత భారత జాతీయ మహిళా సమాఖ్యకే దక్కుతుందన్నారు.చట్ట సభలలో రిజర్వేషన్ల కోసం గీతా ముఖర్జీ నాయకత్వంలో 30 సంవత్సరాలు ఉద్యమించడం జరిగిందని అన్నారు.ప్రస్తుత ప్రధాని డీలిమిటేషన్ సాకుతో మహిళా బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టినట్టే పెట్టి దాట వేశారని అన్నారు.మోడీ పాలనలో మహిళలపై హింస పెరిగిపోయిందని, భవిష్యత్‌లో అంతరాలు లేని సమాజం కోసం, మహిళల ఆరోగ్యం, భద్రత కోసం భారత జాతీయ మహిళా సమాఖ్య ఉద్యమిస్తుందని అన్నారు. మహిళా సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మండ సదాలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో కుటుంబ పాలన సాగించిన బీఆర్‌ఎస్‌ను ప్రజలు గద్దె దించారని, గత ప్రభుత్వ లోపాలను కాంగ్రెస్ గుర్తించి ఇచ్చిన సామీలను నిలబెట్టుకోవాలని అన్నారు.ఈ సదస్సులో మహిళా సమాఖ్య నాయకులు గడ్డం లలిత, తిరుమల, ఎండి అమీనా,మండలి లక్ష్మి,నిమ్మల మాలతి,బైగిరి పుష్ప,లత, ఇల్లందుల పద్మ, ఎల్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## అధ్యక్ష ఎన్నికల ప్రైమరీల్లో గెలిచిన బైడెన్, ట్రంప్



**వాషింగ్టన్ :** అమెరికా అధ్యక్ష పదవికి అభ్యర్థుల ఎంపికల్లో భాగంగా జరుగుతున్న ఎన్నికల్లో దేశాధ్యక్షుడు జో బైడెన్, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పలు రాష్ట్రాల్లో డెమొక్రటిక్, రిపబ్లికన్‌పార్టీల తరపున ప్రైమరీల్లో విజయాలు సాధించారు. బైడెన్ న్యూజెర్సీ, మోంటానా, సౌత్ డకోటా, వాషింగ్టన్ డిసిలతోపాటు పలుచోట్ల గెలిచారు. కాగా ట్రంప్ మోంటానా, న్యూజెర్సీ, న్యూమెక్సికోలలో గెలిచారు. నేరం రుజువైన తర్వాత మొదటిసారి ఆయన విజయం నమోదు చేశారు. మార్చిలో రిపబ్లికన్ పార్టీ ప్రైమరీపోటీ నిర్వహించారు. కానీ సౌత్ డకోటాలో ట్రంప్ పోటీ చేయలేకపోవడంతో పోటీని రద్దు చేశారు. ట్రంప్, బైడెన్ ఇద్దరు చాలా సులభంగానే మంగళవారంనాడు జరిగిన ప్రైమరీల్లో అన్నిచోట్లా విజయాలు సాధించారు. క్రిమినల్ రికార్డు ఉన్న ట్రంప్ మీద ఓటర్లకు సందేహాలు ఉన్నట్లయితే గెలుపు మార్జిన్లు తగ్గిపోయేవి. ఐతే బైడెన్ మాత్రం ఇటీవల జరిగిన పోటీలో ఓటర్లు నిరసన తెలియజేశారు. ఇజ్రాయిల్ సమస్యను హ్యాండిల్ చేయడంలో బైడెన్ తీరుపట్ల డెమొక్రటిక్ ఓటర్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. పలుచోట్ల ఆయనకు ఈ విషయంలో నిరసన వ్యక్తమైంది.

## జపాన్‌లో జీవన సమస్యలు కనిష్టస్థాయికి శిశు జననాలు

**టోక్యో :** జపాన్‌లో శిశుజననాలు ఎనిమిది సంవత్సరాల క్రితంనాటి కనిష్టస్థాయికి చేరుకున్నాయి. మహిళల్లో ప్రత్యుత్పత్తి సామర్థ్యం తీవ్రస్థాయిలో క్షీణిస్తున్నది. ఈ ఏడాది జూన్ ఐదో తేదీనాటి గణాంకాల ప్రకారం రికార్డుస్థాయిలో 7,27,277 స్థాయికి జపాన్‌లో శిశు జననాలు క్షీణించిపోయాయి. 2022 వ సంవత్సరంతో పోల్చి చూస్తే శిశు జననాలు 5.6 శాతం తగ్గాయి. అంకెల్లో చూస్తే శిశు జననాలు 43,482 తగ్గాయి. 2023 నాటి నివేదిక ప్రకారం అత్యంత క్షీణస్థాయిలో మహిళల్లో తమ జీవితకాలంలో 1.26 శాతం లేదా 1.20 శాతం మేరకు ప్రత్యుత్పత్తి సామర్థ్యం కనబరుస్తున్నట్లు వెల్లడైంది. 2023లో 7.29 లక్షలమంది శిశువులు జన్మిస్తారని జాతీయ జనాభా, సామాజిక భద్రతా పరిశోధనా సంస్థ అంచనావేయగా అంతకంటే 10,000 మంది పిల్లలు తక్కువగా జన్మించారు. ఆర్థిక అస్థిరత్వం, జీవనవ్యయ పెరుగుదల ఒత్తిడి, దాంపత్య కలిసి శారీరక సమస్యలు, బాల్యం నుండి పెంపకం తీరు వంటి అనేక అంశాలు వ్యక్తులకు ఉండే వివాహపరమైన ఆశలను, సంతానాన్ని కని పెంచి పోషించాలనే ఆశలను పరిమితం చేస్తున్నాయని, ఆ ఆలోచనలనుండి దూరం అవుతున్నారని జపాన్ ఆరోగ్య మంత్రిత్వశాఖ స్పష్టం చేసింది.

### జపాన్‌లో 25 నెలలుగా..తగ్గుతున్న నిజ వేతనాలు



జపాన్‌లో గడచిన 25నెలలుగా నిజవేతనాలు క్షీణిస్తూ వస్తున్నాయి. దీంతో పౌర సమాజాన్ని వెంటాడుతున్న జీవన సమస్యలు మరింతగా పెరిగిపోయాయి. ఇటీవల నుండే ఈ నిజవేతనాలు స్థిరంగా పెరగడం ప్రారంభించడానికి సంబంధితవర్గాలు చెబుతున్నాయి. నిజవేతనాలు 0.7 శాతం మేరకు తగ్గాయి. ఆ దేశంలో ద్రవ్యోల్బణానికీ, నిజవేతనాలకు పొంతన లేకపోవడంతో ఏడాదికాలంగా ఎగుడుదిగుడు సమస్యలు వస్తున్నాయి. ఐతే బ్యాంకు ఇటీవల ఈ అంతరాన్ని సవరించిందన్నది అధికారవర్గాల భోగట్టా. వడ్డీరేట్లు ఎత్తేడానికి కేంద్రబ్యాంకు అంగీకరించింది. జపాన్ కార్మికమంత్రిత్వశాఖ గణాంకాల ప్రకారం నిజవేతనాలు 0.7 శాతం మేరకు తగ్గుతున్నాయి. ఈ ఏడాదిలో కొన్ని ప్రధానమైన ఇండస్ట్రీలు తమ కార్మికులకు ఐదూశాతం మేరకు వేతనాల పెరుగుదలకు అంగీకరించాయి.

# ట్రాక్టర్లతో మళ్లీ యూరప్ రైతుల ప్రదర్శన




**బ్రస్సెల్స్ :** యూరోపియన్ యూనియన్ రైతులు మరోసారి బ్రస్సెల్స్‌లో నిరసన ప్రదర్శనలు జరిపారు. యూరోపియన్ యూనియన్ అనుసరిస్తున్న పర్యావరణ పరిరక్షణ విధానాలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ వారు మంగళవారంనాడు నిరసన ప్రదర్శన జరిపారు. యూరోపియన్ యూనియన్ ఉమ్మడి వ్యవసాయ విధానంలో రూపొందించిన వాతావరణపరమైన డిమాండ్లు, అతి నియంత్రణలు, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు పోటీలో తీవ్ర విఘాతం కలిగిస్తున్నాయని రైతులు విమర్శిస్తున్నారు. ఇంతకుముందు కూడా రైతులు అనేక నెలలపాటు నిరసన ప్రదర్శనలు జరపడంతో వారికి కొన్ని రాయితీలు ఇచ్చారు. యూరోపియన్ యూనియన్ ఎన్నికలు గురువారం నుండి నాలుగు రోజులపాటు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లూ పూర్తిచేసిన సందర్భంగా రైతులు ఈ నిరసనలకు దిగారు. రైతులు తమ తమ వ్యవసాయ ట్రాక్టర్లలలో బ్రస్సెల్స్‌కు చేరుకున్నారు. దీంతో బ్రస్సెల్స్ శివార్లలో రహదారులన్నీ కిక్కిరిసిపోయాయి. ఒక్కసారిగా వందలాది ట్రాక్టర్లు నగరంలోకి వచ్చేసరికి పాలకులకు దిక్కుతోచలేదు. నగరు శివారు ప్రాంతంలోని ఆటోమియమ్ మాన్యుమెంట్ వద్ద రైతులు భారీ ప్రదర్శన సభ నిర్వహించారు. ఇటీవలికాలంలో యూరోపియన్ యూనియన్ రైతులు తమ



డిమాండ్ల సాధనకోసం అనేకసార్లు నిరసన ప్రదర్శనలు జరిపారు. ఇప్పటివరకూ రైతులు బ్రస్సెల్స్ నగరంలోకి రావడంతో ట్రాఫిక్ స్తంభించిపోవడమే కాకుండా జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. దీంతో పోలీసులు రైతులపై ఆంక్షలు విధించారు. వారు కేవలం శివారు ప్రాంతాలకు మాత్రమే పరిమితం కావాలని ఆదేశించారు. ఐతే నామమాత్రంగా కేవలం కొద్దిమంది రైతులన మాత్రమే నగరంలోకి నిరసన ప్రదర్శనకు అనుమతించారు. అదికూడా భారీగా పోలీసు ఎస్కార్ట్ విధించారు. ఇంతకుముందు అనేకసార్లు జరిగిన నిరసన ప్రదర్శనల్లో కోపా కోగేకా గ్రూపు పాల్గొనేది. కానీ ఈసారి నిరసన ప్రదర్శనలో ఈ రైతు సంఘం పాల్గొనలేదు. పోలెండ్ నేషనలిస్ట్ లా అండ్ జస్టిస్ పార్టీ నాయకుడు జరోస్లా కజింగ్స్కీ, ఫ్లెమిష్ వ్లామ్ బెలాంగ్‌కు చెందిన ఇతర సభ్యులు ఈ ప్రదర్శనలో రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. ఇదిలా ఉండగా దక్షిణ పోలెండ్‌లోని ఉక్రేన్ సరిహద్దుల్లో మరో 30 మంది రైతులు బైఠాయింపు జరిపి తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. బ్రస్సెల్స్‌లో రైతుల ప్రదర్శనకు సంఘీభావంగా వారు ఈ బైఠాయింపు నిరసన జరిపారు. రష్యన్ ఆర్థోడాక్స్ చర్చ్ మత బోధకులపై హింసను ప్రేరేపించే సాహిత్యం ప్రచారం చేయడం, అందుకు సంబంధించిన వీడియోలను పంపిణీ చేయడం వంటి చర్యలకు పాల్పడుతోంది. టీవీ షోల ద్వారా ఆమె పాపులారిటీ సంపాదించింది.

## ఇటు శాంతిమంత్రం..అటు ఎఫ్35 జెట్స్ సరఫరా

**గాజా :** ఇజ్రాయిల్–పాలస్తినా మధ్య శాంతి యత్నాలు చేస్తున్న అమెరికా మరోవైపు నేతన్యాహూకు యుద్ధ విమానాలు కూడా సరఫరా చేస్తున్నది. అమెరికా నుండడి మూడు బిలియన్ డాలర్ల విలువైన ఎఫ్–35 ఫైటర్స్ జెట్స్ సరఫరాకు డీల్ కుదిరింది. 25 ఫైటర్ జెట్స్‌ను కొనుగోలుచేయాలని ఇజ్రాయిల్ ప్రధానమంత్రి నేతన్యాహూ నిర్ణయించారు. ఈ మేరకు ఒప్పందం కుదిరింది. ఇజ్రాయిల్‌కు ఆయుధాల సరఫరా నిలిపివేస్తే ఆ దేశం దిగి వస్తుందని డిమాండ్లు చేస్తున్నప్పటికీ పట్టించుకోకపోడం అమెరికా ద్వంద్వ వైఖరికి తార్కాణం. కాగా అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఇజ్రాయిల్–పాలస్తినా సమస్య పరిష్కారానికి ప్రతిపాదించిన మూడు అంచెల ప్రణాళిక అమలుకు ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి. బైడెన్ చేసిన విజ్ఞప్తి మేరకు అరబ్ దేశాలు స్పందించాయి. ఈ శాంతి ఒప్పందాన్ని అంగీకరించే విధంగా హమాస్‌పై ఒత్తిడి తీసుకురావాలని అందుకు పూర్తి యత్నాలు చేయాలని చేసిన విజ్ఞప్తి మేరకు జి–7 అరబ్ పవర్ దేశాలు హమాస్‌కు విజ్ఞప్తి చేశాయి. ఈ ఒప్పందాన్ని అంగీకరించాలని కోరాయి. ఐతే హమాస్ మాత్రం గాజా నుండి ఇజ్రాయిల్ సైన్యాల శాశ్వత ఉపసంహరణ, యుద్ధ విరమణపై నోరు విప్పి మాట్లాడాలని షరతు విధించింది. ఇజ్రాయిల్ ప్రధానమంత్రి నేతన్యాహూ కూడా ఆరు వారాలు మాత్రం యుద్ధం విరమిస్తామని, తిరిగి యుద్ధం ప్రారంభించే హక్కు తమకు ఉంటుందని, ఈ విరమణ సమయం కూడా బందీలను ఇచ్చిపుచ్చుకోవడంకోసమేనని చెబుతున్నారు. మరోవైపు అమెరికాలో తరుముకొస్తున్న ఎన్నికలు, ఇజ్రాయిల్‌పట్ల బైడెన్





అనుసరిస్తున్న వైఖరిపై అమెరికన్లలో ఉన్న అసంతృప్తి నేపథ్యంలో డెమోక్రటిక్‌పార్టీ తన అవకాశాలు మెరుగుపరచుకునేందుకు వీలుగా ఈ శాంతి ఒప్పందాన్నే బైడెన్ నమ్ముకున్నారు. దీంతో ఐక్యరాజ్యసమితిలో కూడా ఈ మూడు దశల ప్రణాళికను అమోదించేవిధంగా చర్యలకు బైడెన్ పావులు కదుపుతున్నారు. ఇంకోవైపు సిఐఎ డైరెక్టర్ జనరల్ కూడా ఖతార్‌తో మంతనాలు చేసేందుకు కైరో, దోహా వెళ్ళారు.

### పాలస్తీనాకు స్లోవేనియా గుర్తింపు

### దాడుల్లో 36 మంది మృతి

గాజాలో గడచిన 24 గంటల్లో ఇజ్రాయిల్ సైన్యం జరిపిన దాడుల్లో 36 మంది మరణించారు. 115 మంది గాయపడ్డారు. ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌లో మగ్గురు పాలస్తీనియన్లను ఇజ్రాయిల్ సైన్యం కాల్చి చంపగా మరో 35 మందిని అరెస్టు చేసింది. గాజాలో చేసిన దాడుల్లో 11 మంది మరణించారు. ఇజ్రాయిల్ సైన్యం భూతల, గగనతల దాడులను ముమ్మరం చేసింది. దీంతో బురెయిజ్ శరణార్థశిబిరంలో అనేమంది మరణించారు. స్థానిక ఆసుపత్రి సిబ్బంది కథనం ప్రకారం 11 మంది పాలస్తీనియన్లు మరణించారు. గడచిన శుక్రవారంనాడు జబాలియా శరణార్థ శిబిరంప దాడులు జరిగాయి. ఈ దాడుల తర్వాత 360 మృతదేభహాలను స్వాధీనం చేసుకున్నారు. వీటిల్లో ఎక్కువమంది పిల్లలు, మహిళలే ఉన్నారు. దాడులు పెరగడంతో డైర్ ఎల్ బలాహ్‌లో ఆసుపత్రికి పెద్ద సంఖ్యలో బాధితులు వస్తున్నారు. నెలరోజులుగా ఇజ్రాయిల్ రఫాలో తన దాడులను ఉద్ధృతం చేసింది. ఈ దాడుల కారణంగా ఈ నెలరోజుల్లో 10 లక్షలమంది భయంతో ఆ ప్రాంతం వదిలి పారిపోయారు. ఇదిలా ఉండగా స్లోవేనియా ప్రభుత్వం బుధవారంనాడు పాలస్తినాను ఒక స్వతంత్రరాజ్యంగా గుర్తించింది. ఈ మేరకు స్లోవేనియా పార్లమెంటు ఒక తీర్మానం చేసింది.

## కొరియా భూభాగంలో అమెరికా బాంబర్ డ్రిల్ : ఉద్రిక్తతలు

**సియోల్ :** కొరియా ద్వీపకల్పంలో తాజాగా 'చెత్త' బెలూన్ల వివాదం చినుకు చినుకు గాలివానగా మారుతున్నది. దక్షిణకొరియాకు మద్దతుగా దాని మిత్రదేశం అమెరికా ఖండాంతర క్షిపణి ప్రదర్శనలు నిర్వహించడంతో ఉద్రిక్తతలు మరింతగాపెరిగాయి. ఖచ్చితత్వంతో కూడిన లక్ష్యంతో ఉండే బి–1 బి బాంబర్ ఎయిర్ క్రాఫ్టలను బుధవారంనాడు అమెరికా ప్రదర్శించింది. అమెరికా ఎయిర్ క్రాఫ్టలకు దక్షిణ కొరియా జెట్ విమానాలు తోడుగా నిలబడ్డాయి. అమెరియా ఎయిర్‌క్రాఫ్టలు ఈ బాంబర్లను ప్రయోగ ప్రాతిపదికపై సముద్రంలో జారవిడిచాయి. కొరియా ద్వీపకల్పంలో దక్షిణ కొరియా అండతో అమెరికా ఈ ఏడాదిలోనే తాత్కాలికంగా బాంబర్లను మోహరించింది. ఈ సందర్భంగా దక్షిణ కొరియా యుద్ధ విమానాలు కూడా ఐతే ఈ విధంగా గడచిన ఏడు సంవత్సరాలలో బాంబింగ్ డ్రిల్ చేయడం ఈ ప్రాంతంలో ఇదే మొదటిసారి. 2017లో మొదటిసారి ఈ విధమైన బాంబర్ విన్యాసాలను ఈ ప్రాంతంలో అమెరికా నిర్వహించింది. ఐతే ఉత్తర కొరియా కూడా ఏ మాత్రం వెనక్కు తగ్గలేదు. సముద్ర జలాలల్లోంచి ప్రయోగించగల అణుక్షిపణ ప్రయోగం చేసి దక్షిణ కొరియాను హడలెత్తించింది. ఉత్తర కొరియా భూభాగం నుండి చెత్త చెదారం నింపిన బెలూన్లు వందలసంఖ్యలో తమ భూభాగంలోకి పంపుతున్నారని దక్షిణకొరియా విమర్శించిన నేపథ్యంలో ఒక హెచ్చరికగా అమెరికా రంగంలోకి దిగి ఈ బాంబర్ డ్రిల్ చేసింది. ఇటీవల ఉత్తర కొరియా కూడా ఒక గూఢచారి ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి పంపేందుకు ప్రయత్నం చేసింది. ఐతే ఈ రాకెట్ బయలుదదేరిన కొద్దిసేపటికే పేలిపోయింది.



## ఎన్‌డిఎ నేత మోదీ (2వ పేజీ తరువాయి)

జూన్ 16తో ముగుస్తుంది. 543 మంది సభ్యులున్న లోక్‌సభలో ప్రస్తుత ఎన్నికల్లో బిజెపి సొంతంగా 240 సీట్లు సాధించగా ఎన్‌డిఎ స్పష్టమైన మెజారిటీని దక్కించుకుంది. ప్రధాన ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్ 99 సీట్లు గెలుచుకుంది. 2014లో 282 స్థానాలు, 2019లో 303 సీట్లతో బిజెపి సొంతంగా మెజార్టీ సాధించింది. కాగా మంగళవారం నాటి ఫలితాల్లో బిజెపి సారథ్యంలోని ఎన్‌డిఎ మెజారిటీ మార్క్ దాటి 292 సీట్లు గెలుచుకోవడంతో తిరిగి ప్రభుత్వం ఏర్పాటు ఖాయమైంది. వరుసగా మూడోసారి ప్రధానమంత్రిగా మోదీ ఈనెల 8న ప్రమాణస్వీకారం చేయనున్నారు.

## దక్కని బెయిల్..(2వ పేజీ తరువాయి)

అరెస్టు చేసిన విషయం తెలిసిందే. తన అరెస్టును సవాల్ చేస్తూ కేజ్రీవాల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దానిపై విచారణ ఆలస్యమవుతుండటంతో ఎన్నికల్లో ప్రచారం కోసం చేసిన అభ్యర్థనను అంగీకరిస్తూ.. కోర్టు షరతులతో కూడిన మధ్యంతర బెయిల్ ఇచ్చింది. కోర్టు ఆదేశాల మేరకు జూన్ 2న తిరిగి జైలు అధికారుల ముందు లొంగిపోయారు. ఆయన ప్రస్తుతం తీహార్ జైల్లో ఉన్నారు.

**సిసోడియాకు సుప్రీంలో చుక్కెదురు:** మద్యం కుంభకోణానికి సంబంధించి సిబిఐ, ఇడిలు తనపై పెట్టిన కేసులలో బెయిలు కోసం ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా పెట్టిన దరఖాస్తులను స్వీకరించడానికి సుప్రీంకోర్టు మంగళవారం నిరాకరించింది. సిసోడియా అక్రమ ధన చలామణికి, అవినీతికి పాల్పడ్డారని ఆ రోపిస్తూ సిబిఐ, ఇడిలు పెట్టిన కేసులవి. ఈ కేసుల్లో ఇడి తుది ప్రాసిక్యూషన్ ఫిర్యాదు చేశాక, సిబిఐ ఛార్జిషీటు దాఖలు చేసిన తరవాత సిసోడియా బెయిలు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని సుప్రీం వెసులుబాటు కల్పించిం ది. ఇడి ప్రాసిక్యూషన్ ఫిర్యాదు ఛార్జిషీటుకు సమానం. వీటిని జూలై 3వ తేదీకల్లా ఇడి, సిబిఐలు దాఖలు చేస్తాయని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీం కోర్టుకు తెలిపారు. సిసోడియా 15 నెలల నుంచి కస్టడీలో ఉన్నా ఇడి, సిబిఐల దర్యాప్తు ఇంకా ఒక కొలిక్కి రాలేదనీ, అందుకే ఆయనపై ఉన్న కేసుల్లో విచారణ ఇంకా మొదలు కాలేదని ఆయన తరఫు న్యాయవాది అభిషేక్ సింఘ్వీ కోర్టుకు తెలిపారు. అందువల్ల సిసోడియాకు బెయిలు ఇవ్వాలని కోరారు.

## ''ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట''

**(2వ పేజీ తరువాయి)**

యంత్రాంగాన్ని బడి బాట కార్యక్రమంలో భాగస్వామ్యం అయ్యేలా జిల్లా కలెక్టర్ కార్యాచరణను అమలు చేయాల్సి ఉంటుంది. ఈ నెల 10 వరకు టెక్ట్స్‌బుక్స్, నోట్ బుక్స్, వర్క్‌బుక్స్ తదితర వాటిని విద్యార్థులకు పంపిణీ చేయాలని సమగ్ర శిక్ష తెలిపింది. మండల్ స్పెషల్ ఆఫీసర్స్ ఆధ్వర్యంలో బడిబాట మండల స్థాయి కమిటీ క్రియ శీలకంగా వ్యవహరిస్తుంది. బడి బాట కార్యక్రమాన్నిగ్రామ స్థాయి వరకు విజయవంతంగా నిర్వహించేలా, ఈకార్యక్రమంలో జిల్లా స్థాయి అధికార యంత్రాంగంతో జిల్లా విద్యాశాఖ అధికారి సమన్వయం చేసుకోవాలి. పిడిలు,డిఆర్‌డిఎ, పిడి, మెప్మా, జిహెచ్‌ఎంసి అధికారులతో డిఇఒ సమన్వయం చేసుకోవాల్సి ఉంటుంది. ప్రభుత్వ పాఠశాలలో చదువు కుంటే కలిగే ప్రయోజనాలపై ఎన్‌జివోలతో కలిసి సంయు క్త ప్రచారం కార్యక్రమాలను నిర్వహించాలని విద్యాశాఖ సూచించింది. ఎంపిడివోలు గ్రామ స్థాయి కమిటీలను ఏర్పాటు చేసి, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సంఖ్యను పెంచేలా చూడాలని, మండల విద్యాధికారి ప్రతి రోజు విద్యార్థుల చేరికల నివేదికను ఎప్పటికప్పుడు ఇవ్వాల్సి ఉంటుందని, ఏ రోజు ఏ కార్యక్రమాన్ని నిర్వహించాలనే అంశంలపై కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని విద్యాశాఖ సూచించింది.

**12న ప్రభుత్వ పాఠశాలలకు అలంకరణ:** ఈ నెల 12న పాఠశాలలు ప్రారంభంకానున్న నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలలను అలంకరించాల్సి ఉంటుంది. బడి బాట కార్యక్రమంలో భాగంగా తొలుత గురువారం గ్రామ స్థాయిలో సమావేశాన్ని నిర్వహించి, బడి బాట పట్ల అవగాహన కల్పించేలా ప్రదర్శన నిర్వహిస్తారు. ఆ మరుసటి రో జు ఈ నెల 7న ప్రతి ఇంటికి వెళ్లి అందరూ ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలి. ఈ నెల 8 నుంచి 10 వరకు అవగాహన కార్యక్రమాలు, ప్రచారం, పిల్లలను పాఠశాలలను చేరిపించడం లాంటి కార్యక్రమాలను చేపట్టాలి. ఈ నెల 11న గ్రామ సభలను నిర్వహించి ఇప్పటికే చదువును మధ్యలో వదిలేసిన వారిని గుర్తించి, తిరిగి వారిని పాఠశాలకు వెళ్లేలా ప్రయత్నించాలి.

## కెసిఆర్ అరాచకం

**(2వ పేజీ తరువాయి)**

ఫలితాలు రాలేదని, టిపిసిసి అధ్యక్షునిగా, ముఖ్యమంత్రిగా గెలుపు, ఓటములకు పూర్తి బాధ్యత తనదేనని రేవంత్‌రెడ్డి అన్నారు. ఇప్పటి వరకు 18 గంటలే పనిచేసామని, ఇకనుంచి మరో రెండు గంటలు ఎక్కువ పనిచేస్తామన్నారు. 2019లో బిజెపి 4 గెలి స్తే.. ఈ ఎన్నికల్లో 8 స్థానాలలో గెలిచిందని, అసెంబ్లీ ఎన్నికల్లో 20శాతం ఉన్న ఓట్ల శాతం ఈ ఎన్నికల్లో 35 శాతానికి పెరిగాయన్నారు. బిజెపిని గెలిపించేందుకు బిఆర్‌ఎస్ నాయకులు ఆత్మ బలిదానం చేసుకుని అవయవదానం చేశారన్నారు. బిజెపి గెలిచిన స్థానాల్లో బిఆరెస్ 7 సీట్లలో డిపాజిట్లు కోల్పోయిందన్నారు. రాష్ట్రంలో బిఆరెస్ ఎంఎల్ఎలు, నాయకుల ఆత్మ గౌరవాన్ని కెసిఆర్, కెటిఆర్, హరీష్‌రావు బిజెపి కి తాకట్టు పెట్టారని, పూర్తిగా ఓట్లను బదలాయించి కెసిఆర్ రాజకీయ అరాచకానికి పాల్పడ్డారని రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో 37.5 శాతం ఓట్లు పొందిన బిఆరెస్ ఈ ఎన్నికల్లో 16.5 శాతానికి పడిపోయిందని, 2023లో13 శా తం ఓట్లున్న బిజెపికి ఈ ఎన్నికల్లో 35.5 శాతం ఓట్లు పెరిగాయని, బిజెపికి పెరిగిన ఆ 22 శాతం ఓట్లు బిఆర్‌ఎస్‌వేనని రేవంత్‌రెడ్డి అన్నారు. ఎన్నికల్లో సిద్దిపేటలో మాజీ మంత్రి హరీష్‌రావు బిఆర్‌ఎస్ ఓట్లను పూర్తిగా బిజెపికి బదిలీ చేశారని, రఘునందన్‌రావుకు ఓట్లను బదిలీ చేసి మెదక్ పార్లమెంట్ స్థానంలో బలహీనవర్గాల బిడ్డ వెంకట్‌రామ్‌రెడ్డిని నమ్మించి మోసం చేసి ఓడించి మరీ కెసిఆర్ బిజెపిని గెలిపించారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మా జీ మంత్రి హరీష్‌రావు ఆత్మాహుతి దళాలుగా మారి కాంగ్రెస్‌ను దెబ్బతీయాలనుకుంటే చివరికి కనుమరుగై కాలగర్భంలో కలిసిపోతారన్నారు. మహారాష్ట్ర తరహాలో కెసిఆర్ బిజెపితో బేరసారాలు చేస్తున్నారని, బిఆరెస్ ఎంఎల్ఎలు తమ ఆత్మ ప్రభోదానుసారం వ్యవహరించాలన్నారు. కెసిఆర్ ఒక రాజకీ య జూదగాడు అని, ఆయన ఉన్నంత కాలం కుట్రలు కుతంత్రాలు కొనసాగుతూనే ఉంటాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రేవంత్‌రెడ్డి అన్నారు. కెసిఆర్ ప్రపంచంలోనే అత్యంత అవినీతి పరుడని ఆరోపించిన బిజెపి ఇప్పుడు బిఆర్‌ఎస్‌తో ఎలా జతకడుతుందో చూడాలని, ఇందుకు బిజెపి ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు.

**మోదీ ప్రధాని పదవిని మళ్లీ చేపట్టొద్దు**

మోదీ గ్యారెంటీ పేరుతో బిజెపి నేతలు ఈ ఎన్నికల్లో ప్రజల్లోకి వెళ్లారని, బిజెపి 303 సీట్ల నుంచి 243కి పడిపోయిందని రేవంత్‌రెడ్డి అన్నారు. మోదీ గ్యారెంటీకి వారంటీ చెల్లిపోయిందని ప్రజలు తీర్పు ఇచ్చారన్నారు. దేశ ప్రజలు మోదీని తిరస్కరించారని, ప్రధా ని పదవికి రాజీనామా చేసిన మోదీ మళ్లీ ప్రధాని పదవి చేపట్టకూడదన్నారు. విలువలు కలిగిన నాయకుడిగా హుందాగా తప్పుకుంటే మోదీకి గౌరవం ఉంటుందని లేనట్లయితే విలువలకు తిలోదకాలిచ్చినట్లేనన్నారు. ఇప్పటికైనా బిజెపి అప్రజాస్వామిక, అప్రజాస్వామిక తీరును మార్చుకోవాలన్నారు.

చంద్రబాబు ఆహ్వానిస్తే ప్రమాణ స్వీకారానికి వెళతా టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారానికి ఆహ్వానిస్తే తాను తప్పకుండా వెళతానని రేవంత్‌రెడ్డి చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో ఏ ప్రభుత్వం వచ్చినా సామరస్యంగా రాష్ట్ర సమస్యలు పరిష్కరించుకుంటామని గతంలోనే చెప్పానని, తనకు ఎలాంటి భేషజాలు లేవని, ఎవరితోనైనా కూర్చుని చర్చించి సమస్యలను పరిష్కరించుకుంటామని సిఎం అన్నారు. ఎపికి ప్రత్యేక హోదా ఇవ్వడానికి రాహుల్ గాంధీ కట్టుబడి ఉన్నారన్నారు. అయితే ఈ అంశంపై పార్టీలో చర్చించాక చంద్రబాబుతో మాట్లాడుతామన్నారు. ఎపికి ప్రత్యేక హోదా చట్టబద్ధతతో కూడుకున్న హామీ అని వెల్లడించారు. తాను కాంగ్రెస్ పార్టీ సూచనల మేరకే నడుచుకుంటానని ఆయన తెలిపారు.

## అభినందనలు (2వ పేజీ తరువాయి)

లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై చర్చించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ బిజెపి గెలుపొందిన 8 నియోజకవర్గాలలో ఏడు చోట్ల బిఆర్ ఎస్ డిపాజిట్లు కోల్పోయిందని, తద్వారా బిజెపికి బిఆర్‌ఎస్ ఓట్లు బదిలీ అయినట్లు స్పష్టంగా అర్థమవుతోందన్నారు. చివరకు సిద్ధిపేట, గజ్వేల్‌లో కూడా ఇదే పరిస్థితి అని చెప్పారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ మొతంమీద ఇండియా కూటమి మంచి ఫలితాలే సాధించిందన్నారు. ఎన్ని ఆటంకాలు సృష్టించినా ఈ ఫలితాలు వచ్చాయని, మునుపటి మాదిరిగా ఎన్‌డిఎ ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరించకుండా అడ్డుకట్ట పడుతుందన్నారు.

**చంద్రబాబు 'ఇండియా'లోకి రావాలి:** సిఎంతో భేటీ అనంతరం కూనంనేని సాంబశివరావు మీడియాతో మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్‌లో మంచి ఫలితాలు సాధించిన టిడిపి అధ్యక్షులు చంద్రబాబు నాయుడుకు అభినందనలు తెలిపారు. అయితే, దేశ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఆయన ఇండియా కూట మిలోకి వస్తే బాగుం టుందని కోరారు. నియంతృత్వంపై ఆంధ్ర ప్రదేశ్ ప్రజలు ఇచ్చిన తీ ర్పును ఆయన అభినందించారు. రాష్ట్రంలో బిజెపి 8 స్థానాలు గెలవ డం వాస్తవబలంతో కాదని, బిఆర్‌ఎస్ ఓట్ల బదిలీ బలంతోనే అది జరిగిందన్నారు.

## అర్ధరాత్రి వరకూ తేలని ఫలితం

**(2వ పేజీ తరువాయి)**

చేశారు. ముందుగా స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచిన బ్యాలెట్ బాక్స్‌లను 4 హాళ్లలో ఉన్నటువంటి తరలించి బ్యాలెట్ బాక్స్‌ల సీల్ తీసి బాక్స్‌లో పోలైన ఓట్ల బ్యాలెట్ పేపర్లను 25 బండిళ్ల చొప్పున కట్టలు కట్టే ప్రక్రియ సాయంత్రం వరకు కొనసాగింది. సాయంత్రం నుంచి అభ్యర్థులకు కేటాయించిన బాక్స్‌లలో వేయడం ప్రారంభించారు. ప్రతి టేపతి 500 బ్యాలెట్ల చొప్పున ప్రతి రౌండ్‌కు 48వేల ఓట్ల లెక్కింపు చొప్పున 7 రౌండ్ల వరకు మొదటి ప్రాధాన్యత ఓట్లను లెక్కించారు. అర్ధరాత్రి వరకు కూడా ఈ లెక్కింపు ప్రక్రియ కొనసాగింది. అయితే మొదటి ప్రాధాన్యత ఓట్లలో ఏ అభ్యర్థికి సరైన మెజార్టీ రాకపోతే రెండో ప్రాధాన్యత ఓట్లు కూడా రెండవ రోజు కొనసాగే అవకాశమున్నట్లు అధికారులు తెలిపారు.

**3 షిఫ్టులతో కౌంటింగ్**

**ఒక్కో షిఫ్ట్ లో 900 మంది సిబ్బంది**

పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికలు 24 గంటల పాటు ఓట్ల లెక్కింపు చేపట్టేలా షిఫ్ట్ ల వారిగా సిబ్బందిని నియమించారు. ఒక్కో షిఫ్టుకు 900 మంది సిబ్బందితో 3 షిఫ్టులకు 2700 మంది సిబ్బందితో కౌంటింగ్ ప్రక్రియ కొనసాగించనున్నారు. ఇందుకోసం కౌంటింగ్‌కు అన్ని రకాల ఏర్పాట్లను సంబంధిత ఎన్నికల రిటర్నింగ్ అధికారి పర్యవేక్షణలో కొనసాగాయి.

## సరైన అడుగులు

**(2వ పేజీ తరువాయి)**

ఫలితాల పనితీరు కనబరిచిన తర్వాత బుధవారం 'ఇండియా' కూటమి భాగస్వామ్య పక్షాల మొదటి సమావేశంలో మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ, రాజకీయపార్టీలన్నీ వచ్చి కూటమిలో చేరాల్సిందిగా ఆహ్వానం పలికారు. తన నివాసంలో జరిగిన సమావేశానికి హాజరైన వివిధ పార్టీల నాయకులను ఉద్దేశించిన ఆయన మాట్లాడారు. 'ఇండియా' కూటమి భాగస్వామ్యపార్టీలు ఎం తో ఐక్యంగా, చిత్తశుద్ధితో ఈ ఎన్నికల్లో పోరాటం చేశాయని ఆయన అన్నారు. ''ప్రజాతీర్పు నరేంద్ర మోడీకి ఆయన రాజకీయాల తీరుతెన్నులకు, వాటి సారాంశానికీ వ్యతిరేకంగా నిర్ణయాత్మకంగా ఉంది. ఇది ఒక స్పష్టమైన నైతిక పరాజయం మాత్రమే కాకుండా వ్యక్తిగతంగా కూడా ఆయనకు ఒక అతిపెద్ద రాజకీనష్టం. ఐనప్పటికీ కూడా ఆయన ప్రజల సంకల్పాన్ని కూలదోయాలని కృతనిశ్చయంతో ఉన్నారు'' అని ఖర్గే విమర్శించారు. ''ఇండియా'' కూటమి అన్ని పార్టీలకూ ఆహ్వానం పలుకుతోంది, దేశ రాజ్యాంగ పీఠికలో నిర్దేశించిన విలువలకు, అందులో పొందుపరచిన అనేక ఆర్థిక, సామాజిక, రాజకీయ న్యాయ సూత్రాలు, నిబంధనలకు మౌలికంగా కట్టుబడిన పార్టీల న్నీ 'ఇండియా' కూటమిలోకి రండి'' అని ఆయన తన ప్రసంగం ప్రారంభం లో ఆహ్వానం పలికారు. 'ఇండియా' కూటమి భాగస్వామ్యపార్టీలకు కృతజ్ఞతలు అని ఆయన చెప్పారు. ''కూటమి భాగస్వామ్యపార్టీలకు నేను స్వాగతం పలుకుతున్నాను, మనం ఎంతో బాగా పోరాటం చేశాం, ఐక్యంగా పోరాటం చేశాం, సంకల్పశుద్ధితో, చిత్తశుద్ధితో పోరాటం చేశాం'' అని ఖర్గే అన్నారు.

**ప్రభుత్వ ఏర్పాటు అవకాశాలపై అన్వేషణ**

'ఇండియా' కూటమి పార్టీలు బుధవారంనాడు మల్లికార్జునఖర్గే నివాసంలో సమావేశమై కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశాలను చర్చించాయి. పల పార్టీలతో పొత్తులదారా తదుపరి వ్యూహానికి ఆలోచన చేశాయి. పూర్వపు కూటమి మిత్రులు నితీశ్ కుమార్, ఎన్.చంద్రబాబునాయుడులను కలిసి మంతనాలు చేయవచ్చునా? లేదా? అనే విషయాలను కూడా చర్చించాయి. జూన్ రెండో తేదీ మంగళవారంనాడు వెలువడిన ఎన్నికల ఫలితాల్లో బిజెపికి 240 స్థానాలు లభించడంతో జాతీయస్థాయిలో ఎక్కువ సీట్లు పొందిన ఏకైకపార్టీగా అవతరించింది. 99 స్థానాలు సంపాదించుకున్న కాంగ్రెస్‌పార్టీ రెండోస్థానంలో నిలిచింది. బిజెపి భాగస్వామిగా ఉన్న ఎన్ డి ఎ కూటమికి మొత్తం 293 స్థానాలు లభించాయి. మరోవైపు ఎన్ డి ఎ కూటమి కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు సమావేశం నిర్వహించింది. 'ఇండియా' కూటమికి మొత్తంగా 234 సీట్లు లభించాయి. ప్రతిపక్ష నాయకులు అందరూ ఈ సమావేశంలో ఎన్నికల ఫలితాలపై తమ తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి అవసరమైన మెజారిటీ సాధించేందుకు వీలుగా జనతాదళ్ (యునైటెడ్)ను, తెలుగుదేశంపార్టీనీ తీసుకురాగలమా? అనేవిషయంపై భాగస్వామ్యపార్టీల నాయకులు చర్చించారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్, డిఎంకె నాయకుడు టి.ఆర్.బాలు, జార్ఖండ్ ముఖ్యమంత్రి చంపై సోరెన్, జెఎంఎం నాయకులు కల్పనా సోరెన్, ఎన్‌సిపి(ఎస్‌పి) అధినేత శరద్‌పవార్, ఆయన కుమార్తె సుప్రియా సూలే, సమాజ్‌వాదీపార్టీ నాయకుడు అఖిలేశ్ యాదవ్, రామ్ గోపాల్ యాదవ్, టిఎంసి నాయకుడు అభిషేక్ బెనర్జీ, ఆర్‌జెడి నాయకుడు తేజస్వీ యాదవ్, శివసేన (యుబిటి) నాయకులు సంజయ్ రౌత్, అరవింద్ సావంత్, జమ్మూ కశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్ నాయకుడు ఒమర్ అబ్దుల్లా, సిపిఐ (ఎం) నాయకుడు సీతారామ్ ఏచూరి, సిపిఐ నాయకుడు డి.రాజా, ఆప్ నాకుడు సంజయ్ సింగ్, రాఘవ్ చద్దా, ఆర్ ఎస్‌పి నాయకుడు ఎన్.కె. ప్రేమ్‌చంద్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## నియంతృత్వానికి తెర

**(2వ పేజీ తరువాయి)**

జాతీయ కార్యవర్గం బుధవారం ఒక ప్రకటనలో అభినందనలు తెలియజేసింది. దేశవ్యాప్తంగా కార్మికసంఘాలు ఐక్యంగా చేసిన పోరాటాలు ఈ ఎన్నికల ఫలితాల్లో ఎంతో కీలకమైన పాత్ర వహించాయని, ఈ పోరాటాలు తదుపరి దేశ ప్రయోజనాలను, దేశ ప్రజలను అనివార్యంగా మరింత బలోపేతం చేస్తాయని కూడా ఎఐటియుసి జాతీయ కార్యవర్గం ఆ ప్రకటనలో పేర్కొంది. ''దేశ ప్రజాస్వామ్య వ్యవస్థపై కమ్ముకున్న నల్లటి కారు మబ్బుల న్నీ విడిపోయాయి, సామాన్య ప్రజలు తమ తీర్పు ద్వారా ఆ 'కారు మేఘాలను' పారద్రోలారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న మానవ నాగరితా సంప్రదాయాలను జీర్ణించుకున్న మన పురాతనమైన సింధులోయ నాగరికతా సంస్కృతికి వాటిల్లిన వినాశకరమైన ప్రమాదం నుండి దేశం రక్షింపబడింది. నియంతృత్వం, విద్వేష సంస్కృతి, మతప్రాతిపదికపై విభజన వంటి ప్ర మాదం నుండి మన మాతృభూమిని ప్రజలు రక్షించుకున్నారు. రాజ్యాంగా న్ని రక్షించేందుకు, లౌకిక, ప్రజాస్వామ్య విలువలను, అసమ్మతి తెలియజేసే హక్కును, భావ ప్రకటనాస్వేచ్ఛ హక్కును, అన్ని మతాలను, భాషల ను, సంస్కృతిని నిలబెట్టుకునే హక్కులను ప్రజలు ఓటు ద్వారా కాపాడుకున్నారు. నియంతలు పోరాటంలో ఎప్పటికీ ఓడిపోతారన్న ప్రజల విశ్వాసస్థాయి బాగా పెరిగింది. దేశంలో కార్మిక హక్కులను కాపాడుకోవడానికి, ప్రభుత్వరంగ వ్యవస్థలను రక్షించుకోవడానికి కార్మికవర్గం తమ పోరాటాలను కొనసాగించాలని ఎఐటియుసి కోరుతున్నది.

కార్మికులు, కర్షకులమ ధ్య ఐక్యతను మరింత పెంపొందించేందుకు, వారితోపాటు అసంఘటితరంగ, అనిశ్చిత కార్మికుల జీవనప్రమాణాలు పెంచేందుకు పోరాటాలను ముందుకు తీసుకుపోవాలి'అని ఎఐటియుసి తన ప్రకటనలో పిలుపు ఇచ్చింది.

## కూటమి గెలుపు మైనారిటీల విజయం: అఖిలేష్

**లక్నో :** ఉత్తర్‌ప్రదేశ్‌లో ఇండియా కూటమి గెలుపు, వెనుకబడిన తరగతులు, దళితులు, మైనారిటీల గెలుపు అని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షులు అఖిలేశ్ యాదవ్ వ్యాఖ్యానించారు. తమ పిడిఎ (పిచ్‌డా, దళిత్, అల్పసంఖ్యాక్ – వెనుకబడిన, దళిత, మైనారిటీ) వ్యూహం, కూటమి కష్టం ఫలించిందన్నారు. ప్రజల శక్తి కంటే ఏ ఇతర శక్తి బలమైంది కాదని, ఏ శక్తి దానిని మోసం చేయలేదన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం 'ఎక్స్'లో బుధవారం సందేశాన్ని పోస్ట్ చేశారు. ఇండియా కూటమి విజయం దళిత బహుజన విశ్వాసానికి నిదర్శనమని, వెనబడిన తరగతుతు, మైనారిటీలు, ఆదివాసీ, దళితులు, సగభాగం (మహిళల), సంపన్నులలో పేదల విజయమని పేర్కొన్నారు. ఈ వర్గాలన్నీ సమాన హక్కు, గౌరవం, ఆత్మ గౌరవం, గౌరవప్రదమైన జీవితం, రిజర్వేషన్ కల్పించే రాజ్యాంగ పరిరక్షణను తమ భుజాలపై వేసుకొని పోరాడారని అఖిలేశ్ అన్నారు.

## నీట్‌లో రెసోనెన్స్ ప్రభంజనం



ప్రజాపక్షం/హైదరాబాద్ : నీట్ పరీక్షలో రెసోనెన్స్ విద్యార్థులు చరిత్ర సృష్టించారు. రెసోనెన్స్ విద్యార్థి సిద్ధార్థ్ నీట్ 2024లో 720 మార్కులకు 715 సాధించారు. ఆలిండియా ర్యాంకింగ్స్‌లో 143 ర్యాంక్ వచ్చింది. మరో 13 మంది విద్యార్థులు 700లకు పైగా మార్కులు సాధించారు. షణ్ముఖ్ 54, వంశిక 184వ ర్యాంకు పొందారు. ఈ సందర్భంగా రెసోనెన్స్ విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ పూర్ణచంద్రరావు మాట్లాడుతూ రెసోనెన్స్ నీట్, జేఈఈ, ఇంజినీరింగ్, మెడికల్ ప్రవేశ పరీక్షలలో ప్రసిద్ధి చెందిన ప్రీమియర్ ఇన్‌స్టిట్యూట్ అన్నారు.




## జిపి కార్మికులకు జిఒ60 ప్రకారం వేతనాలు

మంత్రి సీతక్కకు ఎఐటియుసి వినతి



ప్రజాపక్షం/హైదరాబాద్ : గ్రామ పంచాయతీ కార్మికులందరికీ జి.ఓ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని మంత్రి సీతక్కను ఎఐటియుసి నాయకులు కోరారు. ఈ మేరకు మంత్రి సీతక్కను బుధవారం సచివాలయంలో కలిసి ఎఐటియుసి నాయకులు వినతిపత్రం అందచేశారు. మంత్రి సీతక్కను కలిసిన అనంతరం ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎండి యూసుఫ్, జిపిడబ్ల్యూయు రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహ్మారెడ్డి మాట్లాడుతూ గ్రామపంచాయతీ వ్యవస్థలో మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. అర్హులైన గ్రామపంచాయతీ కార్మికులను బిల్ కలెకర్లు, సహాయ కార్యదర్శులుగా నియమించాలన్నారు. గ్రామపంచాయతీ కార్మికులందరికీ పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించి, ఇతర సమస్యలను పరిష్కరించాలని మంత్రికి విజ్ఞప్తి చేశామని చెప్పారు. కార్యక్రమంలో జిపిడబ్ల్యూయు వర్కింగ్ ప్రెసిడెంట్ జయ చంద్ర, ప్రధాన కార్యదర్శి బి. వెంకట రాజ్యం, ఎఐటియుసి కొమరం భీం జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్, జిపిడబ్ల్యూయు రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచంద్రయ్య, జిల్లా కమిటీ సభ్యులు రవి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో ప్రత్యామ్నాయం బిజెపియే

ఎంపి ఈటల రాజేందర్

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో కాంగ్రెస్‌కు బిజెపియే ప్రత్యామ్నాయమని బిజెపి మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్ అన్నారు. హైదరాబాద్ నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. బిజెపి నుంచి గెలిచిన 8మంది ఎంపిలు అంతా సీనియర్లేనని, కేంద్ర సహాయ సహకారంతో రాష్ట్ర అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తన బాధ్యతలను విస్మరిస్తే వెంటపడి మరీ పనిచేసేలా చేస్తామని ఈ సందర్భంగా ఈటల తెలిపారు. మోదీ ప్రధాన మంత్రి కావాలనే ఆకాంక్షతో లోక్‌సభ ఎన్నికల్లో యావత్ తెలంగాణ ప్రజలు ఓటు వేశారని, ఆ ఓటే ఇప్పుడు మోదీని మూడోసారి ప్రధాన మంత్రిని చేయబోతున్నదని తెలిపారు.























































Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy**, Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR - 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao**, E-mail : editorprajapaksham@gmail.com

ప్రజాపక్షం
మహానగరి
హైదరాబాద్ – రంగారెడ్డి
కరీంనగర్ | గురువారం | 06 జూన్, 2024


## చట్టసభ సభ్యులపై కేసులు సత్వర విచారణ

**హైదరాబాద్ :** ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలపై నమోదైన కేసులను సత్వర విచారణ చేయాలంటూ ఇటీవల సుప్రీంకోర్టు జారీ చేసిన గైడ్‌లైన్స్‌ను ఆధారంగా చేసుకుని హైకోర్టు సుమోటో పిటిషన్‌గా తీసుకుని బుధవారం విచారించింది. ఆ కేసుల విచారణ విషయంలో గతంలో ఇదే హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సమర్థంగా అమలు చేయాలని అన్నికోర్టులకు తెలియజేయాలని, ఆఉత్తర్వులను కోర్టులకు పంపాలని చెప్పింది. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 8లో పేర్కొన్న కేసుల్ని జాప్యం లేకుండా వెంటనే విచారించాలని గత ఏడాది సుప్రీంకోర్టు మార్గదర్శకాలపై చీఫ్ జస్టిస్ ఆలోక్ ఆరాధే ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్ విచారించింది. ఈ ఏడాది 150 వరకు కొత్త కేసులు దాఖలయ్యాయని, గతంలో 250 వరకు కేసులు ఉన్నాయని, సమన్లు జారీ కూడా జారీ అయ్యాయని హైకోర్టు రిజిస్ట్రీ వివరించింది. వాదనలు అయ్యాక కూడా పలు కోర్టులు తీర్పులు చెప్పకపోవడాన్ని బెంచ్ ఆక్షేపించింది. విచారణను వచ్చే నెలకు వాయిదా వేసింది.

## మెట్రో రైలు సేవలకు అంతరాయం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సాంకేతికలోపంతో బుధవారం సాయంత్రం మియాపూర్ నుంచి ఎల్‌బినగర్ వైపు వెళుతున్న మెట్రోరైల్లో అంతరాయం ఏర్పడింది. దీంతో మియాపూర్ – ఎల్‌బినగర్ మార్గంలో రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. మెట్రో రైల్లో సాంకేతిక లోపంతో ఎర్రమంజిల్ స్టేషన్‌లో నిలిచిపోయింది. ప్రయాణికులు బయటకు వెళ్లడానికి మెట్రో డోర్‌లు ఓపెన్ చేసే సమయంలో తెరుచుకోలేదు. దీంతో ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. రైల్లో ఉక్కపోతతో ప్రయాణికులు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. అధికారులు సాంకేతిక లోపాన్ని గుర్తించి, మరమ్మతులు చేయించారు. దీంతో కొద్దిసేపటి తర్వాత సేవలు ప్రారంభం కావడంతో ప్రయాణికులు ఊపిరిపిల్చుకున్నారు. కాగా హైదరాబాద్‌లో భారీవర్షాల కారణంగా రోడ్లపై ట్రాఫిక్ స్తంభించింది. దీంతో చాలామంది ప్రయాణికులు మెట్రో రైలు ఎక్కారు. మెట్రో స్టేషన్‌లు ప్రయాణికులతో కిటకిటలాడాయి.

# హైదరాబాద్ పలుప్రాంతాల్లో భారీ వర్షం







**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. బుధవారం సాయంత్రం కమ్ముకున్న మేఘాలకు తోడు ఈదురుగాలులు, ఉరుములతో పలు ప్రాంతాల్లో వర్షం పడింది. కూకట్‌పల్లి, గచ్చిబౌలి, మాదాపూర్, బోరబండ, చార్మినార్, కోఠి, సుల్తాన్‌బజార్, బేగంబజార్, అబిడ్స్, బషీర్ బాగ్, లిబర్టీ, హిమాయత్ నగర్, నారాయణగూడ, ట్యాంక్‌బండ్, పంజాగుట్ట, ఎల్‌బినగర్, అబ్దుల్లాపూర్ మేట్ ప్రాంతాల్లో వర్షం కురిసింది. వర్షంతో వాహనదారులు తడిసిముద్దయ్యారు. వేడిమి ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు ఉపశమనం పొందారు. సాయంత్రం సమయంలో నగరంలో వర్షం పడటంతో కార్యాలయాల్లో పనులు ముగించుకొని ఇళ్లకు వెళ్లే ఉద్యోగులు, వాహనదారులు తీవ్రఇబ్బందులు పడ్డారు. హైదరాబాద్‌లో కురిసిన వర్షానికి మాదాపూర్లో వాహన రాకపోకలు స్తంభించిపోయాయి. వర్షంకారణంగా సుమారు గంటసేపు వాహనాలు నిలిచిపోయాయి. జూబ్లీహిల్స్ నుంచి హైటెక్ సిటీ వెళ్లే మార్గంలో అధికంగా ట్రాఫిక్ స్తంభించింది. వరదనీరు నిల్వడంతో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ ఏర్పడింది. కొన్ని ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విరిగి పడ్డాయి. జిహెచ్‌ఎంసికి చెందిన అత్యవసర, ఈవిడిఎం బృందాలు రంగంలోకి దిగి కూలిపోయిన చెట్లను తొలగించే పనులు చేపట్టారు. రహదారులపై నిలిచిన వరద నీరు పారేందుకు డ్రెయిన్‌లను మరమ్మతులు చేశారు.



మ్యాన్‌హోల్ మూతలు తెరించారు. వర్షాలు కురిసే సమయంలో వాహనదారులు జాగ్రత్తగా ఉండాలని హెచ్ఎంసి అధికారులు కోరారు. చెట్లు, విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రమాదాలు జరిగితే జిహెచ్‌ఎంసి కంట్రోల్ రూమ్ నెంబర్ 040 21111111సమాచారం ఇవ్వాలని తెలిపారు.



ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం హెచ్‌ఎండిఏ జాయింట్ కమిషనర్ ఆమ్రపాలి కటా, అర్బన్ ఫారెస్ట్రీ డైరెక్టర్ ప్రదీప్ కుమార్ శెట్టి, హెచ్‌ఎండిఏ ఇన్‌చార్జ్ చీఫ్ ఇంజనీర్ పరంజ్యోతి, విశ్వప్రసాద్, ఫారెస్ట్ మేనేజర్ అమృతలు సంజీవయ్య పార్కులో మొక్కలు నాటారు.

## వరద నీరు సమస్య పరిష్కారానికి పటిష్టమైన చర్యలు

జిహెచ్‌ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వరద నీరు సమస్య లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిహెచ్‌ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్ అధికారులను ఆదేశించారు. బుధవారం కమిషనర్ ఇంజనీర్ ఇన్ చీఫ్(ఇ ఎన్ సి) జియా ఉద్దీన్‌తో కలిసి సోమాజిగూడ, ఖైరతాబాద్ ప్రాంతాలలో వరదనీరు నిలిచే ప్రాంతాలను పరిశీలించారు. తాజ్‌కృష్ణ హోటల్, ఎర్రమంజిల్ మెట్రో స్టేషన్ వద్ద నుండి వచ్చే వరద నేరుగా వెళ్లేందుకు తాజ్ హోటల్, ఆర్‌టిఏ కార్యాలయం లెక్యూ గెస్ట్ హౌస్ వద్ద సంపులు నిర్మించేందుకు ప్రతిపాదనలు రూపొందించి, పంపించాలని ఆదేశించారు. ఈ సందర్భనలో ఖైరతాబాద్ జోనల్ ఎస్ఈ రత్నాకర్, ఈఈ ఇందిరాబాయి తదితరులు ఉన్నారు.

## అనుమతి లేని కళాశాలపై చర్యలు తీసుకోవాలి : ఎఐఎస్ఎఫ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అనుమతి లేని ఇంటర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈమేరకు ఎఐఎస్ఎఫ్ హైదరాబాద్ జిల్లా కమిటీ ప్రతినిధుల బృందం బుధవారం జిల్లా ఇంటర్ విద్యాధికారి(డిఇఓ)కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చైతన్య యాదవ్, గ్యార నరేష్, మాట్లాడుతూ ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల్లో వసూలు చేస్తున్న అధిక ఫీజులను నియంత్రించి, ప్రభుత్వ అనుమతి లేని కళాశాలల జాబితాను బహిర్గతంయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా జిల్లాలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలల సమస్యలు పరిష్కరించి, ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులు భర్తీ చేసే విధంగా చర్యలు చెప్పటాలని పేద మధ్యతరగతి విద్యార్థులకు అందుబాటులో ఉండేలా ప్రభుత్వ కళాశాలలు అభివృద్ధి పరచాలని ఆ దిశగా అధికారులు కృషి చేయాలని కోరారు. ప్రైవేటు కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు సైన్స్ లాబ్స్, ఆధునిక టెక్నాలజీకి అనుగుణంగా కంప్యూటర్స్ లాంటి పరికరాలను అందుబాటులో ఉంచి నాణ్యమైన విద్య అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.అనుమతి లేని కళాశాల పై చర్యలు తీసుకోవాలని లేకపోతే ఎఐఎస్ఎఫ్ ప్రైవేట్ కళాశాలలు మూసి వేసే వరకూ ఉద్యమం కొనసాగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి అనిల్ నాయకులు విజయ్ పాల్గొన్నారు.

## ప్రజలకు సేవ చేయాలన్నదే లక్ష్యం

ఎంఎల్‌సి నవీన్‌కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** బడుగు బలహీన వర్గాల ప్రజల శ్రేయస్సు కోసం తాను పని చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు స్థానిక సంస్థల ఎంఎల్‌సి నాగర్ కుంట నవీన్‌కుమార్ రెడ్డి తెలిపారు. బుధవారం షాద్‌నగర్‌లో ఎంఎల్‌సిగా నూతనంగా ఎన్నికైన నవీన్‌కుమార్‌రెడ్డిని బిఆర్ఎస్ నాయకులు ఘనంగా పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పేదల అభివృద్ధి, సంక్షేమంతోపాటు స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను దూరం చేయాలంటే ముందుకు సర్పంచ్, ఎంపిటిసి ఎన్నికలను నిర్వహించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు తాంద్ర గోపాల్‌రెడ్డి, మాడుగుల విక్రమ్‌శర్మ, గడ్డల యాదగిరి ముదిరాజ్, న్యాయవాది శ్రీనివాస్‌రెడ్డి, మెక్కొండ అనిల్ గౌడ్‌తోపాటు కార్యకర్తలు ఉన్నారు.

## అవార్డు అందుకుంటున్న కమిషనర్



**ప్రజాపక్షం/నార్సింగి:** వరల్డ్ ఎన్విరాన్మెంటల్ డే సందర్భంగా చెత్తని బ్రికిట్స్ చేస్తున్నందుకు, ప్లాస్టిక్ వేస్ట్ నుంచి గ్రాండ్విల్ కన్వర్ట్ చేస్తున్నందుకు, కిచెన్ వేస్ట్ ను వర్మి కంపోస్టు ఎరువులుగా తయారుచేస్తునందుకు , మణికొండ మున్సిపాలిటీకి తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఎక్సలెన్స్ ఇన్ ఎన్విరాన్మెంటల్ పర్ఫామెన్స్ అవార్డు తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రిన్సిపల్ సెక్రటరీ వాణిప్రసాద్ చేతుల మీదుగా మణికొండ మున్సిపల్ కమిషనర్ ప్రదీప్ కుమార్ బుధవారం అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ ఈ అవార్డు రావడం వలన చాలా సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు మున్సిపాలిటీలో ఉన్న చెత్తాచెదారం వేస్టు ను కంపోజ్ చేయడం వలన ఎరువులను చెట్లకు పొలాలలో వేసుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు. అదేవిధంగా ఇట్టి సందర్భాన్ని పురస్కరించుకొని హూడా కాలనీలో ప్లాంటేషన్ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డిఇ దివ్య జ్యోతి,ఎఇఇ సాయి మౌనిక, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## శానిటేషన్ ఇబ్బందులు రావొద్దు

కమిషనర్ బి.శరత్ చంద్ర




**ప్రజాపక్షం/రాజేంద్రనగర్ :** బండ్లగూడ జాగీర్ మున్సిఫల్ కార్పొరేషన్ కమిషనర్ పరిధిలోని కాళీకా నగర్, ఓంనగర్ కాలనీని కమిషనర్ బి.శరత్ చంద్ర తన సిబ్బందితో కలిసి పర్యటించారు. కాలనీలో జెట్టింగ్ మిషన్, సిల్టింగ్ ఆటో ద్వారా చేపట్టిన డ్రైనేజీ పనులను పరిశీలించారు. ఈసందర్భంగా కమిషనర్ శరత్‌చంద్ర మాట్లాడుతూ వర్షకాలాన్ని దృష్టిలో ఉంచుకొని డ్రైనేజీలో ఉన్న స్టీల్(మట్టి) మొత్తం తీసి ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని శానిటేషన్ సిబ్బందిని ఆదేశించారు. కార్పొరేషన్ పరిధిలో రాబోయే వర్షకాలంలో శానిటేషన్ సిబ్బంది ఎప్పటికప్పుడు చెత్తను తొలగించాలని ఆదేశించారు. కాలనీ, బస్తీలల్లో ప్రజలు చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా చెత్త సేకరణ ఆటోలోనే వేయాలని కోరారు. వర్షాకాలవలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా శానిటేషన్ సిబ్బంది విధులు నిర్వహించాలని కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో సానిటరీ ఇన్స్‌స్పెక్టర్ నరేష్, శానిటరీ జవాన్లు సావిత్రి, డ్రైనేజీ టీం సభ్యులు కాళీదాసు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## భవిష్యత్ తరాలకు భూమి పరిరక్షణ

ఇండియా – ఐటిపిఐ సదస్సులో వక్తలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :**భవిష్యత్తు తరాలు ఉపయోగించుకునేందుకు అనువుగా భూవనరుల పునరుద్ధరణతో పాటు కరువు నివారణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని పర్యావరణవేత్తలు, ప్రొఫెసర్లు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం– 2024ను పురస్కరించుకుని ఇనిస్టిట్యూట్ ఆఫ్ టౌన్ ప్లానర్స్ (ఇండియా–ఐటిపిఐ) తెలంగాణ రీజినల్ చాప్టర్ ఆధ్వర్యంలో 'భూమి పరిరక్షణ, భవిష్యత్తు తరానికి ఉపయోగించేందుకు భూమి పునరుద్ధరణ, ఎడారీకరణ, కరువు తట్టుకోవడం' అంశంపై సదస్సు బుధవారం నిర్వహించారు. సదస్సులో హైదరాబాద్ అర్బన్ ల్యాబ్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ మరిగంటి, హైదరాబాద్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ శ్రీనివాస్ పెంటకోట్‌తో ప్రసంగించారు. ఐటిపిఐ టిఆర్‌సి డిటిసిపి డైరెక్టర్ ఎస్.దేవేందర్‌రెడ్డి, సెక్రటరీ కె.మురళీధర్‌రెడ్డి అధ్యక్షతన ప్లానింగ్ స్టూడెంట్స్ కోసం జాతీయస్థాయి పోటీ జరిగింది. పోటీలను ఐటిపిఐ టిఆర్‌సి సభ్యులు డాక్టర్ వసంతశోభా తురగ, ప్రొఫెసర్ కల్పనారాఘవేంద్ర, ప్రొఫెసర్ షాలిని కాకాని, ప్రొఫెసర్ అపర్ణాదేవిశెట్టి సమన్వయంతో జెఎన్ఎ, ఎఫ్ఎయు ప్రణాళికా విభాగం అధ్యాపకురాలు డాక్టర్ సంధ్యాఈసమల నిర్వహించారు. 'నగరం – పర్యావరణం' అనే అంశంపై నిర్వహించిన జాతీయస్థాయి ప్లానింగ్ స్టూడెంట్స్ పోటీలు 2024 విజేతలను ప్రకటించింది. దేశవ్యాప్తంగా ఎంప్లాన్, బిప్లాన్ చదువుతున్న విద్యార్థులు ఏదైనా నిర్దిష్ట భారతీయ నగరాన్ని పర్యావరణంపై ముఖ్యంగా నీరు, వాతావరణం, శక్తి, వృక్షసంపద తదితర అంశాల గురించి అధ్యయనం చేసి ఒక శాస్త్రీయ పత్రాన్ని, పోస్టర్‌ను సమర్పించడానికి కోరారు. విజయవాడ ఎస్‌పిఎ డాక్టర్ ప్రొఫెసర్ రమేష్ శ్రీకొండ, జెఎన్ఎఫ్ఎయు డాక్టర్ ఎస్.కుమార్, లైఫ్ స్క్రిప్ట్ సైంటిస్ట్ రవికుమార్‌రెడ్డి, ప్రొఫెసర్ కల్పనా రాఘవేంద్ర, ప్రొఫెసర్ షాలిని కాకాని న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. కాలికట్ నుండి ఎసి అర్షియా, విబి అనుశ్రీ, ఎఆర్ ఆదర్శ్ రచించిన 'కార్బన్ ఎమిషన్, సీక్వెస్ట్రేషన్‌ను విశ్లేషించడం ద్వారా భారతీయ నగరానికి కార్బన్ న్యూట్రాలిటీని అంచనా వేయడం: ఎకేస్ ఆఫ్ త్రిసూర్ సిటీ' అనే పేపర్ ప్రథమ బహుమతిని కైవసం చేసుకుంది. హైదరాబాద్‌లోని జెఎన్ఎఎఫ్ఎయు నుండి గాజుల అంజలి, మేఘరాజ్ ధనంజయ్, అభినయ్ ఇంద్రాణి రచించిన 'బెంగళూరు నీటి సంక్షోభం: విశ్లేషణ కారకాలు, వ్యూహాత్మక విధానాలు' అనే పేపర్‌కు రెండవ బహుమతి లభించింది. ఢిల్లీ ఎస్‌పిఎ నుండి చిన్మయీ కలంగుట్కర, దేవేష్ పట్వారీబ్, ఎస్.ధనుష్‌కుమార్ రచించిన 'బలమైన ఇండికేటర్ అప్రోచ్‌ను ఉపయోగించి చెన్నైలోని నీటి లభ్యతపై సామాజిక, పర్యావరణ ప్రభావాలను అంచనా వేయడం' అనే పేపర్‌కు మూడవ బహుమతి దక్కింది. విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేసినట్లు ఐటిపిఐ – టిఆర్‌సి కార్యదర్శి కె.మురళీధర్‌రెడ్డి వివరించారు.



## ఎన్‌డిఏతో కార్మికులకు కష్టాలే..

ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం తిరిగి అధికారానికి రావటంతో కార్మికవర్గానికి మరిన్ని కష్టాలు, నష్టాలు వచ్చే ప్రమాదం ఉన్నదని, భవిష్యత్తులో ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై కార్పొరేట్ అనుకూల విధానాలతో పోరాటాలకు సిద్ధం కావాలని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజ్ పిలుపునిచ్చారు. 400 స్థానాలు గెలిచి దేశంలో ప్రతిపక్షపార్టీల పతనం చూద్దామనుకున్న మోదీకి ప్రజలు తగిన హెచ్చరిక చేసి సీట్లను తగ్గించి బిజెపికి చుక్కలు చూపించారన్నారు. ఎఐటియుసి రాష్ట్ర సమితి నిర్మాణంపై బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పూర్తి కాలం పనిచేసే నాయకులందరు అన్నిరంగాలలో పనిచేసిన సంఘటిత, అసంఘటితరంగ కార్మికులకు యూనియన్లు ఏర్పాటు చేసి బలమైన సంఘం నిర్మించాలని ఆయన కోరారు. ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు యం.డి.యూసుఫ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అన్ని జిల్లాలలో అన్ని ఎఐటియుసి అనుబంధ సంఘాలలో ఉన్న కార్మికులకు, కార్మిక నాయకులకు ట్రేడ్ యూనియన్ క్లాసులు ఏర్పాటు చేయాలని సమావేశం నిర్ణయించిందని తెలిపారు. ఎఐటియుసి అన్ని అనుబంధ సంఘాల అఫ్లియేషన్ ఫీజును చెల్లించాలని ఆయన కోరారు. రాష్ట్రంలో, జిల్లాలలో జరుగు అన్ని కార్యక్రమాలను సోషల్ మీడియా ద్వారా విస్తృతమైన ప్రచారం కల్పిస్తూ కార్మికవర్గానికి ఎప్పటికప్పుడు చైతన్య పర్చాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధానకార్యదర్శి యం.నర్సింహ్మా, ఉపాధ్యక్షులు వి.రత్నాకర్‌రావు, బి.చంద్రయ్య, కార్యదర్శులు వై.ఓమయ్య, ఎస్.విలాస్, బి.వెంకటేశం, నందూరి కరుణకుమారి, పల్లా దేవేందర్‌రెడ్డి, ఎండి ఇమ్రాన్, బోగే ఉపేందర్, కె.మాసన్న, వి.శ్రీనివాసులు, ఎన్.శివశంకర్, బి.వెంకటరాజం తదితరులు పాల్గొన్నారు.



## ఎర్రకుంట చెరువు పరిశీలన



**ప్రజాపక్షం/రాజేంద్రనగర్ :** బండ్లగూడ జాగీర్ మున్సిఫల్ కార్పొరేషన్ పరిధిలోని హైదర్‌షాకోట్‌లోని భాగ్యనగర్ కాలనీ, లక్ష్మీ నగర్ కాలనీ, రఘురాం నగర్ కాలనీలతో పాటు ఎర్రకుంటను చెరువులో జరుగుతున్న పనులను బుధవారం మేయర్ లతాప్రేమ్‌గౌడ్,డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ పుష్ప శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి పర్యటించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎర్రకుంట చెరువులో పూడిక తీసేటంతో హైదర్‌షాకోట్ పరిసర బస్తీలు,కాలనీల్లో నీటి ఎద్దడి సమస్య ఇక ముందు తలెత్తదన్నారు. ఈపూడికి పనులను త్వరిత గతిన పూర్తి చేస్తే ఈఏడాది చెరువు నిండినట్లయితే వచ్చే ఏడాది కాలనీ వాసులకు ఎలాంటి నీటి సమస్య తలెత్తదన్నారు. పనులు జరగటం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. పర్యటనలో మాజీ ఎంపిటిసీ రవికాంత్ రెడ్డి కాలనీ వాసులు పాల్గొన్నారు.

## వీధికుక్కల దాడిలో బాలుడి మృతి

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** శేర్లింగంపల్లి నియోజక వర్గంమియాపూర్ పోలీసు స్టేషన్ పరిధిలోని మక్తాలో దారుణం జరిగింది.ఓ ఆరేండ్ల బాలుడిపై వీధి కుక్కలు దాడి చేసి చంపాయి.బుధవారం ఉదయం మక్తాలోని నిర్మానుష్య ప్రాంతంలో బాలుడి మృతదేహం లభ్యమైంది.బాలుడి తల్లిదండ్రులు స్థానికంగా భిక్షాటన చేస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది.మంగళవారం రాత్రి ఆడుకుంటూ బయటకు వెళ్లిన బాలుడు కనిపించకుండా పోయాడు.దీంతో అప్రమత్తమైన తల్లిదండ్రులు బాలుడి అదృశ్యంపై మియాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.స్థానికంగా ఉండే డంపింగ్ యార్డు వద్ద కుక్కలు అధికంగా ఉన్నాయి.దాంతో అక్కడికి వెళ్లి చూడగా, బాలుడి మృతదేహం కనిపించింది.బాలుడి శరీరమంతా గాయాలు ఉన్నాయి.మృతుడి తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు.

## పరిశోధన కేంద్రంలో పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలి

**ప్రజాపక్షం/హయత్ నగర్ :** క్రీడా వ్యవసాయ పరిశోధన కేంద్రంలో పనిచేస్తున్న తమను పర్మినెంట్ చేయాలని కార్మికులు డిమాండ్ చేశారు. బుధవారం క్రీడా వ్యవసాయ పరిశోధన కేంద్రం వద్ద ధర్నా చేశారు. 30 సంవత్సరముల నుంచి సర్వీస్ చేస్తున్నారని, కానీ తమను పర్మినెంట్ చేయలేదని, తక్షణమే రెండు సంవత్సరాల పైబడిన కాంట్రాక్ట్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల కనీస వేతనం 26 వేల రూపాయలు, యూనిఫామ్, షూ, విధులతో కూడిన ఐడెంటి కార్డులు ఇవ్వాలని, కనీస బోనస్ 8.33 శాతం కార్మికులందరికీ ఇవ్వాలని, డిమాండ్ చేశారు. సామరస్యంగా క్రీడాప్రాంగణంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన చేస్తూ విధులు నిర్వహిస్తున్న కార్మికులని ఫామ్ మేనేజర్లు బెదిరించడాన్ని కార్మిక సంఘం నాయకులు ఖండించారు.

## మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

ఎంపిపి కొప్పు సుకన్య భాషా

**ప్రజాపక్షం/యాచారం :** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని యాచారం ఎంపిపి కొప్పు సుకన్యబాష అన్నారు. బుదవారం యాచారం మండల పరిధిలోని మల్కిజ్‌గూడ గ్రామంలొ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు . ఈ సంధర్బంగా అమే మాట్లాడుతూ కాలుష్య నివారణకు అందరు సహకరించాలని కొరారు.మొక్కలు నాటడంద్వారా ఎన్నో ఉప యోగాలున్నాయని అన్నారు. మనకు అక్సిజన్ అందిస్తుందని అన్నారు. ప్రాణ వాయువును అందించే మొక్కలను అందరు నాటాల్సిన అవసరం ఉందని అన్నారు.పర్యావరణ పరిరక్షణకు చెట్లు ఎంగానో దోహదం చేస్తాయని అన్నారు. చెట్లుంటే క్షేమం లేకుంటే క్షామం అని అన్నారు. మానవాలి మనుగడకు ఎంతగానో దోహదం చేస్తాయని అన్నారు. అందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ నరేంధర్‌రెడ్డి, ఎంపిటిసి దెరంగుల శారద, ఉపాధి ఎపిఒ లింగయ్య, పంచాయతి కార్యదర్శి , ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





### ప్రతి ఒక్కరు ఒక మొక్క నాటితే రేపటి భావితరాలకు ఉపయోగ పడుతాయి.

**యాచారం :** ప్రతి ఒక్కరు ఒక మొక్క నాటితే అవి రేపటి భావి భారత తరాలకు ఎంతగానో ఉప యోగ పడుతాయని ఉపాధి ఎపిడి సక్రియా నాయక్ అన్నారు. బుదవారం యాచారం మండల పరిధిలోని నందివన పర్తి గ్రామంలో అయన పర్యటించారు. గ్రామంలో అమలౌతున్న పనులను అయన పరిశీలించారు. ఈ సంధర్బంగా అయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఒక మొక్క నాటాలని అన్నారు. అందరు సహకరించాలని అన్నారు. చెట్లు ప్రగతికి మేట్లని కొనియడారు. గ్రామాభివృద్దకి తన వంతుగా కృషి చేస్తామని అన్నారు. అందరు సహకరించాలని కొరారు. హరిత హరంలో పెట్టిన మొక్కలను అయన పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది. పంచాయతి కార్యదర్శి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా బుధవారం డిఎఫ్ఓ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఫత్తేపూర్ మైసమ్మ దేవాలయ పరిసరాలలో ప్లాస్టిక్ నివారణ గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చుట్టు పక్కల అటవీ ప్రదేశాలలో పడిన ప్లాస్టిక్ ని తొలగించారు.



## పర్యావరణాన్ని కాపాడుదాం

**ప్రజాపక్షం/అడ్డాకుల:** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అడ్డాకుల మండలం తిమ్మాయిపల్లి గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలు చెట్లు నాటారు. ఈ సందర్భంగా ఈసీ ఏపీఓ మాట్లాడుతూ మనమందరం కూడా పర్యావరణాన్ని కాపాడే బాధ్యతగా ప్రతి ఒక్కరం మన పరిసరాలలో మన పొలంలో మరియు ఇంటి దగ్గర చెట్లు నాటుకొని పర్యావరణాన్ని కాపాడాలని వారు సూచించారు. చెట్లు పెంచడం ద్వారా వర్షాలు కురుస్తాయి మంచిపంటలు పండుతాయి. అనేక మైన లాభాలు కూడా రైతులకు కూలీలకు అందరికీ లాభోదయకంగా ఉంటుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు ఈసీ ఏపీఓ తదితరులు పాల్గొన్నారు.



## రాజోలిలో

**ప్రజాపక్షం/రాజోలి :** మొక్కలతోనే మనిషికి మనుగడ ఉంటుందని తూర్పు గార్లపాడు గ్రామ పంచాయితీ కార్యదర్శి నారాయణమ్మ అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రైతు వేదిక పరిసరాలలో మొక్కలు నాటి నీరుపోశారు. పర్యావరణ పరిరక్షణకు బాధ్యతగా ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని ఆమె గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ జమ్మన్న, సతీష్, పంచాయితీ సిబ్బంది, మద్దిలేటి , రమేశ్, శంకర్ పాల్గొన్నారు.



## మొక్కలునాటిన న్యాయమూర్తులు

**ప్రజాపక్షం/జడ్చర్ల :** బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకోని జడ్చర్ల కోర్టులో న్యాయమూర్తులు న్యాయవాదులు కోర్టు సిబ్బంది కలిసి మొక్కలు నాటారు. ముందుగా జడ్చర్ల జూనియర్ సివిల్ జడ్జి లక్ష్మి మొక్కలు నాటి నీళ్ళు పోశారు. అలాగే అడిషనల్ కోర్టు న్యాయమూర్తి ముద్దాసిర్, జడ్చర్ల న్యాయవాద అధ్యక్షులు కే. జంగయ్య కూడా మొక్కలు నాటి నీళ్ళు పోశారు. ఈ సందర్భంగా పలుపురు సీనియర్ న్యాయవాదులతో పాటు కోర్టు సిబ్బంది కూడా మొక్కటు నాటారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి లక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఇక్కరు మొక్కలు నాటాలని వారివారి ఇండ్ల ఆవరణలో మొక్కలను నాటాలని పర్యావరణాన్ని కాపాడాలని, పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు తిరుపతి మాలిక్ షాకీర్, మహేశ్వర్ రెడ్డి, లతో పాటు మాజీ అధ్యక్షులు విశ్వేశ్వర్, ప్రస్తుతం ఉపాధ్యక్షులు యాదిరెడ్డి జనరల్ సెక్రెటర శ్రీనివాసులు, రాములు, భాస్కర్ రెడ్డి కోర్టు సిబ్బంది శివకుమార్, మహేష్ యాదయ్యలతోపాటు మహిళా కోర్టు సిబ్బంది దివ్యకైకేయి పాల్గొన్నారు.



## ఆముదాలపాడులో అవెన్యూ ప్లాంటేషన్

**ప్రజాపక్షం/మానవపాడు :** పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలం నందు పెద్ద ఆముదాల పాడుగ్రామం నందు అవెన్యూ ప్లాంటేషన్ యొక్క మొక్కలు నాటినటువంటి కార్యక్రమంలో ఎంపీడీవో ఆంజనేయ రెడ్డి ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ కూలీలకు గ్రామస్తులకు పర్యావరణ సమతుల్యత యొక్క అవశ్యకతను వివరిస్తూ ఈ క్రమంలో భూగోళంలో విస్తరిస్తున్నటువంటి తీవ్రమైన టువంటి భూతాపాన్ని అరికట్టడంలో భాగంగా గత పది సంవత్సరాలుగా ఉపాధి హామీ కింద చేపడుతున్న హరితహారం కార్యక్రమం యొక్క ప్రాధాన్యతను వివరిస్తూ గ్రామస్తులకు అవగాహన కల్పించడం అయింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అంజనేయరెడ్డి, ఏపీవో విజయశంకర్ పంచాయితీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, ఈసీ చెన్నకేశవులు, టెక్నికల్ అసిస్టెంట్లు సుగ్నానము , రమేశ్, లు ఫీల్డ్ అసిస్టెంట్ బాలరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆకస్మిక తనిఖీ

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** తెలంగాణరాష్ట్ర న్యాయసేవా అధికారసంస్థ ఆదేశానుసారం బుధవారం ప్రిన్సిపల్‌డిస్ట్రిక్ట్‌సెషన్స్ జడ్జి డి.రాజేష్ బాబు జిల్లాలోని సబ్‌జైల్‌ను ఆకస్మికంగాతనిఖీచేశారు. ఖైదీలకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఖైదీలకు అందిస్తున్న ఆహార పదార్థాలను, వంటరూములను క్షుణ్ణంగా పరిశీలించారు. కూరగాయలు, బియ్యం, నిత్యావసరవస్తువులను తనిఖీచేశారు. స్టోర్‌రూమ్, బాత్‌రూములను పరిశీలించారు. జైలులోని సిసి కెమెరాలు పనిచేసే విధంగా చూడాలన్నారు. లైబ్రరీని సందర్శించి ఖైదీలకు సరిపడా పుస్తకాలను ఏర్పాటుచేయాలని అధికారులను ఆదేశించారు. సబ్‌జైల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లాన్యాయసేవా అధికారసంస్థ సెక్రటరీ సబిత, జైలుసిబ్బంది, కోర్టుసిబ్బంది పాల్గొన్నారు.

### బిజెపికి మెజారిటీ రాకపోవడంతో

# దేశానికి తప్పిన పెనుగండం

### టిపిసిసి సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'చార్ సౌ పార్' నినాదంతో ప్రచారం చేసి మళ్ళీ అధికారం లోకి రాగానే కామన్ సివల్ కోడ్ తెస్తామని ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తామని తదితర వారి హిడెన్ ఎజెండాకు బ్రేక్ పడిందని టిపిసిసి సీనియర్ ఉపాధ్యక్షుడు ఎన్.నిరంజన్ పేర్కొన్నారు. జై శ్రీరామ్ పేరుతో అయోధ్య రామమందిరాన్ని రాజకీయ ప్రచారాస్త్రంగా మలుచుకున్న బిజెపి కి ఉత్తర ప్రదేశ్ లోని పార్లమెంట్ సీట్లలోని 80 సీట్లలో 33 సీట్లు రావడం వారికి చెంపపెట్టన్నారు. 2014లో 282 సీట్లు, 2019లో 303 సీట్లు తెచ్చుకున్న బిజెపి, 2024లో కేవలం 240 సీట్లు తెచ్చుకుందని తెలిపారు. ఈ ఎన్నికలలో బిజెపికి సంపూర్ణ మెజారిటీ రాలేదని, 2019 కంటే 63 సీట్లు తక్కువ వచ్చాయని, ఎన్డిఏ కు 2014లో 336 సీట్లు, 2019లో 353 సీట్లు వస్తే, 2024లో 295 సీట్లకు పడిపోయిందన్నారు. అదీ జెడియు 12 సీట్లు, టిడిపి 16 సీట్లు, జనసేన పార్టీ 2 సీట్లు కలుపుకుంటేనే బిజెపి కి పూర్తిగా మెజారిటీ రాకున్నా తానే ప్రధానిని అవుతానని నిన్న ఢిల్లీ బిజెపి కేంద్ర కార్యాలయంలో మోడీ మాట్లాడుతూ చెప్పడం హాస్యాస్పదమన్నారు. ఇది ఆయనలోని అధికార దాహానికి నిదర్శనం.సాధారణంగా ఎన్నికలు జరిగిన తర్వాత పార్టీ పార్లమెంటరీ పార్టీ మీటింగ్లో పార్టీ నాయకుడిని ఎన్నుకుంటారన్నారు. ఆ తర్వాత ఎన్డిఏ మీటింగ్ లో ఎన్డిఏ నాయకుడిని ఎన్నుకున్న తర్వాతనే ప్రధానమంత్రి పేరు ఖరారు అవుతుందన్నారు. .ఈ తతంగానికి పూర్వమే మోడీ తనకు తానే ప్రకటించుకోవడం ఆయనలోని నియంతృత్వ పోకడలకు నిదర్శనమని విమర్శించారు. నిన్న ఒక పత్రికా సమావేశంలో ఇండియా కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందా'' అనే ప్రశ్నకు రాహుల్ గాంధీ జవాబు చెప్తూ ''రేపు ఇండియా కూటమి సమావేశమై నిర్ణయం తీసుకుంటుందని చెప్తూ, ప్రజాస్వామ్య స్ఫూర్తిని ప్రస్ఫుటం చేశారని గుర్తు చేశారు.ఎన్డిఏ తో పోవాలని నిర్ణయించుకున్న తర్వాత చంద్రబాబు నాయుడు ఆంధ్రలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతూ తమ ప్రభుత్వం వస్తే ముస్లిం రిజర్వేషన్ ను కొనసాగిస్తామని చెప్పడాన్ని గమనించాలన్నారు. రానున్న కాలంలో చంద్రబాబు నాయుడు ఎన్డిఏ లో కొనసాగితే కామన్ మినిమమ్ ప్రోగ్రామ్ లో ఇటువంటి పరస్పర విరుద్ధ అంశాలు లేకుండా ఏమేరకు చూడగలుగుతారో చూడాలన్నారు.

# కాంక్రీట్ నిర్మాణాల్లో నూతన సాంకేతిక విధానం

### పటిష్టమైన నిర్మాణాలు ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ అఫ్ ఇండియా డైరెక్టర్ రామేశ్వర్ రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇంజనీరింగ్ రంగంలో వ్యవసాయం మొదలు మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఏరోనాటిక్స్, కెమికల్, కంప్యూటర్, బయోటెక్ తదితర అనేక శాస్త్రాలు ఉన్నప్పటికీ, తరతరాలుగా సివిల్ ఇంజనీరింగ్ శాస్త్రాన్ని మాత్రం ఉపయోగిస్తున్న అనేక ఉదాహరణలు ప్రపంచంలో ఉన్నాయని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి. రామేశ్వర్ రావు అన్నారు. అవి గుడులు, గోపురాలు, వంతెనలు, కోటలు ఏవైనా కావచ్చు, సివిల్ ఇంజనీరింగ్ పద్ధతుల్లోనే వాటి నిర్మాణాలు జరిగాయని, భూమిపైన ఉన్న అన్ని నిర్మాణాలు సివిల్ ఇంజనీరింగ్ సాంకేతికతతోనే నిర్మించబడ్డాయన్నారు. అడ్వాన్స్‌డ్ కన్స్‌ట్రక్షన్ మెటీరియల్స్ ఇన్ కాంక్రీట్ టెక్నాలజి అండ్ ఇట్స్ అప్లికేషన్స్‌పై గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ అఫ్ ఇండియాలో బుధవారం జరిగిన వర్క్ షాప్‌లో డైరెక్టర్ జి. రామేశ్వర్ రావు ప్రధాన వక్తగా ప్రసంగించారు. ఆధునిక కాలంలో విభిన్నమైన తరహాలో నిర్మాణాలు జరుగుతున్నాయని, ఆకాశాన్ని అంటే పెద్ద పెద్ద టవర్స్ నుండి వందల అడుగుల ఎత్తులో నిర్మిస్తున్న బ్రిడ్జ్ నిర్మాణాల వరకు నిర్మాణాల శైలి మారిందని తెలిపారు. నిర్మాణాల్లో ఉపయోగిస్తున్న స్టీల్, సిమెంట్‌తో పాటుగా ఇందులో ఉపయోగిస్తున్న ప్రతి మెటీరియల్ శాస్త్ర సాంకేతిక పరిశోధనా విధానంతో రూపొందించడంతో అద్భుతమైన నిర్మాణాల ఆవిష్కరణలు జరుగుతున్నాయని చెప్పారు. ఆకాశం, నీరు, నిప్పు, గాలి, భూమి, మానవాళికి ప్రకృతి ప్రసాదించిన వరాలు అన్నారు. వీటిని మనం కాపాడుతూ, భవిష్యత్ తరాలకు బహుమతిగా అందించాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. కాంక్రీట్ నిర్మాణాలు ప్రకృతికి విద్రోహంగా ఉండకూడదన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న దేవశ్రీ ఇస్పాత్ లిమిటెడ్ టెక్నికల్ మార్కెటింగ్ హెడ్ రాజీవ్ సింగ్ బిస్త్ మాట్లాడుతూ భారీ కాంక్రీట్ నిర్మాణాలతో ప్రకృతికి ఎలాంటి హానీ కలగకుండా ఆయా నిర్మాణాలు మరింత ఎక్కువ కాలం నిలబడేలా ప్రస్తుత నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. బిల్డింగ్ మెటీరియల్‌లో నూతన శాస్త్ర సాంకేతిక విధానాలు వస్తున్నాయన్నారు. ప్రతి నిర్మాణం ఎక్కువకాలం మన్నిక ఉండేలాగా నిర్మాణ శైలిలో మార్పులను చేస్తున్నామని వివరించారు. ఎస్.కె. శర్మ ఇంజనీరింగ్ కంపెనీలో పనిచేస్తున్న సి.హెచ్. సంతోష్ కుమార్ మాట్లాడుతూ ఒకసారి వాడిన మెటీరియల్ రి సైకిల్ చేసే విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో సివిల్ అండ్ ట్రాన్స్ పోర్టేషన్ ఫ్యాకల్టీ హెడ్ డాక్టర్ డి. ఆదినారాయణ, సి.హెచ్. తిలక్, ఎల్. శ్వేత, నగరంలోని పలు ఇంజనీరింగ్ కళాశాలలకు చెందిన సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులు, పలు సంస్థల్లో పనిచేస్తున్న ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## కేసుల పరిష్కారానికి కృషి : జిల్లా జడ్జి

**ప్రజాపక్షం / వనపర్తి టౌన్ :** జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేందుకు పోలీసులు కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంఆర్ . సునీత సూచించారు. వనపర్తిలోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కోర్టు కార్యాలయంలో వనపర్తి జిల్లా ఎస్పీ కె. రక్షిత మూర్తి తో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ ఈ నెల 8న జాతీయ లోక్ అదాలత్‌ను జిల్లాలోని అన్ని కోర్టులలో నిర్వహించనున్నట్లు తెలిపారు. లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడం వల్ల కోర్టు ఫీజులు, సమయం వృథా కావనున్నారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఈ నెల శనివారం 8వ తేదీన వనపర్తి జిల్లా కోర్టులో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం ఉన్నందున జాతీయ లోకాదలథ్ సామరస్య దోరణితో రాజీపడదగిన వివిధ కేసులపై న్యాయస్థానాల చుట్టూ తిరగకుండా కేసుల పరిష్కారం చేసుకోవాలని సూచించారు. రాజీ పడదగిన కేసుల్లో ఇరు వర్గాల వారిని పిలిపించి చిన్న చిన్న కేసులతో జీవితాలు నాశనం చేసుకోవద్దని ఒకే గ్రామంలో ఉండేవారు ఎప్పుడు కలిసి మెలిసి ఉండాలని , రాజీ మార్గం రాజమార్గం అని వారికి అర్థమయ్యే విధంగా తెలపాలని జిల్లా పోలీస్ సిబ్బందికి సూచించారు. అదే విధంగా న్యాయ శాఖ అధికారులతో సమన్వయం ఏర్పర్చుకొని విధులు నిర్వహించాలని సూచించారు. జాతీయ లోకాదలత్ సాధ్యమైనంత వరకు ఎక్కువ మొత్తంలో కేసులు రాజీపడే విధంగా చూడాలన్నారు. ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి రాజీ కాదక్కా కేసులలో రాజీ శాతం పెంచాలని సూచించారు.

## స్కూల్ కరస్పాండెంట్ రాజేందర్ హత్యాయత్నం కేసులో నిందితులు అరెస్టు

### భార్య, వ్యాయామ ఉపాధ్యాయుడే అసలు నిందితులు





**ప్రజాపక్షం / పెబ్బేరు :** పెబ్బేరు మున్సిపల్ కేంద్రంలో సంచలనం రేపిన మాంటిసోరి స్కూల్ కరస్పాండెంట్ రాజేందర్ గౌడ్ హత్యాయత్నం కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేసినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. సురగౌని శిరీష ఫిర్యాదుతో క్రైమ్ నంబర్ (146/2024) కేసు నమోదు చేసి సిఆర్పిసి 307 ప్రకారం పోలీసులు విచారణ చేసి నిందితులు కంచిరావుపల్లి గ్రామానికి చెందిన పాలెం మహేష్ యాదవ్ మాంటిసోరి పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పని చేస్తూ రాజేందర్ భార్య ప్రత్యూష అలియాస్ అంబిక ఒక పథకం ప్రకారం హత్యాయత్నం చేశారని, విచారణలో తేలిందన్నారు. కేవలం మూడు రోజుల్లోనే కేసును చేదించటంతో పోలీసులను పలువురు అభినందిస్తున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ హరిప్రసాద్ రెడ్డి తెలిపారు.

## 19వరకు బడిబాట

### డిఇఓ గోవిందరాజులు

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** ఈనెల12న పాఠశాలలు ప్రారంభంకాగానే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు పంపిణీ చేసేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులోభాగంగా బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలోని టెస్టుబుక్స్ గోదాంనుండి జిల్లాలోని వివిధ మండలాలకు పుస్తకాలపంపిణీ కార్యక్రమాన్ని డిఇఓ గోవిందరాజులు ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకోసం 1వతరగతి నుండి 10వతరగతి వరకు పాఠ్యపుస్తకాలతోపాటు నోటుపుస్తకాలు, బోధన, ఎక్స్ట్రా కరికులం పుస్తకాలను మండలకేంద్రంలోని ఎంఈవో కార్యాలయాలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా డిఇఓ గోవిందరాజులు మాట్లాడుతూ రెండురోజుల్లో పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు అన్ని మండలాల కేంద్రాలకు చేరుతాయని, పాఠశాలలు తెరవగానే విద్యార్థులకు పంపిణీచేసేలా ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు పుస్తకాలను ముందుగానే పంపిణీచేయాలని తెలిపారు. ఈనెల6వతేదినుంచి బడిబాటప్రారంభం కానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా టెస్టుబుక్స్‌మేనేజర్ కుర్మయ్య, పర్యవేక్షకులు నాగేందర్, టీచర్ వెంకటేశ్వరశెట్టి, సిబ్బంది సునీల్, సాయి ఉన్నారు.

## మొక్కలునాటుదాం పర్యవరణాన్ని రక్షించుకుందాం




**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** తెలంగాణరాష్ట్ర న్యాయసేవ అధికారసంస్థ ఆదేశానుసారం నాగర్‌కర్నూల్ జిల్లా న్యాయసేవ అధికారసంస్థ ఆధ్వర్యంలో జిల్లాకోర్టు ప్రాంగణంలో ప్రపంచపర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా ప్రధానన్యాయమూర్తి డి.రాజేష్‌బాబు మొక్కలను నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న మానవాళికి అనుగుణంగా పర్యావరణాన్ని రక్షించుకోవడం ప్రతిపౌరుని బాధ్యత అని తెలిపారు. పౌరులందరూ పర్యావరణాన్ని పరిరక్షించడం తమ బాధ్యతగా భావించి స్వచ్ఛందంగా మొక్కలనునాటి అడవుల పరిరక్షణకు సంసిద్ధంకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లాన్యాయసేవా అధికారసంస్థ సెక్రటరి సబిత, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్‌జడ్జి మౌనిక, పర్వత్‌రెడ్డి, శ్రీదేవి, శ్రీనివాస్‌రెడ్డి, దేవిక, కేశవరెడ్డి, న్యాయవాదులు, పోలీసులు, కోర్టుసిబ్బంది పాల్గొన్నారు.

# ఏడుగురు ఎమ్మెల్యేలు ఉన్నా కాంగ్రెస్‌కు తప్పని ఓటమి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** కాంగ్రెస్ పార్టీకి చెందిన ఏడుగురు ఎమ్మెల్యేలు సీఎం రేవంత్ రెడ్డి సొంత జిల్లా ఎనిమిది పర్యాయాలు సీఎం పర్యటన వెరసి మహబూబ్‌నగర్ పార్లమెంటు నియోజకవర్గం కాంగ్రెస్ కంచుకోటను బిజెపి బద్దలు కొట్టింది. కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు సులువు అనుకున్న పార్టీ శ్రేణులు ఫలితం చూసి ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. ఈ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఇందులో మహబూబ్‌నగర్, దేవరకద్ర, మక్తల్, నారాయణపేట, కొడంగల్, షాద్‌నగర్, జడ్చర్ల నియోజకవర్గాలు ఉన్నా ఇక్కడ అందరూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. ఇందులో కొడంగల్ నియోజకవర్గం నుంచి గెలిచిన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి గా బాధ్యతలు చేపట్టారు. ఈ పార్లమెంటు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి బలం ఉండడంతో ఎంపీ అభ్యర్థి గా పోటీ చేస్తున్న వంశీ చంద్ రెడ్డి గెలుపు సునాయాసంగా ఉంటుందని అంద రూ భావించారు. కానీ ఏ పార్లమెంటు నియోజకవర్గంలో ఏ క్యాడర్ లేకున్నా బిజెపి అభ్యర్థిగా డీకే అరుణ బరిలోకి రావడం నియోజకవర్గంపై పట్టు బిగించడంతో సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి వెళ్లింది. ఇక్కడి బిజెపి గెలిస్తే తన పరువు పోతుందనే ఉద్దేశంతో ఈ పార్లమెంటు నియోజకవర్గంలో ఎనిమిది సార్లు ఎన్నికల ప్రచారం చేపట్టారు. కాంగ్రెస్ అభ్యర్థి ఓటమి చెందుతారని పలు సర్వేలు వెల్లడించడంతో సీఎం దృష్టి అంతా ఈ నియోజకవర్గం పైనే పెట్టారు. ప్రచారంలో డీకే అరుణను టార్గెట్ చేసి మాట్లాడం. మహిళ అని చూడకూండా విమర్శలు చేయడంతో సీఎం పై కొంత అసహనం పెరిగింది. మహిళ అని చూడకుండా పండపెట్టి తొక్కుతా అని డీకే అరుణను అనడం జిల్లాలో వివాస్పదం అయింది. ఈ మా టనే అరుణ ప్రచారంలో బాగా వాడుకుంది. మహిళపై సీఎం చేసిన వ్యాఖ్యలు కూడా కొంత మైనస్‌గా మారినట్లు పార్టీ శ్రేణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

కాంగ్రెస్ విమర్శలను తిప్పికోడుతూ ప్రచారంలో దూసుకుపోయిన అరుణకు నేడు విజయం వరించింది. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో నారాయణపేట, మక్తల్, దేవరకద్ర, మహబూబ్‌నగర్‌లో బిజెపి అధిక్యం ప్రదర్శించగా, జడ్చర్ల, షాద్‌నగర్, కొడంగల్‌లో మాత్రం కాంగ్రెస్ పార్టీ మెజార్టీ సాధించింది. సీఎం సొంత నియోజకవర్గం కొడంగల్‌లో ఆశించిన మెజార్టీ రాకపోవడం కూడా కాంగ్రెస్ అభ్యర్థి ఓటమికి కారణమైంది. నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మంచి మెజార్టీ రావడంతో అరుణ విజయానికి బాటలు పడ్డాయి. నారాయణపేట నియోజకవర్గం ఆమె పుట్టిన గడ్డ కావడం మక్తల్ ఆమె పెరిగిన ప్రాంతం కావడం గతంలో మక్తల్ ఎమ్మెల్యే గా ఆమె తండ్రి చిట్టెం నర్సిరెడ్డి చేసిన సేవలు ప్రస్తుత ఎన్నికల్లో అరుణకు కలిసివచ్చింది. ముఖ్యంగా కాంగ్రెస్ ఎమ్మెల్యేల మాటలు ప్రజలు నమ్మలేదని తెలుస్తోంది. ఏడుగురు ఎమ్మెల్యేలు ఉన్నా తమ పార్టీ అభ్యర్థిని గెలిపించుకోలేక పోయారనే విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఈ ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సక్రమంగా క్యాడర్ లేని బిజెపి గెలుపొందడంతో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆశ్చర్యానికి గురవుతున్నారు. క్యాడర్ లేకున్నా మోడీ చరిష్మాతో ప్రచారంలో ఒంటరిగా పోరు చేసి నేడు పార్లమెంటు సభ్యురాలిగా డీకే అరుణ ఎన్నిక కావడం పార్టీ శ్రేణుల్లో జోష్ నింపింది. ఒకవైపు బీఆర్ఎస్ గట్టి పోటి ఇవ్వకపోవడం కూడా బిజెపికి కలిసి వచ్చింది. కొన్ని నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ క్యాడర్ చివరి నిమిషంలో బిజెపి వేపు మళ్లిందనే మాటలు కూడా వినిపిస్తున్నాయి.

## ఫిరాయింపు ఎమ్మెల్యేలపై కేసు విచారణ 10వ తేదీకి వాయిదా

### ఫిర్యాదుపై ఏం చేశారో తెలియజేయాలని రాష్ట్రానికి ఆదేశం

### స్పీకర్ కార్యాలయం ద్వారా వివరాలు తెలుసుకుని చెప్పాలని కోరిన హైకోర్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** టిఆర్ఎస్ ఎమ్మెల్యేలుగా గెలుపొంది కాంగ్రెస్ పార్టీలో చేరిన ముగ్గురిపై పార్టీ ఫిరాయింపులు చట్టం కింద చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు తెలియజేయాలని రాష్ట్రానికి హైకోర్టు ఆదేశించింది. స్పీకర్ ఆఫీస్ ద్వారా వివరాలు తెలుసుకుని చెప్పాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణ ఈ నెల పదో తేదీకి వాయిదా వేస్తూ జస్టిస్ వి విజయసేనరెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ ఫిరాయించిన ముగ్గురు ఎమ్మెల్యేలపై స్పీకర్ అనర్హత వేసేలా ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, కూన పాండు వివేకానంద వేరువేరుగా దాఖలు చేశారు. స్పీకర్ కార్యాలయం నుంచి తగిన సూచనలను పొందాలని అడ్వకేట్ జనరల్‌ను న్యాయమూర్తి ఆదేశించారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, కొత్తగూడెం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి 2023లో జరిగిన ఎన్నికల్లో టిఆర్ఎస్ నుంచి గెలుపొందారు. అసెంబ్లీ ఎన్నికలు తర్వాత కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించారు. వారిపై అనర్హత వేటు వేయాలన్న పిటిషన్లు అసెంబ్లీ స్పీకర్ ముందు పెండింగ్‌లో ఉన్నాయి. గత విచారణ విచారణ సమయంలో హైకోర్దు, వారిపై అనార్హత వేటు వేయాలన్న పిటీషన్లను ప్రభుత్వ న్యాయవాది ద్వారా స్పీకర్ కార్యాలయానికి అందజేయాలని ఆదేశించింది.



## ఇక పాలమూరు అభివృద్ధిపై దృష్టి

### ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** ఎన్నికలు ముగిశాయి ఇక పాలమూరు అభివృద్ధి పైనే మా దృష్టి ఉంటుంది అని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో స్థానిక నాయకులతో కలిసి ఆయన పత్రికా సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ విజయం కోసం బూత్ స్థాయి కార్యకర్త నుంచి రాష్ట్ర స్థాయి నాయకులు వరకు అవిశ్రాంతిగా కృషి చేశారని వారందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను అని ఆయన చెప్పారు. మహబూబ్ నగర్ ప్రజలు డీకే అరుణ మహబూబ్ నగర్ పార్లమెంటు అభ్యర్థిగా గెలిపించారని ఆయన చెప్పారు. మహబూబ్ నగర్ పార్లమెంటు అభ్యర్థిగా విజయం సాధించిన డీకే అరుణ హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను అని అన్నారు. 10 యేండ్ల బిఆర్ఎస్ పాలనలో 100 యేండ్ల విధ్వంసం జరిగింది అని, అది విద్య రంగమే కానీ, వైద్య రంగమే కానీ, ఆర్థిక వ్యవస్థనే కానీ అది ఇది అని కాదు అన్ని వ్యవస్థలు సర్వనాశనం చేశారని ఆయన మండిపడ్డారు. గత రెండు మూడు నెలల నుంచి ఎన్నికల కోడ్ వల్ల అభివృద్ధి పనులు ఆగిపోయాయని, ఇక పైన అభివృద్ధి కోసం పని చేస్తామని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహబూబ్ నగర్ అభివృద్ధి చేయాలని కంకణం కట్టుకున్నారని, ఆరోగ్యకరమైన పోటీ వాతావరణంలో డీకే అరుణ కేంద్రం నుంచి అధిక నిధులు తేడాలని, డీకే అరుణ పాలమూరు అభివృద్ధి పైన గురుతర మైన బాధ్యత ఉందని ఆయన స్పష్టం చేశారు. మహబూబ్ నగర్ ఎమ్మెల్యేలంతా పాలమూరు అభివృద్ధి కోరే వారిమే అని, పాలమూరు అభివృద్ధి విషయంలో ఎంపీ పూర్తి స్థాయిలో అన్ని విధాలా సహకరిస్తామని, మాకు ఎలాంటి భేషజాలు లేవని కేవలం పాలమూరు అభివృద్ధి మాత్రమే మాకు ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, ఎస్.పి వెంకటేష్, సత్తూరు చంద్ర కుమార్ గౌడ్, ఫయీమ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖద్రీ, సిజె బెనహర్, రాములు యాదవ్, మల్లు నర్సింహ్మా రెడ్డి, కిషన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## పకడ్బందీగా గ్రూప్ - 1 ప్రిలిమ్స్ పరీక్ష

**ప్రజాపక్షం/మహబూబ్ నగర్ ప్రతినిధి :** స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరిండెంట్లు, అబ్జర్వర్ లు , రూట్ అధికారులకు శిక్షణ ఈ నెల 9న జరగనున్న గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ సూచించారు. అభ్యర్థుల భవిష్యత్తు దృష్ట్యా చిన్న తప్పుకు ఆస్కారం లేకుండా జాగ్రత్తగా వ్యవహరిం చాలని పేర్కొన్నారు. బుధవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయం సమావేశ మందిరం లో గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్ష కేంద్రాల చీఫ్ సూచరిండెంట్లు, అబ్జర్వర్లకు, రూట్ అధకారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమం కు జ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, అదనపు ఎస్.పి. రాములు తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మాట్లాడుతూ చీఫ్ సూపరిండెంట్లు, అబ్జర్వర్లు టీజీపీఎస్సీ నిబంధన లను క్షుణ్ణంగా తెలుసుకోవాలని పేర్కొన్నారు. ఆ మేరకు జాగ్రత్తగా గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించాలని సూచించారు. ఎక్కడ ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాత కేంద్రాల్లోకి అనుమతించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రేజియనల్ కో ఆర్డినేటర్ లు, నాగరాజు, సుజీవన్, పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరిండెంట్లు అబ్జర్వర్లు, బయో మెట్రిక్ ఇన్విజి లెటర్ లు పాల్గొన్నారు.

## ప్రైవేట్ విద్యా సంస్థలపై చర్యలు

**ప్రజాపక్షం / వనపర్తి టౌన్ :** ప్రభుత్వ నిబంధనలను ఉల్లంగిస్తూ ప్రైవేట్ పాఠశాలలు, సిబిఎస్ఈ సంస్థల్లో యూనిఫాం , షూ, బుక్స్ , స్టేషనరీ అమ్ముతున్న పాఠశాలపై చర్యలు తీసుకోవాలని పిడిఎస్‌యూ ఆధ్వర్యంలో డిఈఓ ఆఫీస్ సూపరిటెండెంట్ కి వినతి పత్రాన్ని అందజేశారు. పాఠశాల తనిఖీలు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు గోవర్ధన్ , నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత

**ప్రజాపక్షం / వనపర్తి టౌన్ :** మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉందని వనపర్తి రూరల్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ జలంధర్ రెడ్డి అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని రూరల్ డెవలప్మెంట్ సోసైటీ అధ్యక్షురాలు చిన్నమ్మ థామస్ సబ్ ఇన్‌స్పెక్టర్ జలంధర్ రెడ్డి పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలను నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. పర్యావరణ సమతుల్యతను కాపాడాల్సిన బాధ్యత అందరిపైన ఉందని, ప్రతి ఒక్కరు మొక్కలు నాటడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించేందుకు బాధ్యత తీసుకోవాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో రూరల్ డెవలప్మెంట్ సోసైటీ అధ్యక్షురాలు చిన్నమ్మ థామస్ , సబ్ ఇన్ స్పెక్టర్ జలంధర్ రెడ్డి, పోలీస్ స్టేషన్ సిబ్బంది, సఖి సెంటర్ సిఏ కవిత, ఇండియా లిటరసి ప్రాజెక్ట్ సిబ్బంది శ్రీలక్ష్మి , కైలాస్ సత్యార్థి ప్రాజెక్ట్ సిబ్బంది శ్రీలక్ష్మి , కైలాస్ సత్యార్థి చిల్డ్రన్స్ ఫౌండేషన్ సిబ్బంది అల్విన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం
మహానగరి
మేడ్చల్ మల్కాజ్‌గిరి — వికారాబాద్
కరీంనగర్ | గురువారం | 06 జూన్ 2024 | 11

## నాలుగు నియోజకవర్గంలోని వివిప్యాట్‌లు స్ట్రాంగ్ రూమ్‌కి..

ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి:పార్లమెంటు ఎన్నికల అనంతరం జిల్లా నాలుగు నియోజకవర్గాలకు సంబంధించిన వివి ప్యాట్‌లను స్థానిక తహశీల్దార్ కార్యాలయం స్ట్రాంగ్ రూమ్ నందు బద్రపర్చడం జరిగింది అని జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి అన్నారు. జిల్లా ఎస్పీ కోటిరెడ్డి తోయ కలిసి ఇవిఎంలను బద్రపరిచిన ఏఎంసి గోడౌన్ ,తహశీల్దార్ కార్యాలయ స్ట్రాంగ్ రూమ్ను పరిశీలించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పార్లమెంట్ ఎన్నికల కౌటింగ్ పూర్తి అయిన సందర్భంగా వికారాబాద్ ,కొడంగల్ , పరిగి , తాండూర్ , నియోజకవర్గాలకు సంబంధించిన ఎన్నికల నిర్వహణకు ఉపయోగించిన , ఈ వి ఎం స్ గోడౌన్ నందు బద్రపర్చడం జరిగిందన్నారు. సంబంధిత రిజిష్టర్‌లలో సంతకాలు చేశారు. నిరంతర సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉండాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జెడ్పీ సిఇఓ సుధీర్ ,ఆర్‌డిఓ వాసుచంద్ర , తహశీల్దార్ లక్ష్మీ నారాయణ ,ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కోర్టు ఆవరణలో మొక్కలునాటిన ప్రధాన న్యాయమూర్తి



ప్రజాపక్షం/చర్లపల్లి: పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ రెండు మొక్కలు నాటాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్,ప్రధాన న్యాయమూర్తి వి బాల భాస్కర్‌రావు అన్నారు. జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కుషాయిగూడ మేడ్చల్ జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా అదనపు న్యాయమూర్తులు రఘునాథ్‌రెడ్డి,వి విక్రమ్‌లు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కిరణ్‌కుమార్, అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఎస్ రవీందర్, అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ వి అరుణ్‌తేజ్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అమరేందర్‌రెడ్డి, న్యాయవాదులు, సభ్యులుతదితరులుపాల్గొన్నారు.

## నాటిన మొక్కలను బాధ్యతగా పెంచాలి

కొలను శ్రీనివాస్ రెడ్డి



ప్రజాపక్షం/ నిజాంపేట్ : మొక్కలను నాటి బాధ్యతగా పెంచాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలను శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని నిజాంపేట్‌లో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొలను శ్రీనివాస్ రెడ్డి, కార్యకర్తలతో కలిసి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం ప్రతిఒక్కరి బాధ్యత అన్నారు. ప్రతి మనిషి మొక్కను నాటి బాధ్యతతో పెంచాలని సూచించారు. పచ్చదనం, పర్యావరణాన్ని కాపాడుకున్నప్పుడే మానవ మనుగడ సాధ్యమని పేర్కొన్నారు. ప్రతి వ్యక్తి రెండు మొక్కలను నాటాలని, జీవన శైలిని మెరుగుపరిచే మార్పు ఎలాంటిదైనా మనతోనే మనతోనే మొదలవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు అల్లాడి మహేశ్, లింగాల గంగాధర్, ప్రభాకర్ రెడ్డి, బాలకృష్ణ, ప్రశాంత్ రెడ్డి, స్వర్ణ లక్ష్మన్, శివ నాగరాజు యాదవ్, మురళి చారి, కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.

## ఎపిలో టిడిపి విజయోత్సవం



ప్రజాపక్షం/చర్లపల్లి: ఆంధ్రప్రదేశ్‌లో టిడిపి,జనసేన,బిజెపి పార్టీ కూటమి విజయం సాధించి చంద్రబాబు నాల్గవ సారి ముఖ్యమంత్రి పదవిని స్వీకరిస్తున్న సందర్భంగా ఏఎస్ రావు నగర్‌లో తెలుగు తమ్ముళ్లు సంబరాలు చేసుకున్నారు.మల్కాజ్‌గిరి పార్లమెంటు తెలుగుయువత అధ్యక్షులు సాయి నాగార్జున ఆధ్వర్యంలో రాధిక చౌరస్తాలో టిడిపి,బిజెపి నాయకులు బాణా సంచాలు కాల్చి సంబరాలు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు టిజికె మూర్తి,ప్రసాద్,హేమంత్‌గౌడ్,బిజెపి నాయకులు శరత్ చంద్ర,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటిన అధికారులు



ప్రజాపక్షం/దుండిగల్ : దుండిగల్ మున్సిపల్ కార్యాలయం ఓల్డ్ ఏజ్ హోమ్ లో వరల్డ్ ఎన్విరాన్మెంట్ డే సందర్భంగా జిల్లా వెల్ఫేర్ ఆఫీసర్ కృష్ణ రెడ్డి మొక్కలు నాటరు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.సత్య నారాయణ రావు, మున్సిపల్ ఇంజనీర్ పి.ప్రవీణ్ కుమార్ ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ పి.సాత్విక్, అంగన్‌వాడీ సూపర్వైజర్ స్పందన అంగన్వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి

ప్రజాపక్షం/పేట్ బషీరాబాద్: నిర్మాణ దశలో ఉన్న బహుళ అంతస్తుల



భవనం వద్ద పడుకొని ఉన్న వా చ్మెన్పై సిమెంట్ కాంక్రీట్ వాహనం వెనకాల టైర్ల కింద నలిగి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ రాంనారాయణ తెలిపిన వి వరాల ప్రకారం బీహర్ రాష్ట్రానికి చెందిన హరిరాం సింగ్ యాదవ్ (40) గత వారం రోజుల కిందట కొంపల్లిలోని మై స్పేస్ నిర్మాణ సంస్థ చేపట్టిన బహుళ అపార్ట్మెంట్ నిర్మాణంలో వాచ్మెన్గా చేరాడు. మంగళవారం రాత్రి నిర్మాణానికి కావాల్సిన రెడ్మిక్స్ బోరింగ్ వాహనం డ్రైవర్ అక్కడ పడుకున్న హరిరాంసింగ్ను గుర్తించకుండా నిర్లక్ష్యంగా వెనకాలకు తీసుకురావడంతో వెనకాల టైర్ల కింద నలిగిపోయి. అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహన్ని స్వాధీనం చేసుకొని గాంధీవైద్యశాలకు తరలించారు. మృతుడి బంధువులు ఇచ్చినఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పెద్దమ్మ తల్లి ఆలయంలో అన్నదానం



ప్రజాపక్షం/శామీర్‌పేట : తూం కుంట మున్సిపాలిటి లోని ఉప్పర్‌పల్లి పెద్దమ్మ తల్లి ఆలయంలో బుధవారం పురస్కరించుకుని భ క్తులకు అన్నదానం ఘనంగా ని ర్వహించారు. కీర్తి శేషులు సీత మ్మ జ్ఞాపకార్థం నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు పెద్దమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకున్నారు. పెద్దమ్మతల్లి సేవా సమితి సభ్యులు, అన్నదాత నాగేశ్వర్‌రావు, రమేష్, దేవి, విజయ్, సితార, భక్తులు పాల్గొన్నారు.

## నీట్‌లో 548 మార్కులు: ఆశీర్వదించిన స్పీకర్



ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి : వికారాబాద్ మండల పరిధిలోని పిలారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు మల్లేశం కుతురు పి.లెనిన ఇంటర్ బిపిసిహైదరాబాద్ లోని మదవపూర్ ప్రగతి కళాశాలలో చదివింది, నీట్ ఫలితల్లో 548 మార్కులు సాధించిన సందర్భంగా తెలంగాణ స్పీకర్ ప్రసాద్‌కుమార్ సన్మానించి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంక పైసదువుల్లో రణించాలని సూచించారు.

# ఫలించిన ఇసి వ్యూహం

కేంద్రాలకు సరిపడా కౌంటింగ్ టేబుల్స్ ఏర్పాటు

అభ్యర్థులు, పార్టీల నుండి రాని ఫిర్యాదులు

గంట గంటకు ఫలితాల వెల్లడితో ఉత్కంఠకు తెర

ప్రజాపక్షం / హైదరాబాద్ : రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ సజావుగా ముగిసింది. ఏ ఒక్క రాజకీయ పార్టీగానీ, అభ్యర్థి గానీ ఎలాంటి ఫిర్యాదులు ఇవ్వలేదంటే అది ఈసీ తీసుకున్న చొరవనే అని వేరే చెప్పనక్కర లేదు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చింది మొదలు పోలింగ్, కౌంటింగ్ వరకు అన్ని జాగ్రత్తలు తీసుకుంది. ఏపి తరహాలో గొడవలు కాకుండా జిల్లాల వారీగా పోలీస్ వ్యవస్థను అప్రమత్తం చేస్తూ గట్టి నిఘా ఉంచింది. కౌంటింగ్ సమయంలోనూ గంట గంటకు ఆయా రౌండ్ల వారీగా సమాచారం తెప్పించుకుంటూ ఎన్నికల కమిషన్ వెబ్ పోర్టల్‌లో ఉంచింది. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలోనే ఎక్కువ ఫిర్యాదులు వచ్చేవి. పోలింగ్ విషయంలోగానీ, ఎన్నికల ప్రచారం అంశంలో గానీ, లేదా ఫలితాల వెల్లడిని నిలిపివేయాలని గానీ ఆయా పార్టీలు ఈసిని ఆశ్రయించేవి. అదంతా ఒకప్పటి మాటగా నిలిచేలా అన్ని చర్యలు తీసుకోవడంతో ఫలితాల వెల్లడి సజావుగా జరిగినట్లు చెబుతున్నారు. మహబూబ్‌నగర్, భువనగిరి, మెదక్ లోక్‌సభ స్థానాల కౌంటింగ్ ప్రక్రియ కాస్త ఆలస్యంగా ఆరంభమయినా ఫలితాల వెల్లడి వరకు ఎవరి నుండి అభ్యంతరాలు వ్యక్తం కాకపోవడం విశేషం.

**నియోజక వర్గాల వారీగా కౌంటింగ్ టేంటింగ్ ఇలా...**

పోలింగ్ కేంద్రాల వారీగా కౌంటింగ్ టేంటింగ్ ఏర్పాటు చేయడం ద్వారా ఫలితాల వెల్లడికి సమస్యలు రాకుండా ఈసీ చర్యలు తీసుకుంది. అనుకున్న సమయంలోనే ఫలితాలు వెల్లడయ్యాయి. ఉదా.. ఆదిలాబాద్ (ఎస్‌టి) ఎంపి నియోజక వర్గంలోని సిర్పూర్‌లో 320 పోలింగ్ కేంద్రాలకు గాను 14 కౌంటింగ్ టేంటింగ్ ఏర్పాటు చేసింది. ఆసిఫాబాద్‌కు 356 పోలింగ్ కేంద్రాలకు గాను 16 కౌంటింగ్ టేబుల్స్ ఏర్పాటు చేసింది. అదే కరీంనగర్ ఎంపి స్థానాన్ని తీసుకుంటే కరీంనగర్‌లో 395 పోలింగ్ స్టేషన్లకు గాను 18 కౌంటింగ్ టేంటింగ్ ఏర్పాటు చేశారు. అటు నిజామాబాద్ ఎంపి స్థానాన్ని తీసుకుంటే ఆర్మూర్‌లో 217 పోలింగ్ స్టేషన్లకు గాను 18 కౌంటింగ్ టేంటింగ్, అలాగే ఇదే విధంగా నిజామాబాద్ అర్బన్ నుండి 289 పోలింగ్ స్టేషన్లకు గాను 20 కౌంటింగ్ టేంటింగ్ ఏర్పాటు చేశారు. ఇటు మెదక్ ఎంపి స్థానాన్ని తీసుకుంటే సంగారెడ్డిలోని 281 పోలింగ్ స్టేషన్లకు గాను 14 కౌంటింగ్ టేంటింగ్, పటాన్ చెరువులోని 411 పోలింగ్ స్టేషన్లకు గాను 18 కౌంటింగ్ టేంటింగ్, అదే గజ్వేల్‌లోని 322 పోలింగ్ కేంద్రాలకు గాను 15 కౌంటింగ్ టేంటింగ్ ఏర్పాటు చేయించారు. మేడ్చల్ మల్కాజిగిరి నియోజక వర్గం పరిధిలోని మేడ్చల్‌లోని 591 పోలింగ్ కేంద్రాలకుగాను 28కౌంటింగ్ టేంటింగ్, ఎల్ బినగర్ అసెంబ్లీ నియోజక వర్గ పరిధిలోని 571 పోలింగ్ స్టేషన్లకు గాను మరో 28 కౌంటింగ్ టేంటింగ్ ఏర్పాటు చేయించి ఫలితాల వెల్లడికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూశారు.

**ఈ సారి గ్రేటర్‌లో కాంగ్రెస్ బోణి..**

ఈ ఏడాదిలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జిహెచ్ఎంసీ పరిధిలో బిఆర్ఎస్ పార్టీ గెలుపొందిన విషయం తెలిసిందే. కాగా బిఆర్ఎస్ ఎంఎల్ఏ లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఉప ఎన్నిక అనివార్యం అయింది. ఈ క్రమంలో జరిగిన ఉప ఎన్నికలో ఈ సారి అధికార కాంగ్రెస్ పార్టీ నేత శ్రీ గణేశ్ విజయం సాధించారు. ప్రతి సారీ వివిధ పార్టీలు ఒకరిపై మరొకరు ఫిర్యాదు చేసుకునే వారు. ఈ సారి అలాంటి ఫిర్యాదులు అందకుండా ఎన్నికల కమిషన్ పక్కాగా చర్యలు తీసుకుని ఎన్నికల ఫలితాలను వెల్లడించడం విశేషం.

## భౌగోళికంగా ఆలోచించు.. ప్రాంతీయంగా పనిచేయ్




ప్రజాపక్షం/జగద్గిరిగుట్ట: పర్యావరణ పరిరక్షణకై ప్రపంచ దేశాల నినాదం. ప్రతి పౌరుడు తన శరీరం పట్ల ఏ విధమైన శ్రద్ధ తీసుకొని ప్రతి అవయవాన్ని ఆరోగ్యంగా ఉంచుకొని మనగలుగుతున్నాడో అదేవిధంగా తను నివాసముంటున్న గృహం పరిసరాలు, వీధులను, పరిశుభ్రంగా ఉంచుకున్నట్లయితే పర్యావరణానికి ఎంతో మేలు చేసిన వాడవుతాడు తను పీల్చేగాలి, త్రాగే నీరు, తినే ఆహారం ఒకటేమిటి అన్ని రకాలుగా పర్యావరణం కలుషితమై భూమిపై జీవనం గడపడం మనిషికి రాను రాను దుర్లభమవుతుంది. మరి దీనికి పరిష్కారమేమిటి అనేది ఆలోచించాలి. ఎందుకంటే మూల కారణం మనిషే కాబట్టి సహజంగా సంభవించే ప్రకృతి విపత్తులు, వరదలు భూకంపాలు, అగ్నిపర్వతాల పేలుళ్లు, అడవులను దహించే కార్చిచ్చు వలన సంభవించే కాలుష్యం కంటే మనిషి స్వార్థం వలన ప్రకృతి చాలా ఘోరంగా దెబ్బతింటుంది. మనిషి స్వార్థంతో ప్రకృతి వనరులను విచ్చలవిడిగా వినియోగించుకుంటూ, పర్యావరణానికి కాలుష్యాన్ని తెచ్చి పెడుతూ తన మనుగడే కాకుండా భవిష్యత్ తరాలు కూడా దుష్ప్రభావానికి గురయ్యేందుకు హేతువాగుచున్నాడు. భవిష్యత్ తరాల ఉనికికే ప్రమాదం ముంచుకొస్తుంది. నేటి పిల్లలు పర్యావరణ కాలుష్యం గురించి ప్రాథమిక స్థాయిలోనే తెలుసుకోవలసిన ఆవశ్యకత ఎంతో ఉంది. సమీపంలో చెట్లు నరికిన లేక గార్బేజిని సక్రమంగా తొలగించకపోయినా మున్సిపల్ అధికారులకు నివేదించండి. దీపావళి కాకుండా మరీ సందర్భం వచ్చిన టపాకాయలు కాలుస్తున్నాం. క్రికెట్ మ్యాచ్ గెలిచిన,పెళ్లి ఊరేగింపు కదిలిన, దసరా వచ్చిన టపాకాయలు కాల్చి ధని కాలుష్యం పెంచుతున్నాం. విపరీతమైన విషమ ధనుల వల్ల మన వీనులు వికలమైపోతున్నాయి. అనారోగ్యం కలుగుతుందని మానసిక ఒత్తిడి చికాకు చెవుడు హార్మోన్లపై ఒత్తిడి శారీరక మానసిక అనారోగ్యాలు కలిగే అవకాశం ఉంది. ఆరోగ్య రక్షణకై మధ్య మధ్య నిశ్శబ్దాలను, సుస్వర సంగీతాలను ఎంచుకోవాలి మానసిక ప్రశాంతత కోల్పోతే ఇంకా అనేక జబ్బులు వస్తాయి. మనం మునులం కాకపోయినా శబ్దాలు సృష్టించడంలో మన పాత్రను తగ్గించడం మంచిది. చెట్లు ప్రగతికి మెట్లు చెట్లను పెంచుదాం వాతావరణ కాలుష్యాన్ని తగ్గిద్దాం. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జగద్గిరిగుట్ట లాస్ట్ బస్ స్టాప్ నందు సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ మాజీ కౌన్సిలర్ కె.ఏసురత్నం, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాస్, ప్రజానాట్యమండలి నాయకులు ప్రవీణ్ , సీనియర్ సిటిజన్స్ రెడ్డప్ప, ధర్మయ్య భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు రవి ముసలయ్య సామ్యూల్ రాములు పాల్గొన్నారు.

## మహిళపై యువకుడు హత్యాయత్నం





ప్రజాపక్షం/దుండిగల్: గండిమైసమ్మ చౌరస్తాలో దారుణం చోటుచేసుకుంది. గండిమైసమ్మ లోని జి9 గల్లీలో ఓ హాస్టల్లో పని మనిషిగా పనిచేస్తున్న మహిళపై ఓ యువకుడు కత్తితో దాడిచేసి గాయపరిచిన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలలోకి వెళితే రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన నిషాభాటియా (38), చింతల్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఉంటుంది. గండిమైసమ్మ చౌరస్తాలో ఓ హాస్టల్ వంట మనిషిగా పనిచేస్తున్న ఆమె బుధవారం ఉదయం హాస్టల్‌లో విధులు నిర్వహిస్తుండగా మెదక్ జిల్లాకు చెందిన డిషాన్ ఖాన్ కత్తితో దాడి చేసి గాయాపరచడంతో అక్కడికి అక్కడే కుప్పకూలింది. సమాచారం అందుకున్న దుండిగల్ పోలీస్ లు సంఘటన స్థలానికి వెళ్లి మహిళను చికిత్స నిమితం సూరారంలోని ఓ మాల్లారెడ్డి ఆసుపత్రికి తరలించారు. మహిళ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. నింధితుడు డిషాన్ ఖాన్ గతంలో బాధిత మహిళతోపాటు సమీపంలోని ఓ హాస్టల్‌లో వంట మనిషిగా పనిచేసినట్లు సమచారం నిందితుడు ఓ పథకం ప్రకారం దాడిచేసి తను ఆత్మహత్య ప్రయత్నం చేసినట్లు తెలిసింది. చికిత్స నిమిత్తం అతనిని దుండిగల్ లోని అరుంధతి ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. కేసు నమోదు చేసుకున్న పోలీస్ లు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## మన్‌భూమ్ యాజమాన్యం మొండి వైఖరి వీడాలి

ప్రజాపక్షం/ నిజాంపేట్ :మన్‌భూమ్ యాజమాన్యం కష్టం చేయించుకుని డబ్బులు ఇవ్వకుండా మొండి వైఖరి అవలంబించడం ఎంతవరకు సమంజసమని కుత్బుల్లాపూర్ నియోజక వర్గం సిపిఐ కార్యదర్శి ఉమామహేశ్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజులరామారం డివిజన్ మహదేవపురం కాలనీలోని పరికి చెరువుకు ఆనుకుని ఎఫ్‌టిఎల్‌లో నిర్మిస్తున్న మన్‌భూమ్ ప్రాజెక్టులో భవన నిర్మాణపు పనులను చేయించుకుని డబ్బులు ఇవ్వకుండా చేతులేత్తాశారు. దీంతో సెంట్రింగ్ కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు మన్‌భూమ్ ప్రాజెక్టు ముందు భైటాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిపిఐ నియోజకవర్గం కార్యదర్శి ఉమామహేశ్ పార్టీ తరపున కార్మికులకు మద్దతుగా ఆందోళన చేశారు. కార్మికులకు న్యాయం చేసే వరకు ఆందోళనలను ఉధృతం చేస్తామని పెద్దఎత్తున ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఉమామహేశ్ మాట్లాడుతూ సెంట్రింగ్ పనులను చేయించుకుని డబ్బులను ఇవ్వకుండా కార్మికులను ఇబ్బందులకు గురిచేయడం పై మండిపడ్డారు. అసలే పరికి చెరువు ఎఫ్‌టిఎల్‌లో ప్రాజెక్టుని నిర్మిస్తూ కార్మికుల



కష్టాలను గుర్తించకుండా డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. తక్షణమే కార్మికులకు డబ్బులను చెల్లించాలని లేని పక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ మం<None>దల కోశాధికారి సదానంద్, భవన నిర్మాణ కార్మికులు చిన్నారావు, కార్మికులు పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ రవాణాకు నకిలీ పర్మిషన్లు



ప్రజాపక్షం / కొడంగల్ : అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా మరమత్తులు జరుగుతున్న నేపథ్యంలో అక్రమ వ్యాపారులు ఇదే అనుసుగా తీసుకుని దోంగ పరిమిషన్‌లు సృష్టించి రాత్రి అనక పగలు అనక ఇష్టానుసారంగా ఇసుక రవాణా చేస్తుండటంపై పోలీసులు దృష్టి సారించి వారిపై కేసులు నమోదు చేస్తు ట్రాక్టర్‌లను సీజ్ చేయడం జరుగుతుందని కొడంగల్ ఎస్ఐ భరత్‌రెడ్డి తెలిపారు. కొడంగల్ పట్టణంలో జరుగుతున్న ప్రభుత్వ పాఠశాలల పేరుతో నకిలి పత్రాలను సృష్టిస్తు నెంబర్ లేని ట్రాక్టర్‌లలో తాండూర్, యాలాల్ మండల కేంద్రాల నుంచి కొడంగల్ పట్టణానికి అక్రమంగా ఇసుకను రవాణ చేస్తున్నారు. దీనిపై ఆరా తీస్తే ప్రభుత్వ పాఠశాలలకు తరలిస్తున్నామని వ్యాపారులు బెదిరింపులకు గురి చేస్తు రాజకీయ నాయకులను, కొంత మంది అధికారులను అడ్డం పెట్టుకుని విచ్చలవిడిగా వ్యాపారం చేస్తున్నారని పలువురు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. అక్రమ వ్యాపారులు ఏకంగా పోలీసులను కూడా మచ్చిక చేసుకున్నమని ఎవ్వరు ఏమి చేయలేరని ఏవరైన అడ్డుపడితే అంతుచూస్తామంటు బెదిరింపులు కూడా చేస్తున్నారని పట్టణవాసులు వాపోతున్నారు. దీనిపై స్పందించిన పోలీసులు నిఘా పెట్టి అక్రమంగా సాగుతున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకుని స్టేషన్‌కు తరలించి కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ భరత్‌రెడ్డి తెలిపారు. ఎవరైన పోలీసులపై తప్పుడు అనుచిత వాఖ్యాలు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## దిగుబడి నష్టపోయిన రైతులకు పరిహారం

ఎడిఎ శంకర్‌నాయక్ ఆదేశం

ప్రజాపక్షం / కొడంగల్ : అరుణసీడ్స్ వరి విత్తనాలు వాడటం వల్ల పంట దిగుబడి రాలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తు గత రెండు రోజులుగా కొడంగల్‌లో రైతులు ఆందోళన చేస్తున్న విషయంపై జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోపాల్ బుధవారం పట్టణంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో రైతులతో ఏడిఏ శంకర్ నాయక్ నేతృత్వంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి వివరాలను అడిగి తెలుసుకున్నారు. విత్తనాలు విక్రయించిన షాపు యజమాని, కంపెని సిబ్బందిని కూడా కార్యాలయానికి రప్పించి నష్టపోయిన రైతులకు పంట నష్ట పరిహారం అందించాలని అదేశించారు. ఈ నెల 15వ తేది లోపు అరుణ సీడ్స్ కొనుగోలు చేసి పంట సాగుచేసిన వివరాలు, నష్టపోయిన రైతుల వివరాలపై విచారణ చేసి రైతులను పరిహారం అందించే విధంగా అధికారులు కసరత్తు చేపట్టారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోంత నియోజకవర్గం కావడంతో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నష్టపోకుండా అధికారులు దగ్గర ఉండి చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. 15వ తేది లోపు రైతులకు పరిహారం చెల్లించని ఏడల షాపు యాజమాన్యంపై చట్టరిత్య చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైన నకిలి విత్తనాలు, మందులు అమ్మినచో వారి లైసెన్స్‌లు రద్దు చేయడమే కాకుండా కేసులు నమోదు చేస్తామని తెలిపారు. రైతులకు మద్దతుగా యువజన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కృష్ణంరాజు, ఓంప్రకాశ్ తదితరులున్నారు.



## ఈటలకు కేంద్రమంత్రి పదవి వరించేనా!

ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి: భారీ మెజారిటీతో విజయం సాధించిన బిజెపి అభ్యర్థి ఈటల రాజేందర్‌కు కేంద్రంలో మరోసారి పాలనాపగ్గాలు చేపట్టనున్న బిజెపి ప్రభుత్వంలో కేంద్ర మంత్రి పదవి దక్కే అవకాశాలు ఉన్నట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది. పునర్విభజన అనంతరం ఏర్పాటైన మల్కాజిగిరి పార్లమెంటు స్థానం నుండి మూడు సార్లు జరిగిన పార్లమెంటు గెలుపొందిన వారిలో 2009లో కాంగ్రెస్ పార్టీ నుండి గెలుపొందిన సర్వే సత్యనారాయణ కేంద్ర మంత్రి, 2014లో తెలుగుదేశం నుండి గెలుపొందిన మల్లారెడ్డి ఆ తర్వాత బిఆర్ఎస్‌లో చేరి ఎమ్మెల్యేగా విజయం సాధించి రాష్ట్ర మంత్రి పదవులు దక్కించుకోగా 2019లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గెలుపొందిన రేవంత్‌రెడ్డి ఆ తర్వాత ఎమ్మెల్యేగా గెలిచి ఏకంగా రాష్ట్ర ముఖ్యమంత్రి పదవి చేపట్టటం జరిగింది. మల్కాజిగిరి స్థానం నుండి ఇప్పటి వరకు గెలిచిన ముగ్గురు ఎంపిలకు ఉన్నత పదవులు దక్కిన మాదిరిగానే తాజా ఎంపి ఎన్నికల్లో ఈ స్థానం నుండి భారీ మెజారిటీతో గెలుపొందిన ఈటెల రాజేందర్‌కు కేంద్ర మంత్రి స్థానం వరించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. డీలిమిటేషన్ కమిషన్ సిఫార్సుల ఆధారంగా పార్లమెంటరీ నియోజకవర్గాల పునర్విభజనతో 2009లో నూతనంగా ఏర్పాటైన మల్కాజిగిరి లోకసభ స్థానానికిసాధించాడు. దేశంలోనే అతి పెద్దదైన ఈ స్థానం నుండి ఇప్పటి వరకు జరిగిన మూడు ఎన్నికల్లో ఈ మేరకు భారీ మెజారిటీ ఓట్లు సాధించిన వ్యక్తిగా నిలిచారు. 2009లో జరిగిన తొలి ఎన్నికల్లో గెలుపొందిన కాంగ్రెస్ అభ్యర్థి సర్వే సత్యనారాయణ 93,226 ఓట్ల మెజారిటీ, 2014లో ఎన్నికల్లో గెలుపొందిన టిడిపి అభ్యర్థి మల్లారెడ్డి 28,371 ఓట్ల మెజారిటీ, 2019లో గెలుపొందిన కాంగ్రెస్ అభ్యర్థి రేవంత్‌రెడ్డి 10,919 ఓట్ల మెజారిటీతో గెలుపొందగా తాజాగా ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి ఈటెల రాజేందర్ ఏకంగా 3 లక్షల 91 475 ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించిన తొలి వ్యక్తిగా నిలిచారు.

## ప్రజలకు అందుబాటులో ఉంటా:ఈటల



ప్రజాపక్షం/మల్కాజిగిరి: గత పార్లమెంటు ప్రతినిధులకు భిన్నంగా స్థానికంగా అన్ని వేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ నియోజకవర్గాన్ని ప్రగతి పథంలోకి తీసుకొని వెళతానని నూతనంగా మల్కాజిగిరి ఎంపిగా ఎన్నికైన ఈటెల రాజేందర్ మరో సారి హామీ ఇచ్చారు. తాజా ఫలితాల్లో ఘనంగా భారీ మెజారిటీతో గెలుపొందిన ఆయనను మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్‌కుమార్, పార్టీ నేతలు శ్రీకాంత్, శ్రీనివాస్, ప్రభుగుప్తా తదితరులతో పాటు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## ఈటల రాజేందర్‌కు శుభాకాంక్షల వెల్లువ

ప్రజాపక్షం/శామీర్‌పేట : మల్కాజ్‌గిరి ఎంపిగా విజయం సాదించిన ఈటెల రాజేందర్‌కు జగ్గంగూడ గ్రామానకి చెందిన బిజెవైఎం జిల్లా కార్యదర్శి సాయిబాబు బుధవారం శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మూడుచింతలపల్లి మండలం ల క్ష్మాపూర్ గ్రామానికి చెందిన మూడుచింతలప ల్లి మండల బిజెపి మహిళా మోర్చ అధ్యక్షురాలు సింగం విజయలక్ష్మి , యువ నాయకుడు లగశెట్టి అరుణ్, సింగం రాకేష్, సుజిత్‌పాల్, దప్పు రథ న్, సిం గం శ్రీపాల్, వెంకటేష్, తదితరులు ఈటెల రాజేందర్‌ను కలిసి శు భాకాంక్షలు తెలిపారు. మూడుచింతలపల్లి మండలంలో అన్ని బూత్‌ల్లో బి జెపికి అత్యధిక మెజార్టి ఇచ్చిన ఓటర్లకు ప్రత్యేక దన్యవాదాలు తెలిపారు. బిజెపిని ఆదరించినందుకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

## ఇంగ్లీషు నేర్చుకోవడం తప్పనిసరి

శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు



ప్రజాపక్షం / కొడంగల్ : నేటి కాలంలో ఆంగ్ల విద్యా ఎంతో ప్రాముఖ్యమైనదని జిల్లా డిప్యూటి డిఎంఎహ్‌వో డాక్టర్ రవీంద్రయాదవ్ అన్నారు. కొడంగల్ పట్టణంలోని నవీన ఆదర్శ కాన్వెంట్ హైస్కూల్‌లో ఆర్‌కే స్పోకేన్ ఇంగ్లీషు డైరెక్టర్ టి.రమేష్ వేసవి సెలవుల్లో విద్యార్థులకు 45 రోజుల పాటు స్పోకేన్ ఇంగ్లీషు క్లాస్‌లను నిర్వహించారు. బుధవారం విద్యార్థులకు ఇంగ్లీషు సర్టిఫికేట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅథితులుగా వచ్చిన డాక్టర్ రవీంద్ర యాదవ్, ప్రముఖ వ్యాపారవేత్త లక్ష్మి నారాయణ గుప్త, పాఠశాల ప్రిన్సిపల్ నరేష్‌రాజ్‌లు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతు నేటి కాలంలో విద్యార్థి దశ నుంచి ప్రతి ఒక్కరు ఇంగ్లీషు మాట్లాడేందుకు ఎంతో ఆసక్తి చూపుతున్నారన్నారు. మన మాతృభాష తెలుగు, దేశ భాష హిందీ అయినప్పటికి పరాయి భాష ఎక్కువగా వాడుకలో ఉంటడంపై ఇంగ్లీషు తప్పని భాషగా మారిందన్నారు. మారుమూల గ్రామంలో పుట్టిన రమేష్ తన పట్టుదలతో హైద్రాబాద్‌లో కూలీ పనులు చేసుకుంటు ఇంగ్లీషు నేర్చుకుని ఒక ఉపాధ్యాయుడిగా మారి ఎంతో మందికి ఇంగ్లీషును నేర్పడంతో పాటు కలారి ప్రాచీన విద్యాను కూడా నేర్పించడం ఎంతో హర్షించదగ్గ విషయమన్నారు. 45 రోజులలోనే అనర్గలంగా మాట్లాడగలిగే సత్తా విద్యార్థులలో నేర్పించడం మాములు విషయం కాదని అందుకు రమేష్‌ను అభినందించారు. అనంతరం 45 రోజుల పాటు శిక్షణ పోందిన విద్యార్థులకు సర్టిఫికేట్‌లను అందజేశారు. వీరితో పాటు జూనియర్ న్యాయవాది సురేష్‌గౌడ్‌లతో పాటు తదితరులున్నారు.

# క్రీడ

## విరాట్ అరుదైన ఘనత టాప్ 2 అథ్లెట్‌గా కోహ్లీ



టీమ్ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ మరో అరుదైన ఘనత సాధించాడు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ (ట్విట్టర్)లో అత్యధిక ఫాలోవర్లు కలిగిన రెండో అథ్లెట్‌గా నిలిచాడు. ఈ క్రమంలో బ్రెజిల్ స్టార్ ఫుట్‌బాల్ ఆటగాడు నెయ్‌మర్ జూనియర్‌ను విరాట్ అధిగమించాడు. ప్రస్తుతం విరాట్‌కు ట్విట్టర్‌లో 63.5 మిలియన్ ఫాలోవర్లు ఉండగా, నెయ్‌మర్‌కు 63.4 మిలియన్ మంది ఉన్నారు. ఇక ఈ లిస్ట్‌లో పోర్చుగల్ స్టార్ ఫుట్‌బాల్ లెజెండ్ క్రిస్టియానో రొనాల్డో అగ్రస్థానంలో ఉన్నాడు. రొనాల్డోను 111.4 మిలియన్ యూజర్లు ట్విట్టర్‌లో ఫాలో అవుతున్నారు. కాగా, ఇన్‌స్టాగ్రామ్‌లో విరాట్‌కు 269 మిలియన్ ఫాలోవర్లు ఉండగా, రొనాల్డోకు 631 మిలియన్ ఫాలోవర్లు ఉన్నారు.

## థియేటర్లలోకి మరోసారి 'ధోనీ' మూవీ

**న్యూఢిల్లీ :** టీమ్ఇండియా మాజీ కెప్టెన్ ఎమ్ఎస్ ధోనీ బర్త్‌డేను అతడి ఫ్యాన్స్ స్పెషల్‌గా సెలబ్రేట్ చేయనున్నట్లు తెలుస్తోంది. జూలై 7 ధోనీ పుట్టిన రోజు సందర్భంగా అతడి బయోపిక్ 'ధోనీ అన్‌టోల్డ్ స్టోరీ' సినిమాను రీ రిలీజ్ చేయాలని ఫ్యాన్స్ భావిస్తున్నారట. ఈ మేరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో ఎంపిక చేసిన థియేటర్లలో స్పెషల్ షోస్ వేయనున్నారని టాక్. ఇక 2016లో రిలీజైన ఈ సినిమా భారీ విజయం దక్కించుకుంది. ఈ సినిమాకు నీరజ్ పాండే దర్శకత్వం వహించారు. ధోనీ చిన్నతనం నుంచి 2011 వరల్డ్‌కప్ నెగ్గిన దాకా ఆతడి లైఫ్ జర్నీని సినిమాలో చూపించారు. ఈ సినిమాలో బాలీవుడ్ స్టార్, దివంగత నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ ధోనీ పాత్రలో నటించారు. హీరోయిన్లు దిశా పటానీ, కియారా అడ్వాణీ తదితరులు నటించారు.



## సెమీస్‌లో బోపన్న.. ఏడేండ్ల కల సాకారమయ్యేనా..?

పురుషుల డబుల్స్‌లో సంచలన విజయాలు సాధిస్తున్న రోహన్ బోపన్న జోడీ మరో టైటిల్‌కు చేరువైంది. ఫ్రెంచ్ ఓపెన్‌లో భాగంగా బుధవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో బోపన్న – మాథ్యూ ఎబ్డెన్ జంట అద్భుత విజయం సాధించింది. ఇండో ఆస్ట్రేలియన్ జటకు చెక్ పెట్టి సెమీ ఫైనల్లో అడుగుపెట్టింది. సాండర్ జిల్లే, జోరాన్ విలెజెన్ జంటపై బోపన్న ద్వయం 76, 57, 61తో గెలుపొందింది. ప్రీ క్వార్టర్స్‌లో అతికష్టమ్మీద ఎన్ శ్రీరామ్ బాలాజీ, మిగెల్ ఆంజెల్ రెయెస్ వరెలా ద్వయంపై గట్టెక్కిన బోపన్న – ఎబ్డెన్ జంట సెమీస్ బెర్తు ఫైట్‌లో అదరగొట్టింది. సాండర్, జోరాన్‌లపై ఆధిపత్యం చెలాయిస్తూ తొలి, మూడో సెట్ గెలిచి మ్యాచ్ ముగించింది. సెమీఫైనల్లో ఇటలీ జంట సిమోనె బొలెలి, అంద్రియా వవస్సోరితో తలపడే చాన్స్ ఉంది. 2017లో మిక్స్‌డ డబుల్స్ టైటిల్ సాధించిన బోపన్న మట్టి కోర్టులో మరో టైటిల్‌కు రెండడుగుల దూరంలో నిలిచాడు.

# పొట్టికప్‌లో 'భారత్' బోణీ

### ఐర్లాండ‌పై ఆల్‌రౌండ్ షో





**ఐర్లాండ్ :** టి20 వరల్డ్‌కప్‌లో టీమ్ఇండియా బోణీ కొట్టింది. న్యూయార్క్ వేదికగా ఐర్లాండ్‌తో బుధవారం జరిగిన మ్యాచ్‌లో టీమ్ఇండియా 8 వికెట్ల తేడాతో నెగ్గింది. ఐర్లాండ్ నిర్దేశించిన 97 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని భారత్ 2 వికెట్లు కోల్పోయి 12.2 ఓవర్లలో సునాయసంగా ఛేదించింది. కెప్టెన్ రోహిత్ శర్మ (52 పరుగులు: 37 బంతుల్లో: 4X4, 3X6) హాఫ్ సెంచరీతో ఆకట్టుకున్నాడు. రిషభ్ పంత్ (36* పరుగులు) రాణించాడు. ఐర్లాండ్ బౌలర్లలో మార్క్ అదైర్, బెంజామిన్ వైట్ చెరో 1 వికెట్ దక్కించుకున్నారు.

**రోహిత్- – విరాట్ జోడీ:** అందరూ అన్నట్లుగానే ఈ మ్యాచ్‌లో రోహిత్‌తో కలిసి విరాట్ కోహ్లీ ఇన్నింగ్స్ ప్రారంభించాడు. దీంతో ఈ స్టార్ జోడీయే మ్యాచ్ ముగిస్తుందని అనుకున్నారు. కానీ, మూడో ఓవర్లో భారీ షాట్‌కు ప్రయత్నించిన విరాట్ క్యాచౌట్‌గా పెవిలియన్ చేరాడు. దీంతో 22 పరుగులకే తొలి వికెట్ కోల్పోయింది. ఇక వన్‌డౌన్‌లో దిగిన పంత్‌తో రోహిత్ స్కోర్ బోర్డును ముందుకు నడిపించాడు. ఆ పిచ్‌పై ఇతర బ్యాటర్లు సింగిల్స్ తీయడానికి కష్టపడుతుంటే రోహిత్ బౌండరీలతో అలరించాడు. ఈ క్రమంలో టీ20ల్లో 30వ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఇక 52 పరుగుల వద్ద రిటైర్డ్ హర్ట్‌గా రోహిత్ క్రీజును వదిలాడు. చివర్లో సూర్య భారీ షాట్‌కు యత్నించి ఔటయ్యాడు. తర్వాత పంత్ మ్యాచ్ ముంగించాడు.

**రోహిత్ @4000:** రోహిత్ శర్మ టి20ల్లో 4 వేల పరుగులు పూర్తి చేసుకున్నాడు. 26 పరుగులు వ్యక్తిగత స్కోర్ వద్ద రోహిత్ ఈ మైలు రాయి అందుకున్నాడు. ఇప్పటి వరకు రోహిత్ టి20ల్లో 4026 పరుగులు బాదాడు. ఈ క్రమంలో టి20ల్లో అత్యధిక పరుగులు బాదిన టాప్ 2 బ్యాటర్‌గా నిలిచాడు. విరాట్ కోహ్లీ (4038) టాప్‌లో ఉండగా పాక్ బ్యాటర్ బాబర్ ఆజమ్ (4023) మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. ఇక ఈ మ్యాచ్‌లో రోహిత్ 1000 టీ20 వరల్డ్‌కప్ పరుగులు కూడా పూర్తి చేసుకున్నాడు.

**అక్షర్ @50:** స్పిన్నర్ అక్షర్ పటేల్ అరుదైన ఘనత సాధించాడు. ఈ మ్యాచ్‌లో ఒక వికెట్ దక్కించుకున్నాడు. ఈ క్రమంలో అక్షర్ టి20ల్లో 50 వికెట్లు పూర్తి చేసుకున్నాడు. ఇప్పటివరకు 53 మ్యాచ్‌ల్లో 50 వికెట్లు పడగొట్టాడు. 39 అత్యుత్తమ ప్రదర్శన.

# రీల్



## 'సత్యభామ' ఆవేశం బయటపడేది అప్పుడే!

స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ లీడ్ రోల్ లో నటిస్తున్న తాజా చిత్రం 'సత్యభామ' జూన్ 7న రిలీజ్ కు రెడీ అయ్యింది. ఈ సినిమా ప్రమోషన్స్ లో చిత్ర యూనిట్ బిజీగా ఉన్నారు. కాజల్ కూడా ఈ సినిమాను బాగా ప్రమోట్ చేస్తోంది. ఈ సినిమాతో గట్టి కమ్ బ్యాక్ ఇవ్వాలని ఆమె భావిస్తుంది. లేడీ పోలీస్ గా ఆమె ఈ సినిమాలో కనిపిస్తున్న సంగతి తెలిసిందే. కాగా రిలీజ్ కు దగ్గరైన 'సత్యభామ' మూవీ నుండి తాజాగా ఓ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ సినిమాలో 'రేజ్ ఆఫ్ సత్యభామ' అనే లిరికల్ సాంగ్ ను జూన్ 6న ఉదయం 10.08 గంటలకు రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ వెల్లడించారు. దీనికి సంబంధించి ఓ పోస్టర్ ను కూడా వారు సోషల్ మీడియాలో రిలీజ్ చేశారు. ఈ పాటను రామజోగయ్య శాస్త్రి రచించగా.. సౌజన్య భాగవతుల, రవిప్రకాశ్ కలిసి పాడారు. ఇక సత్యభామ మూవీలో కాజల్ తో పాటు నవీన్ చంద్ర, ప్రకాశ్ రాజ్, నాగినీడు, హర్ష వర్ధన్, రవివర్మ తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాను సుమన్ చిక్కల డైరెక్ట్ చేయగా.. శశికరణ్ టిక్క, బాబీ టిక్క, శ్రీనివాసరావు టక్కలపల్లి సంయుక్తంగా ప్రొడ్యూస్ చేశారు.




## 'ఎన్‌బికె109' నుండి బాలయ్య పోస్టర్!

నందమూరి బాలకృష్ణ ప్రధాన పాత్రలో, డైరెక్టర్ బాబీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న యాక్షన్ ఎంటర్టైనర్ ఎన్‌బికె109. ఈ చిత్రంకి ఇంకా టైటిల్‌ను ఖరారు చేయాల్సి ఉంది. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రములో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నందమూరి బాలకృష్ణ మరోసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఈ హ్యాట్రిక్ విజయం పట్ల అభిమానులు, సినీ ప్రముఖులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ఎన్‌బికె109టీమ్ ఒక పవర్ ఫుల్ పోస్టర్‌ను విడుదల చేసారు. సింహం యొక్క గర్జనతో బాలయ్య ఉన్న పోస్టర్ అది. హ్యాట్రిక్ విజయం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ రిలీజ్ చేసిన ఈ పోస్టర్ ఆడియెన్స్‌ను విశేషంగా ఆకట్టుకుంటుంది. బాలకృష్ణ యొక్క 109వ చిత్రంలో షైన్ టామ్ చాకో, ఊర్వశి రౌతేల, బాబీ డియోల్, చాందిని చౌదరి తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సితార ఎంటర్టైన్మెంట్స్ పతాకంపై నాగవంశీ, ఫార్చ్యూన్‌ఫోర్ సినిమాపై సాయి సౌజన్య నిర్మిస్తున్నఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తున్నారు.

## పవన్ ఓజి నుంచి పవర్‌ఫుల్ పోస్టర్



ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో ఓ రేంజ్‌లో వినిపిస్తున్న స్టార్ హీరో పేరు పవర్‌స్టార్ పవన్‌కళ్యాణ్. ఎన్నో ఏళ్ల సుదీర్ఘ ప్రయాణం అనంతరం పవన్‌కళ్యాణ్ ఎన్నికల్లో గెలుపొందుతున్న పవన్‌మేనియా ఎలా కనిపిస్తుండగా ఈ హ్యాపీ మూమెంట్‌లో అభిమానులు సంబరాలు కూడా మొదలు పెట్టేసారు. అయితే ఇదే మూమెంట్‌లో పవన్ నటిస్తున్న అవైటెడ్ పాన్ ఇండియా చిత్రం ఓజి నుంచి ఓ సాలిడ్ పోస్టర్ వస్తున్నట్టుగా స్ట్రాంగ్ బజ్ వచ్చింది. మరి అనుకున్నట్టుగా మేకర్స్ ఈ పోస్టర్‌ని ఇప్పుడు వదిలి పవన్ ఫ్యాన్స్‌కి మరింత ఎనర్జీ అందించారు. మరి ఈ సాలిడ్ పోస్టర్‌లో పవన్ కుర్చీలో కూర్చొని మంచి పవర్ఫుల్ అండ్ స్టైలిష్ గ్యాంగ్‌స్టర్‌గా కనిపిస్తుండగా చేతిలో వాచ్ పట్టుకొని కనిపిస్తున్నాడు. అలాగే దీనికి కాప్షన్‌గా ఓజి సమయం ఆసన్నం అయ్యింది. అంటూ మేకర్స్ అదిరే ట్రీట్‌ని అయితే ఇప్పుడు ముందుంచారు. దీనితో ఇప్పుడు ఈ పోస్టర్ సోషల్ మీడియాని షేక్ చేస్తుంది.

## నవీన్ పట్నాయక్ రాజీనామా

**భువనేశ్వర్ :** ఒడిశాను 24 ఏళ్ల పాటు పాలించిన బిజెడి సుప్రీం నవీన్ పట్నాయక్ తొలిసారి ఓటమిని చవిచూశారు. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోవడంతో ముఖ్యమంత్రి పదవికి బుధవారం రాజీనామా చేశారు. రాజీనామా లేఖను గవర్నర్ రఘుబర్ దాస్‌కు రాజ్‌భవన్ అందజేసినట్లు వర్గాలు పేర్కొన్నాయి. అయితే పట్నాయక్ నివాసంలో అనేకమంది బిజెడి నాయకులు సమావేశమైనప్పటికీ రాజ్‌భవన్‌కు ఒంటరిగానే వెళ్లి నితీశ్ రాజీనామా సమర్పించడం గమనార్హం. అనంతరం ఆయన రాజ్‌భవన్ ఎదుటు వేచి చూస్తున్న జర్నలిస్టులకు అభివాదం చేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. కాగా, ఒడిశా అసెంబ్లీతో పాటు లోక్‌సభ ఎన్నికల్లో కూడా బిజెపి విజయం సాధించింది. మొత్తం 147 అసెంబ్లీ స్థానాలకు గానూ బిజెపి 78 స్థానాలతో మెజారిటీ మార్కును దాటింది. బిజెడి 51, కాంగ్రెస్ 14, ఇతరులు 4 చోట్లు గెలుపొందారు. దీంతో రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు బిజెపి సిద్ధమైంది. అటు మొత్తం 21 లోక్‌సభ స్థానాలకు 20 చోట్ల బిజెపి విజయం సాధించగా, ఒక చోట కాంగ్రెస్ గెలుపొందింది. బిజెడి ఒక్క స్థానాన్ని కూడా దగ్గించుకోలేకపోయింది.

**కొత్త సిఎం ఎవరో?**

రెండున్నర దశబ్దాల తర్వాత రాష్ట్ర సిఎంగా కొత్త వ్యక్తి రానుండటంపై ఆ రాష్ట్ర రాజకీయాల్లో సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ క్రమంలో బిజెపి తరపున కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, కేంద్ర మాజీ మంత్రి జోయల్ ఓరం, బిజెపి అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర, బిజెపి జాతీయ ఉపాధ్యక్షుడు భైజయంత్ పండ ముఖ్యమంత్రి అభ్యర్థి జాబితాలో ముందున్నారు. అయితే, వీరంతా లోక్‌సభ స్థానాల్లో విజయం సాధించడంతో ఒడిశా సిఎంగా కాషాయ పార్టీ కొత్తవారిని పరిచయం చేసే అవకాశం ఉండవచ్చనే వార్తలు వినిపిస్తున్నాయి. దీంతో నవీన్ పట్నాయక్‌కు ప్రత్యామ్నాయంగా ఎవరిని తీసుకువస్తుందనే విషయంపై ఉత్కంఠ కొనసాగుతోంది.

## రాజస్థాన్‌లో జాట్‌లు ఉండే చోట 'ఇండియా' స్వీప్

**రాజస్థాన్ :** రాజస్థాన్‌లోని జాట్‌లు అధికంగా ఉండే షెకావతి ప్రాంతంలోని నాలుగు లోక్‌సభ స్థానాలను ఇండియా కూటమి కైవసం చేసుకుంది. ఈ ప్రాంతంలో రైతుల ఆందోళన, అగ్నిపథ్ పథకం ఎన్నికల రంగంలో తీవ్ర ప్రచారం చూపించింది. రాజస్థాన్‌లో గత రెండు లోక్‌సభ ఎన్నికల్లో మొత్తానికి మొత్తం 25 లోక్‌సభ స్థానాలు ఎన్‌డిఏ గెలుచుకోగా, ఈసారి 11 స్థానాలు గెలవడం ద్వారా ప్రతిపక్ష ఇండియా కూటమికి మంచి ఊపును ఇచ్చింది. గత డిసెంబర్‌లో శాసనసభ ఎన్నికల్లో ఓడిపోయిన కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు లోక్‌సభ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించాయి. బిజెపి 14 స్థానాల్లో గెలుపొందగా, కాంగ్రెస్ ఎనిమిది చోట్ల విజయం సాధించింది. అదే సమయంలో ఇండియా కూటమిలో భాగస్వామ పక్షాలు ఒక్కో స్థానం చొప్పున సిపిఐ(ఎం) సికార్ నియోజకవర్గంలో , రాష్ట్రీయ లోక్‌తాంత్రిక్ పార్టీ (ఆర్‌ఎల్‌పి) నాగౌర్ , భారత్ ఆదివాసీ పార్టీ(బిఎపి) బన్స్‌వారా–దుంగార్పూర్ స్థానాలలో గెలుపొందాయి. బిజెపి అన్ని స్థానాలలో ఒంటరిగానే పోటీ చేసింది. షెకావతి ప్రాంతంలో ఉన్న చురూ, ఝున్‌ఝును, సికార్, నాగౌర్ జిల్లాలో నాలుగు స్థానాలు ఇండియా కూటమే గెలుచుకున్నాయి. చురూ, ఝున్‌ఝునులో కాంగ్రెస్ గెలుపొందగా, సికార్‌లో సిపిఐ(ఎం), నాగౌర్‌లో ఆర్‌ఎల్‌పి గెలుపొందింది. షెకావతి ప్రాంతాన్ని యోధుల భూమిగా భావిస్తారు. ఇక్కడ నుండి పెద్ద ఎత్తున యువకులు సైన్యంలో చేరుతుంటారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన అగ్నిపథ్ పథకం పట్ల యువత తీవ్ర నిరుత్సాహపడ్డారు. అగ్నిపథ్‌తో పాటు రైతుల అంశాలపై కూడా కాంగ్రెస్ ప్రచారం చేసింది. ఉత్తర రాజస్థాన్‌లో రైతుల అధికంగా ఉండే గంగానగర్‌లో కాంగ్రెస్, బికనేర్‌లో బిజెపి గెలిచింది. కేంద్ర మంత్రి అర్జున్ మేఘువా బికనీర్ నుండి వరుసగా నాలుగవ సారి 55,711 మెజారిటీతో గెలుపొందారు. గత లోక్‌సభ ఎన్నికల్లో ఆయనకు 2.64 లక్షల మెజారిటీ వచ్చింది. తూర్పు రాజస్థాన్‌లో దౌసా, ధోల్‌పూర్–కరౌలి, భరత్‌పూర్, టోంక్ – సవాయిమాధోపూర్‌లో కాంగ్రెస్ జయకేతనం ఎగురవేయగా, కేవలం అల్వార్ స్థానం నుండి బిజెపి గెలిచింది. ఈ ప్రాంతంలో దౌసా స్థానం నుండి ఎంఎల్‌ఏ మురారీ మీనా 2.37 లక్షల భారీ మెజారిటీతో గెలిచారు. భరత్‌పూర్ స్థానంలో కాంగ్రెస్ 51,983 ఓట్ల మెజారిటీ సాధించింది. భరత్‌పూర్ పట్టణం రాజస్థాన్ ముఖ్యమంత్రి స్వంత ఊరు. ఇక్కడ కాంగ్రెస్ మంచి విజయం సాధించింది.

# లోపాలు దిద్దుకుంటాం: కేరళ సిఎం



**తిరువనంతపురం:** కేరళలో ఎల్‌డిఎఫ్ ఆశించిన ఫలితాలు సాధించలేకపోయామని, 2019 లోక్‌సభ ఎన్నికల ఫలితాలే ఇప్పుడు కూడా వచ్చాయని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ వ్యాఖ్యానించారు. ప్రభుత్వంలో లోపాలు ఉన్నాయని, వాటిని వామపక్ష సంఘటన గుర్తించి, సరి చేస్తుందని అన్నారు. 'రాష్ట్ర ప్రభుత్వంపై వ్యవస్థీకృత తప్పుడు ప్రచారాన్ని' తిప్పికొట్టే ప్రయత్నాలను బలోపేతం చేస్తామని, ప్రజల్లో తప్పుడు అభిప్రాయాలను తొలగిస్తామన్నారు. లోక్‌సభ ఫలితాలపై గురువారం ఆయన ఒక ప్రకటనను విడుదల చేశారు. ప్రజా తీర్పును ఆమోదిస్తూ ప్రభుత్వం మరింత ప్రభావవంతంగా పని చేస్తుందని, ఫలితాలను లోతుగా పరిశీలించి, అవసరమైన దిద్దుబాటు చర్యలు చేసుకుంటామని విజయన్ తెలిపారు. ప్రజలను ఐక్యంగా ఉంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర, సూక్ష్మ స్థాయి చర్యలు తీసుకుంటుందని, రాష్ట్ర ప్రగతి, మంచి కోసం దృఢంగా ముందుకు సాగుతామని వివరించారు. ఎల్‌డిఎఫ్ తన బాధ్యతలను నిర్వర్తిస్తూ, లౌకిక విలువల కోసం నిబద్ధతతో పని చేస్తామని విజయన్ స్పష్టం చేశారు. ఎల్‌డిఎఫ్ కోసం పని చేసిన , అండగా నిలబడిన వారికి, దేశ వ్యాప్తంగా బిజెపికి వ్యతిరేకంగా ఓటేసిన ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

**బిజెపికి గట్టి దెబ్బ**

ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువల ధ్వంసం చేసేందుకు బిజెపి చేసిన ప్రయత్నాలకు లోక్‌సభ ఎన్నికల ఫలితా గట్టి దెబ్బ అని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ అన్నా రు. కాషాయ పార్టీకి అనుకూలంగా జరిగిన ప్రచారాన్ని ప్రజలు తిరస్కరించారని అన్నారు. మతతత్వాన్ని ఉపయోగించుకొని, విభజనవాదం ద్వారా ప్రజలను విడగొడ్డడం ద్వారా భద్రంగా బైటపడతామని బిజెపి ఊహలను భారత ప్రజలతు పటాపంచలు చేశారని అన్నారు. మీడియా పెద్ద ఎత్తున బిజెపి అనుకూలంగా సృష్టించిన వాతావరణం, కేంద్ర ఏజెన్సీలు, ధన శక్తి అన్నిటిని కూడా ప్రజలు తిరస్కరించారని, బిజెపికి మెజారిటీ సీట్లు రాకపోవడమే అందుకు నిదర్శనమని ఆయన అన్నారు.

### 11 మందితో బెంగాల్‌దే అగ్రస్థానం

# 18వ లోక్‌సభకు 73 మహిళల ఎన్నిక

**న్యూఢిల్లీ :** 18వ లోక్‌సభకు 73 మంది మహిళలు మాత్రమే ఎం పి లుగా ఎన్నికయ్యారు. గత సభలో కంటే ఈ సంఖ్య తక్కువ. ఐతే 1952లో జరిగిన లోక్‌సభ ఎన్నికల తర్వాత నుండీ ఇప్పటివరకూ మహిళా అభ్యర్థులు ఎక్కువమంది ఉన్న అత్యున్నత చట్టసభల్లో ఒకటిగా 18వ లోక్‌సభ కూడా నమోదైంది. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 78 మంది మహిళలు లోక్‌సభకు ఎన్నికయ్యారు. 17వ లోక్‌సభలో మహిళలు 14 శాతంగా నమోదయ్యారు. 16వ లోక్‌సభలో 64 మంది మహిళలు ఉన్నారు. 15వ లోక్‌సభకు 52 మంది మహిళలు గెలిచారు. హేమ మాలిని (బిజెపి), మహువా మొయిత్రా (టిఎంసి), సుప్రియా సూలే (ఎన్‌సిపి), డింపుల్ యాదవ్ (సమాజ్‌వాదీ పార్టీలు మళ్ళీ గెలిచి తమ స్థానాలు నిలబెట్టుకున్నారు. కాగా కంగనా రనౌత్, మిషా భారతి మాత్రం తమ విజయాల ద్వారా అందరి హృదయాలను దోచుకున్నారు సమాజ్‌వాదీపార్టీలో 25 ఏళ్ళు వయసుగల ప్రియా సరోజ్, 29 ఏళ్ళు వయసుగల ఇక్రా చౌధురిలు విజయం సాధించిన యువతులుగా నమోదయ్యారు. లోక్‌జన్‌శక్తి పార్టీ (రామ్ విలాస్), ఎన్‌సిపిలలో మహిళా అభ్యర్థులు ఉఅన్నరు. జెఎంఎం, బిజూ జనతాదళ్ (బిజెడి)ల నుండి 33 శాతం మహిళా ప్రాతినిధ్యం ఉంది. పస్తుతం కొలువు తీరునున్న లోక్‌సభకు పశ్చిమ బెంగాల్ రాష్ట్రం నుండే అత్యధికంగా 11 మంది మహిళలు విజయం సాధించారు. ఈసారి ఎన్నికల్లో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుండి మొత్తం 797 మంది మహిళలు పోటీ పడ్డారు. బిజెపి 69 మంది మహిళా అభ్యర్థులను బరిలోకి దించగా, కాంగ్రెస్‌పార్టీ 41 మంది మహిళలకు సీట్లు కేటాయించింది. మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదించిన తర్వాత లోక్‌సభకు జరిగిన మొదటి ఎన్నికలు ఇవే. ఈ బిల్లు ఇంకా చట్టరూపంలో అమలులోకి రాలేదు. ఎన్నికల సంఘం గణాంకాల విశ్లేషణ ప్రకారం ఈసారి ఎన్నికల్లో బిజెపి నుండి 30 మంది మహిళలు విజయం సాధించారు. కాంగ్రెస్‌పార్టీ తరపున 14 మంది మహిళలు గెలిచి లోక్‌సభలో అడుగుపెట్టబోతున్నారు. తృణమూల్ కాంగ్రెస్ తరపున 11 మంది, సమాజ్‌వాదీపార్టీ తరపున నలుగురు, డిఎంకె తరపున ముగ్గురు, జెడియు తరపున ఒక్కరు, ఎన్‌జెపి (ఆర్) తరపున ఒక్కరూ విజయం సాధించారు. 18వ లోక్‌సభలో మొత్తం మహిళా ఎంపీలు 13.44 శాతంగా ఉన్నారు. కాగా ఈ సారి పార్లమెంటు ఎన్నికల్లో స్త్రీ పురుషులు అందరూ కలిసి 8,360 మంది అభ్యర్థులు దేశవ్యాప్తంగా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుండి పోటీపడ్డారు.

## ఒకే విమానంలో ఢిల్లీకి నీతీశ్, తేజస్వి

**న్యూఢిల్లీ :** లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో బిజెపి సొంతంగా 272 సీట్ల మెజార్టీ మార్కును అందుకోలేకపోవడం, అటు విపక్ష ఇండియా కూటమి అనూహ్యంగా పుంజుకున్న తరుణంలో బుధవారం రాజకీయ పక్షాలు కీలక భేటీలు నిర్వహించాయి. భవిష్యత్తు కార్యాచరణపై చర్చించాయి. ఈ తరుణంలో ఆసక్తికర పరిణామం జరిగింది. బీహార్ సిఎం, జెడియు అగ్రనేత నీతీశ్ కుమార్, ఆర్‌జెడి నేత తేజస్వీ యాదవ్ ఒకే విమానంలో ఢిల్లీకి బయల్దేరడం గమనార్హం. వేర్వేరు కూటములకు చెందిన వీరు ఒకే విమానంలో ప్రయాణించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. నీతీశ్‌ను కలిసేందుకు ఇండియా కూటమి దూతలను పంపిందన్న వార్తల నేపథ్యంలో తేజస్వీ ప్రయాణించే విమానంలో ఆయన ఉండడం వల్ల మరిన్ని అనుమానాలు కలిగించింది.





ఫోటోలు: ఎస్.ఎన్. సిన్హా న్యూఢిల్లీ

లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించిన సందర్భంగా ఢిల్లీలోని బిజెపి ప్రధాన కార్యాలయానికి విచ్చేసిన నరేంద్ర మోదీ, నడ్డాకు ఘనస్వాగతం పలికిన పార్టీ శ్రేణులు. మోదీని ఘనంగా సన్మానించిన రాజ్‌నాథ్ సింగ్, నడ్డా.

## లోక్‌సభ ఎన్నికల తుది ఫలితాలు

### 240 స్థానాల్లో బిజెపి, 99 సీట్లలో కాంగ్రెస్ విజయం

**న్యూఢిల్లీ :** లోక్‌సభ ఎన్నికల ఫలితాలను ఎన్నికల సంఘం బుధవారం ప్రకటించింది. బిజెపి 240 స్థానాల్లో గెలుపొందగా, కాంగ్రెస్ 99 సీట్లలో విజయం సాధించింది. లోక్‌సభసభలో మొత్తం 543 స్థానాలు ఉండగా, 542 స్థానాలకు ఏడు దశల్లో ఎన్నికలు జరిగాయి. బిజెపి సూరత్ అభ్యర్థి ముకేష్ దలాల్ ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆయా రాష్ట్రాలు, యుటిల్లో పార్టీల వారీగా గెలుపొందిన సీట్ల వివరాలను ప్రకటించింది.

| | |
|---|---|
| బిజెపి | – 240 |
| కాంగ్రెస్ | – 99 |
| సమాజ్‌వాది పార్టీ | – 37 |
| తృణమూల్ కాంగ్రెస్ | – 29 |
| డిఎంకె | – 22 |
| తెలుగుదేశం పార్టీ | – 16 |
| జెడి(యు) | – 12 |
| శివసేన (యుబిటి) | – 9 |
| ఎన్‌సిపి (శరద్ పవార్) | – 8 |
| శివసేన | – 7 |
| లోక్‌జనశక్తి పార్టీ (రామ్‌విలాస్ | – 8 |
| వైఎస్‌ఆర్‌సిపి | – 4 |
| ఆర్‌జెడి | – 4 |
| సిపిఐ(ఎం) | – 4 |
| ఐయుఎంఎల్ | – 3 |
| ఆప్ | – 3 |
| జార్ఖండ్ ముక్తిమోర్చా | – 3 |
| జనసేన పార్టీ | – 2 |
| సిపిఐ(ఎంఎల్) (లిబరేషన్) | – 2 |
| జెడి(ఎస్) | – 2 |
| విడుతలై చిరుతైగల్ కచ్చి | – 2 |
| సిపిఐ | – 2 |
| రాష్ట్రీయ లోక్‌దళ్ | – 2 |
| నేషనల్ కాన్ఫరెన్స్ | – 2 |
| యునైటెడ్ పీపుల్స్ పార్టీ, లిబరల్ | – 1 |
| అసోం గన పరిషత్ | – 1 |
| హిందిస్థానీ ఆవాం మోర్చా (సెక్యులర్) | – 1 |
| కేరళ కాంగ్రెస్ | – 1 |
| రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ | – 1 |
| ఎన్‌సిపి | – 1 |
| వాయిస్ ఆఫ్ ది పీపుల్ పార్టీ | – 1 |
| జోరం పీపుల్స్ మూవ్‌మెంట్ | – 1 |
| శిరోమణి అకాలీదళ్ | – 1 |
| రాష్ట్రీయ లోక్‌తంత్రిక్ మోర్చా | – 1 |
| భారత్ ఆదివాసీ పార్టీ | – 1 |
| సిక్కిం క్రాంతికారి మోర్చా | – 1 |
| మరుమలార్చి ద్రవిడ మున్నేట్రా కర్గుం | – 1 |
| ఆజాద్ సమాజ్ పార్టీ (కాన్షీరామ్) | – 1 |
| అప్నాదళ్ (సోనియలాల్) | – 1 |
| ఎజెఎస్‌యు పార్టీ | – 1 |
| ఎఐఎంఐఎం | – 1 |
| స్వతంత్రులు | – 7 |

# పకడ్బందీగా పట్టభద్రుల కౌంటింగ్

7 రౌండ్లలో మొదటి ప్రాధాన్యత ఫలితాలు..
తేలకుంటే రెండవ ప్రాధాన్యత కౌంటింగ్
రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ దాసరి హరిచందన



**ప్రజాపక్షం/నల్లగొండ:** నల్లగొండ, వరంగల్, ఖమ్మం శాసనమండలి ఉప ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు పట్టభద్రుల ఉప ఎన్నిక రిటర్నింగ్ అధికారి, నల్లగొండ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన తెలిపారు. శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నికల ఓట్ల లెక్కింపు జరుగుతున్న అనిశెట్టి దుప్పలపల్లి గోదాము వద్ద జిల్లా ఎస్పి చందనా దీప్తితో కలిసి ఆమె మీడియాతో మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియ ఉదయం 8 గంటల నుండి ప్రారంభమైందని , ప్రస్తుతం బ్యాలెట్ పేపర్స్ బండిల్స్ కట్టే ప్రక్రియ కొనసాగుతున్నదని, బండిల్స్ కట్టే ప్రక్రియ మధ్యాహ్నం ఒంటిగంటకు పూర్తవుగానే మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు మొదలవుతుందన్నారు. కౌంటింగ్ ప్రక్రియ లో భాగంగా ఒక్కో హాల్లో 24లో చొప్పున నాలుగు హాల్లో ఈసారి 96 ఏర్పాటు చేశామని, ఒక్కో హాల్లో 500 చొప్పున ఒక రౌండ్ లో 48 వేల ఓట్ల లెక్కింపు జరుగుతుందని తెలిపారు. మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు సందర్భంలోనే చెల్లిన ఓట్లను, చెల్లని ఓట్లను వేరు చేసి లెక్కిస్తారని చెప్పారు.మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు 7 రౌండ్లలో పూర్తయ్యే అవకాశం ఉందని,మొదటి ప్రాధాన్యత ఓట్ల లో ఫలితం తేలనట్టయితే రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు సైతం ఇదే పద్ధతిలో కొనసాగుతుందని తెలిపారు.
జిల్లా ఎస్పి చందనా దీప్తి మాట్లాడుతూ ఎం ఎల్ సి ఎన్నికల ఓట్ల కౌంటింగ్ కేంద్రం వద్ద మూడంచల పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని, అన్ని ర్యాంకులకు చెందిన 800 మంది పోలీసులు కౌంటింగ్ కేంద్రం వద్ద బందోబస్తులో పనిచేస్తున్నారని తెలిపారు.ఒక్కో కౌంటింగ్ హాల్ వద్ద డిఎస్పి ర్యాంక్ అధికారి ఆధ్వర్యంలో పర్యవేక్షణ జరుగుతుందని,కౌంటింగ్ పూర్తయ్యే వరకు ఇదే భద్రత కొనసాగుతుందని తెలిపారు.

## ఎల్.ఓ.సి అందజేసిన ఏఐసిసి సెక్రెటరీ సంపత్‌కుమార్



**ప్రజాపక్షం/అలంపూర్:** మానపాడు మండలం కలుకుంట్ల గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు కరుణాకర్ రెడ్డి కొంతకాలంగా బ్రెయిన్ సర్జరీతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ హాస్పిటల్లో బ్రెయిన్ సర్జరీ చేయించుకున్నారు. ఈ విషయం తెలిసిన అలంపూర్ మాజీ ఎమ్మెల్యే,ఏఐసిసి కార్యదర్శి 3 లక్షల రూపాయల ఎల్‌ఓసిని ఆయనకు అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అలంపూర్ నియోజకవర్గంలో ప్రజలకు ఏ కష్టం వచ్చినా నేను అండగా ఉంటానని, కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షమని అన్నారు.ఈ కార్యక్రమంలో ఇటిక్యాలపాడు మండల అధ్యక్షులు శనగల్ల రఘునందరెడ్డి, డిసిసి జనరల్ సెక్రెటరీ సతీష్‌రెడ్డి ఉన్నారు.

## ప్రభుత్వ పాఠ్య పుస్తకాలు, డ్రెస్సులు పంపిణీ



**ప్రజాపక్షం/అయిజ:** మండల పరిధిలోని నౌరోజ్ క్యాంపు, మరియు ఉత్తనూరు ప్రభుత్వ పాఠశాలలు హెచ్.ఎంలకు ఎంఈఓ నర్సింహులు, మండల తహసిల్దార్ జ్యోతి చేతుల మీదుగా పాఠ్య పుస్తకాలు,విద్యార్థుల యూనిఫామ్స్ అంద చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో పట్టణాల్లోని పిల్లల తల్లి దండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లోనే తమ పిల్లలను చేర్పించాలని ప్రభుత్వ పాఠశాలల్లో ఎంతో అనుభవం కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారు. చక్కటి చదువు అందిస్తారని,ఎలాంటి ఖర్చు ఉండదని అన్నీ విధాలుగా ప్రభుత్వమే భరిస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ వెంకటయ్య, ఏపియం అన్నపూర్ణ, ప్రధానోపాధ్యాయులు భద్రయ్య, సర్వేశ్వరాచారి, ఎంఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలి




**ప్రజాపక్షం/ఆలేరు :** వానకాలం సీజన్ ప్రారంభం కావడంతో రైతులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెక్క వెంకటేష్ అన్నారు. బుధవారం ఆలేరు నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. నకిలీ విత్తనాలు అమ్మిన కంపెనీలపై షాపులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు బ్యాంకులలో కొత్త రుణాలు ఇచ్చి రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెడ్డు ఆంజనేయులు, పొన్నబోయిన రవి, మాటూరి జానమ్మ, కిష్టయ్య, ఆంజనేయులు, లక్ష్మి , మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## నీట్ ర్యాంకర్స్‌ను అభినందించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** వెలువడిన నీట్ ఫలితాల్లో జిల్లాలోనే అత్యధిక మార్కులు సాధించిన కేఎల్‌ఎన్ కళాశాల విద్యార్థులు బి.మేఘన (632), బి.అద్విత్‌కృష్ణ (631), ఎన్.సమీర్(491), బి.అఖిల (428), పి.సంజన'397)లను బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో విద్యారంగంలో మొదటిస్థానంలో నిలిపినందుకు, ఎందరినో డాక్టర్లుగా, ఇంజనీర్స్‌గా తయారు చేస్తున్న కరస్పాండెంట్ కిరణ్ కుమార్, డైరెక్టర్స్ నరేందర్‌రెడ్డి, పీఎల్‌ఎన్.రెడ్డి, హనుమంతరెడ్డిలను అభినందించారు. ఎంతోమంది ఉన్నత స్థానంలో ఉండేలా కృషి చేయాలన్నారు.

## సిఎంను కలిసిన ఎంపి చామల కిరణ్‌కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/ఆలేరు :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి బుధవారం వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి సన్మానించారు. వారి వెంబడి ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య, భువనగిరి పార్లమెంట్ ఇంచార్జి రాజగోపాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## విత్తనాలను అధిక ధరకు అమ్మితే చర్యలు



**ప్రజాపక్షం/ రామన్నపేట:** విత్తనాలను అధిక ధరలకు అమ్మితే చర్యలు తీసుకుంటామని జిల్లా స్పాట్ టీం ఏడి బి.వెంకటేశ్వర్లు, ఏడీఏ ఎస్.స్వప్నలు అన్నారు. రామన్నపేట మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపులను మోత్కూరు, రామన్నపేట వ్యవసాయ అధికారులతో కలిసి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిషాపులో విత్తనాలు, ఎరువుల ధరల పట్టికను అందుబాటులో ఉంచాలన్నారు. నిల్వ స్టాక్ విక్రయించిన స్టాక్ వివరాలను ప్రతిరోజు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. రైతులు లూజుగా విక్రయించే విత్తనాలను తీసుకోవద్దని సూచించారు. రూ.8,01134 విలువగల విత్తన ప్యాకెట్లపై ఉన్న లేబుల్ వివరాలు సరిగా లేనందున విత్తనాలు అమ్మకవం నిలుపుదల చేయడం జరిగిందన్నారు. రైతు ప్రతి కొనుగోలుకు బిల్లు తీసుకోవాలన్నారు. పంట అయిపోయే వరకు భద్రపరుచుకోవాలని, లైసెన్స్ ఉన్న డీలర్ల దగ్గరే విత్తనాలను కొనుగోలు చేయాలన్నారు.

## కార్పొరేట్ కళాశాలల ఫీజును నియంత్రించండి



అకాడమీల పేరుతో అడ్మిషన్లు
ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో డిఐఇఒకు వినతి

**ప్రజాపక్షం/ఖమ్మంఅర్బన్:** ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలల ఫీజులను నియంత్రించాలని, గుర్తింపు కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా ఏఐఎస్ఎఫ్ ఖమ్మంజిల్లా సమితి ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ జిల్లా విద్యాశాఖాధికారి రవిబాబుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మడుపల్లి లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు అనుమతులు లేకపోయినా అడ్మిషన్లు చేస్తూ కోట్ల రూపాయలు దండుకుంటున్నారన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం కాకుండానే కొన్ని ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలు తరగతులు ప్రారంభించారని వాటిని ఎలా ప్రారంభిస్తారని ఆయన ప్రశ్నించారు. అడ్మిషన్లు అయిపోయినట్లు కొన్ని కళాశాలలు బోర్డులు పెట్టడం బాధాకరమన్నారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు ఫీజుల మోతలు మోగిస్తున్న జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ చోద్యం చూస్తున్నారు తప్ప చర్యలు తీసుకోవడం లేదన్నారు. అకాడమీల పేరుతో ఇంటర్మీడియట్ అడ్మిషన్లు చేస్తూ ఫీజుల మోత మోగిస్తున్న పట్టించుకోవడం లేదన్నారు. గుర్తింపు లేని కళాశాలలపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలను నియంత్రించడంలో ప్రభుత్వం కాని అధికారులు కాని ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తుందన్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టిసారించి అధిక ఫీజులు వసూలు చేస్తున్న కళాశాలలు, అనుమతులు లేకపోయినా కళాశాలలు నిర్వహిస్తున్న వాటిపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్లు, మూత్రశాలలు ఏర్పాటు చేయాలని, సకాలంలో పుస్తకాలు అందించాలని, శిథిలావస్థకు చేరుకున్న భవనాల స్థానంలో కొత్త భవనాలను నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించని యెడల ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఆఫీస్ బేరర్స్ నాగులమీరా, శివ, వంశీ, నాయకులు హరికృష్ణ, సతీష్, నరేష్, పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణతోనే మానవాళికి ప్రయోజనం

పెద్ద ఎత్తున మొక్కలు నాటాలి
ఇంకుడు గుంతలు, మరుగుదొడ్లు నిర్మించుకోవాలి
కలెక్టర్ పమేలా సత్పతి





**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని, తద్వారా మానవాళికి ఎంతో ప్రయోజనం కలుగుతుందని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కరీంనగర్ రూరల్ మండలం చామనిపల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సంధర్బంగా వారు మొక్కలు నాటారు. ప్రతి ఇంట్లో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసుకోవలని, కూరగాయల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. అలాగే ఇంకుడు గుంతలు, మరుగుదొడ్లు నిర్మించుకోవాలని, పచ్చదనం పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. ఎక్కడపడితే అక్కడ గ్రామాల్లో చెత్తను పడేయవద్దని సూచించారు. పర్యావరణ పరిరక్షణ కోసం ఉపాధిహామీ పథకం ద్వారా అనేక పనులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. సమావేశంలో డీఆర్డీవో శ్రీధర్, డిపివో రవీందర్, ఎంపిపి తిప్పర్తి లక్ష్మయ్య, యూనిసెఫ్ జిల్లా కో ఆర్డినేటర్ కిషన్ స్వామి, ఎంపిడివో సంజీవరావు, ఎంపివో జగన్మోహన్ రెడ్డి, ఈజీఎస్ ఏపివో శోభారాణి, ఉపాధిహామీ కూలీలు, తదితరులున్నారు.

## నకిలీ విత్తనాలు.. నిషేధిత గడ్డిమందు సీజ్

ముగ్గురు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు
ఎస్పి రాహుల్ హెగ్డే



**ప్రజాపక్షం/సూర్యాపేటప్రతినిధి:** నకిలీ విత్తనాలు, ప్రభుత్వ నిషేధిత గడ్డిమందును విక్రయిస్తుండగా తిరుమలగిరి, అర్వపల్లి మండల పోలీసులు, టాస్క్ ఫోర్స్ అధికారులు ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. వారి నుండి 74.కేజీల నకిలి పత్తి విత్తనాలు, 300 లీటర్ల నిషేధిత గడ్డి మందును స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను జిల్లా ఎస్పి రాహుల్ హెగ్డే బుధవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. తిరుమలగిరి పట్టణానికి చెందిన సంకేనపల్లి సోమిరెడ్డి, ఈదులపర్రెతండాకు చెందిన గుగులోతు ప్రేమ్ కుమార్‌లు ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్ర నుండి భారీగా నకిలి విత్తనాలు, ప్రభుత్వ నిషేధిత గడ్డి మందును తీసువచ్చి విక్రయిస్తుండడంతో పట్టుకున్నట్లు తెలిపారు. వీరికి గుంటూరు జిల్లాకు చెందిన నాగమల్లేశ్వర్ రావు, పట్టణానికి చెందిన అనంతరెడ్డిలు నకిలీ విత్తనాలను తక్కువ ధరకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. వాటిని వీరు కొనుగోలు చేసి రైతులకు అధిక ధరలకు అమ్ముతూ సోమ్ము చేసుకుంటున్నారని చెప్పారు. ప్రస్తుతం వీరికి విత్తనాలు సరఫరా చేస్తున్నా నాగమల్లేశ్వర్ రావు, అనంతరెడ్డిలు ఫరారీలో ఉండగా సోమిరెడ్డి, ప్రేమ్ కుమార్‌ను అదుపులో తీసుకున్నట్లు తెలిపారు. పక్కా సమాచారంతో దాడులు చేస్తున్నట్లు చెప్పారు. సీజ్ చేసిన నకిలీ విత్తనాలు, గడ్డిమందు విలువ రూ. 3.5లక్షలు ఉంటుందని తెలిపారు.వారి వద్ద 22 కేజీల నకిలీ పత్తివిత్తనాలు స్వాదీనం చేసుకున్నామని దీని విలువ 66వేలు ఉంటుందని తెలిపారు. ఎవరైన నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే 8712686026 వాట్సాప్ నెంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. వివరాలు అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ సమావేశంలో సూర్యాపేట డిఎస్పి రవి, ఎస్సైలు, పాల్గొన్నారు.

## పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహించాలి

కలెక్టర్ ఎస్ వెంకట్రావ్




**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** ఈనెల 9న జరగనున్న గ్రూప్1పరీక్షలను పకడ్బందిగా నిర్వహిచేందుకు అధికారులు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్ వెంకట్రావ్ ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో టిఎస్‌పిఎస్ గ్రూప్1 పరీక్ష నిర్వహణపై చీఫ్ సూపరింటెండెంట్, రూట్ అధికారులు, బయోమెట్రిక్, ఇన్వీజిలెటర్లు, ఫ్లైయింగ్ స్కాడ్‌లతో అదనపు కలెక్టర్ ప్రియాంక, అదనపు ఎస్‌పి నాగేశ్వర్ రావుతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 9న ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. వికలాంగుల కోసం ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలన్నారు. స్ట్రాంగ్‌రూం నుండి పరీక్ష కేంద్రానికి, తిరిగి పరీక్ష కేంద్రం నుండి స్ట్రాంరూం వరకు పరీక్ష సామాగ్రి తరలించడంలో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. సూర్యాపేటలో ఏర్పాటు చేయనున్న 32 కేంద్రాల్లో 9725 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. 10:15 గంటల తరువాత అభ్యర్థులను కేంద్రంలో ఎట్టిపరిస్థితిలో అనుమతించేది లేదన్నారు. పరీక్ష కేంద్రాల్లో ఎలక్ట్రానిక్ వాచ్, ట్యాబ్, పెన్‌డ్రైవ్‌లు, ఫౌచ్, రైటింగ్ ఫ్యాడ్లు, కాలిక్యూలెటర్లు, బూట్లుతో పాటు ఎలక్ట్రానికి వస్తువులను అనుమతించవదన్నారు. సిబ్బంది ఉదయం 8:00 గంటల వరకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. అదనపు ఎస్పి నాగేశ్వర్ రావు మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జెడ్‌పి సిఇఓ అప్పారావు, డిఇఓ అశోక్, ఎస్‌వి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్, కోఆర్డినేటర్ వెంకటేశం, పరీక్షల విభాగం పర్యవేక్షకులు పద్మారావు పాల్గొన్నారు.

## జగదీష్‌రెడ్డి గెలుపు అనైతికం



**ప్రజాపక్షం/సూర్యాపేట ప్రతినిధి:** శాసన సభ ఎన్నికల్లో మాజీ మంత్రి జగదీష్ రెడ్డి గెలుపు అనైతికమని మాజీ మంత్రి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్ చార్జీ రాంరెడ్డి దామోదర్ రెడ్డి అన్నారు. రూ. 100 కోట్ల ఖర్చు చేసి ఓటర్లను ప్రలోభ పెట్టి ఎమ్మెల్యేగా గెలిచాడని ఆరోపించారు. నేడు పార్లమెంట్ ఎన్నికల ఫలితాలకు బాధ్యత వహిస్తూ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓట్లు పడవని జగదీష్ రెడ్డి పదే పదే చేసిన వాఖ్యలకు తాను బిఆర్ఎస్ అభ్యర్థి కంటే కాంగ్రెస్ అభ్యర్థికి నియోజకవర్గంలో ఎక్కువ ఓట్లు వస్తే రాజీనామా చేస్తావా అంటూ సవాల్ చేశానని గుర్తు చేశారు. నైతిక విలువలు ఉంటే ఆయన తక్షణమే రాజీనామా చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రజారంగక పాలన చూసి ప్రజలు పార్లమెంట్ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థి కుందూరు రఘువీర్ రెడ్డికి అఖండ విజయాన్ని అందించారన్నారు. సూర్యాపేట నియోజకవర్గంలో లక్ష 3వేలకు పైగా ఓట్లు రాగా 70వేల ఓట్ల మెజార్టీ వచ్చిందని చెప్పారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రశ్నించే గొంతుక తీన్మార్ మల్లన్న గెలుపు ఖాయమన్నారు. త్వరలో ఇందిరమ్మ కమిటీలు వేస్తామన్నారు. పారదర్శకమైన పాలన అందించేందుకు సిద్ధంగా ఉన్నాయమని స్పష్టం చేశారు. ప్రజలు ఏ కష్టం వచ్చిన వారు చెప్పుకునేందుకు 24 గంటలు తన ఇంటి గేట్లు తెరచే ఉంటాయని చెప్పారు. తప్పు చేసిన ఎవరిని కూడా వదిలి పెట్టేది లేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల ఫలితాలతో రాష్ట్రంలో బిఆర్ఎస్ ఉనికే లేకుండా కనుమరుగైందన్నారు. ఈ సమావేశంలో ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తంరెడ్డి, రాష్ట్ర నాయకులు కొప్పుల వేణారెడ్డి, చివ్వెంల, పెన్‌పహాడ్ మండల పార్టీ అధ్యక్షులు ధరావత్ వీరన్న నాయక్, తూముల సురేష్ రావు, పట్టణ అధ్యక్షులు అంజద్ అలీ, నాయకులు కాకి కృపాకర్ రెడ్డి, వాసుదేవరావు పాల్గొన్నారు.


## వైద్య విద్యలో మెరిసిన సంకాపురం ఆణిముత్యం



**ప్రజాపక్షం/అయిజ :** మండల పరిధిలోని సంకాపురం గ్రామానికి చెందిన కుర్వ లింగన్న కుమారుడు కె.వేణుగోపాల్ మంగళవారం విడుదలైన నీట్ పరీక్ష ఫలితాల్లో 720 మార్కులకు గాను 621 మార్కులు సాధించి ఆల్ ఇండియా ర్యాంక్‌లో ప్రతిభ కనపరిచాడు అందుకు గాను మాజీ సింగిల్ విండో అధ్యక్షులు సంకాపురం రాముడు దంపతులు వేణుగోపాల్‌ను శాలువతో సన్మానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య విద్యలో మంచి ర్యాంకు సాధించి తల్లి దండ్రులకు,గ్రామానికి మంచిపేరు సాధించాడని, భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అలాగే గ్రామస్తులు అభినందించారు

## తండ్రికి తగ్గ తనయులు.. జానా కొడుకులు


ఒకరు ఎంపి.. మరొకరు ఎంఎల్ఎ ...!



**ప్రజాపక్షం/హాలియా:** సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న కుందూరు జానారెడ్డి తనయులు ఆయనకు తగ్గట్లుగా రాజకీయ వారసత్వాన్ని పునికిపుచ్చుకొని ఒకరు ఎంపి మరొకరు ఎంఎల్ఏగా రాజకీయ రంగ ప్రవేశం చేసి భళా అనిపిస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సుదీర్ఘమైన సీనియర్ నాయకుడిగా అనేక మంత్రి పదవులు అనుభవించి... తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ఒక రాజకీయ ఉద్దండడుగా తనదైన శైలిలో తన మార్కు రాజకీయంతో తెలంగాణ ప్రజలకు తలలో నాలుకల చిరకాలం గుర్తిండిపోయే రాజకీయ ప్రస్తానాన్ని కొనసాగిస్తున్నారు కుందూరు జానారెడ్డి. జానా రెడ్డికి ఉన్న ఇద్దరు తనయులు రాజకీయంలో కొనసాగుతూ పలు సందర్భాల్లో తండ్రి గెలుపులో కీలక పాత్ర పోషిస్తూ వస్తున్నారు. వయసు మీద పడడం రాజకీయంగా యువతకి ప్రాధాన్యం అన్న మాటకు కట్టుబడి ఉన్న జానారెడ్డి మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తన చిన్న కుమారుడు కుందూరు జైవీర్ రెడ్డిని ఎంఎల్ఏ బరిలో నిలిపి గెలిపించారు. అనంతరం తన పెద్ద కుమారుడు అయిన కుందూరు రఘువీర్ రెడ్డిని కూడా నల్గొండ ఎంపి బరిలో నిలిపి విజేతగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో గెలిపించి చిరకాలం గుర్తుండి పోయాల ఆయన రాజకీయ ప్రస్తానాన్ని ప్రారంభింపజేశారు. తాను ప్రత్యక్ష రాజకీయంలో ఇక కొనసాగలేనని పరోక్షంగా తన రాజకీయ అనుభవాన్ని రంగరించి తన ఇద్దరు కుమారులను ఒకే దాఫాలో ఒకరిని ఎమ్మెల్యే మరొకరిని ఎంపీగా రాష్ట్ర ప్రజలకు అందించిన ఘనత జానారెడ్డికే దక్కుతుంది. కాంగ్రెస్ పార్టీలో యువతకే ప్రాధాన్యమిస్తున్న సంగతి విధితమే. ఈ క్రమంలోనే ఎన్నో రాజకీయ ఒడిదుడుకులను ఎదుర్కొన్న జానారెడ్డి తన కుమారులను రాజకీయ రంగ ప్రవేశం ఘనంగా ప్రారంభించేలా చేయడం ఆయనకే సాధ్యమైందని చెప్పాలి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ఒక ఎంపి స్థానంలో ఐదు లక్షల పైగా ఓట్లతో గెలుపొందిన ఘనత ఈ ఎన్నికల్లో కుందూరు రఘువీర్ రెడ్డికే దక్కింది. దీపం ఉండగానే ఇల్లు చక్క దిద్దిన చందంగా జానారెడ్డి తను రాజకీయాల్లో పరోక్షంగా కొనసాగుతూ ప్రత్యక్ష రాజకీయాల్లోకి తన ఇద్దరు కుమారులకి ఒక స్థానాన్ని కల్పించి తండ్రిగా తన బాధ్యత వహించిన తీరు అందరికీ ఆదర్శనీయమనే చెప్పాలి.

## కార్ల పేరుతో బిల్లుల చేతివాటం

యాదగిరిగుట్ట ఆలయ అధికారుల కక్కుర్తి
రూ.99వేలు అదనంగా అధికారుల నొక్కుడు
సొంత కార్లల్లో తిరుగుతూ ఆలయ ఆదాయానికి గండి



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట:** తెలంగాణకే తనమానికంగా వెలుగొందుతున్న యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహా స్వామి వారి దేవస్థానంలో అవినీతి కంపు కొడుతుంది. కంచె చేను మేసిన తీరుగా ఇక్కడి అధికారులు అద్బె కార్ల పేరుతో కక్కుర్తి పడుతున్నట్లు సమాచారం. అద్దె వాహనాల పేర్లతో అందినకాడికి ఆలయ అధికారులు స్వంత కార్లతో అవినీతికి పాల్పడుతున్నారు. ఆలయానికి సంబంధించి వచ్చే ఆదాయంలో నుంచి గండి కొడుతున్న అడిగేనాథుడే లేక అవినీతిలో ఇక్కడి అధికారుల చేతివాటం శృతిమించుతోంది. దేవస్థానం ఉన్నతాధికారులుగా కొనసాగుతూ ఆలయ ఆదాయానికి ఇలా గండీ కొట్టడం సరైంది కాదని స్థానికులు మండిపడుతున్నారు. యాదగిరిగుట్ట ఆలయ ఉన్నతాధికారుల కొందరు అద్దె కార్ల పేరుతో బిల్లులు పొందుతున్నట్లు స్థానికంగా ఆరోపణలు గుప్పుమంటున్నాయి. వ్యక్తిగత వాహనాలపై హైదరాబాద్ నుంచి యాదగిరిగుట్టకు కార్లల్లో అప్ అండ్ డౌన్ చేస్తూ ఆలయ ఆదాయం నుంచి నెలకు రూ.99,000 బిల్లులు పొందుతున్నారు. ఇందులో ఔట్సోర్సింగ్ వ్యక్తిని డ్రైవరుగా ఒక అధికారి నియమించుకోగా మరో ఇద్దరు అధికారులు మాత్రం సెల్ఫ్ డ్రైవింగ్ చేసుకుంటూ బిల్లులు స్వాహా చేస్తున్నారు. ఇటీవల వీరికి కొండపైకి వెళ్లి కిందకు వచ్చేందుకు మాత్రమే దేవస్థానం వాహనాన్ని అనుమతి ఉన్నట్లు తెలుస్తోంది. కానీ, వీరు హైదరాబాద్ నుంచి ఇక్కడకు వ్యక్తిగత కారులోనే అప్ అండ్ డౌన్ చేసు ఉండగా అందుకు అయ్యే ఖర్చును మాత్రం ఆలయ ఖజానా నుంచే ఈ అధికారులు ప్రతి నెల గుట్టుగా నొక్కేస్తున్నారు,ఈ ముగ్గురిలో ఒక్కొక్క అధికారి రూ.33,000 బిల్లులు స్వాహా చేస్తుండగా ప్రతి నెల మొత్తం రూ.99,000 వెహికల్ అలవెన్స్ పేరుతో దోపిడి జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ముగ్గురు అధికారులు తమ స్వంత కార్లలోనే తిరుగుతూ ఆలయ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఈ వ్యవహారం ఇప్పటి వరకు దేవదాయ శాఖ అధికారులకు తెలియదా...! ఒకవేళ తెలిసిన గుట్టు చప్పుడు కాకుండా ఖజానాకు గండి కొతుదున్నారా..! అనే చర్చ సాగుతోంది. ఎవరు గుర్తించకుండా గుట్టుగా ఇక్కడి అధికారులు అద్దె కార్ల పేరుతో అవినీతి సొమ్ము ఇలా మేసేస్తున్నారు. భక్తులకు ఏర్పాటు చేయాల్సిన సదుపాయాల పట్ల ఆహర్నిశలు కృషి చేస్తున్న ఆలయ ఈవో వెనకాల ఇంత పెద్ద ఎత్తున గుట్టుగా సాగుతున్న అవినీతికి పాల్పడిన ఈ ముగ్గురు అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఇప్పటి వరకు అక్రమంగా అద్దె కార్ల పేరుతో ఖాజేసిన నగదును రికవరి చేయాలని దేవదాయ శాఖ కవి షనర్ను స్థానికులు కోరుతున్నారు.

## నీట్‌లో 'అల్ఫోర్స్' అఖండ విజయం



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : నీట్2024 ఫలితాలలో అల్ఫోర్స్ విద్యార్థులు అత్యద్భుత మార్కులు సాధించారు. ఎన్.హేమంత్ 691 మార్కులు సాధించగా వి.హాసిని 671, డి.పూజిత 650, ఎన్.కౌశిక్ రెడ్డి 647, పి.అక్షర రెడ్డి 639, వి.శ్రీముఖి 619, మరియాసభ 619, ఎ.శ్రీవర్షిని 613, యం.కమాలికాప్రీతి 613, ఎన్.జ్ఞానద 604, ఎ.అమరేందర్ 598, బి.హాసిత 595, కె.శ్రీవిద్య 582, యండి.అఫ్ఘాన్ ఖాన్ 579, ఎన్.సాయి ప్రతిజ్ఞ 573, యం.ప్రతిమ 571, పి.శ్రీనాథ్ 566, షేక్ ఉమ్రా 561, తేజస్విని 560, మహనీ నజ్మీన్ 560 మార్కులు సాధించారు. కె.సుహృదాఘువ పిడబ్ల్యుడి కేటగిరిలో జాతీయ స్థాయిలో 675వ ర్యాంకు సాధించాడు. నీట్ కోచింగ్‌లో డాక్టర్స్30 ప్రత్యేక ప్రోగ్రామ్ ద్వారా కోచింగ్‌ను అందించిన రెండవ సంవత్సరంలో అల్ఫోర్స్ విజయ పరంపర కొనసాగుతుంది. 10 మంది విద్యార్థులు 600 ఆపై మార్కులు 20 మంది విధ్యార్థులు 560 ఆపై మార్కులు, 41 మంది విద్యార్థులు 500 ఆపై మార్కులు సాధించడం విశేషం, సుమారుగా 130 మంది విధ్యార్థులు వివిధ ప్రతిష్టాత్మక మెడికల్ కళాశాలలో సీట్లు సాధించగలరని తెలియజేశారు. రాబోయే కాలంలో అత్యధిక మంది విధ్యార్థులను మెడికల్, ఐఐటి, ఎన్‌ఐటిలలో సీట్లు సాధించే విధంగా తీర్చిదిద్దుతామని తెలియజేశారు. ర్యాంకులు సాధించిన విధ్యార్థులు అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి అభినందించారు. విజయానికి తోడ్పడిన అధ్యాపక, అధ్యాపకేతర బృందానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## ట్రినిటీ విద్యార్థుల విజయకేతనం



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : నీట్2024 ఫలితాల్లో ట్రినిటీ కళాశాలల విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారు. ఈ సంధర్భంగా విధ్యార్థులను ట్రినిటీ విద్యాసంస్థల వ్యవస్థాపక చైర్మన్, పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, ట్రినిటీ కళాశాలల చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డిలు ప్రత్యేకంగా అభినందించి మాట్లాడారు. సాధారణ విద్యార్థులతో పటిష్టమైన ప్రణాళికతో ఒత్తిడి లేని విద్యావిధానంతో ఈ ర్యాంకులు సాధించడం వీలైందని తెలిపారు. ట్రినిటీ కళాశాలలో విద్యనభ్యసించిన ముసాబ్ హుస్సేన్ 685 మార్కులు సాధించారు. అదే విధంగా ఉత్తమ మార్కులు పొందిన విద్యార్థులు బి.నిఖిల్ 681, సయ్యద్ ముజకిర్ అలీ 676, ఎం.శశాంక్ 671, ఎ.ఆదిత్య 670, ఎ.కరణ్ సింగ్ 667, పి.సందీప్ కుమార్ 665 , ఆర్.అజిత్ కుమార్ 657, వివేక్ సిద్దార్థ్ 655, ఎస్.మాళవిక 651, ముజమ్మిల్ ఖాన్ 633, వి.స్ఫూర్తి 599, జె.కీర్తన 582, వి.రాహుల్ 567, సహరిష్ ఐమన్ 558, ఎన్.గంగశ్రీ 542, ఆర్.అలేఖ్య 538, ఎం.శ్రీజ 538, పి.ప్రణయ్ 537, సిహెచ్ విఘ్నేష్ 536, అయేషా మహజబీన్ 535, వై.అశ్లేష 532, పి.శ్రీదీప 523, హెచ్.కులకర్ణి 522, సిహచ్ సాయి మోహిత్ రెడ్డి 507, ఎస్.గౌస్ పాషా 505 మార్కులు సాధించారు. ఇవే కాకుండా మరెన్నో మార్కులను విద్యార్థులు సాధించారని, రాబోయే కాలంలో మరింత మెరుగైన ఫలితాల కోసం కృషి జరుగుతుందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్స్, అధ్యాపకబృందం, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఎల్‌ఒసి అందజేసిన ప్రభుత్వ విప్



ప్రజాపక్షం / ధర్మపురి : జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం దొంతాపూర్ గ్రామానికి చెందిన గజ్జెల రాజేశం అనారోగ్యంతో హైదరాబాద్ లోని నిమ్స్‌లో చేరగా బాధితుడి చికిత్సకై ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అండగా నిలిచారు. ఈ మేరకు బుధవారం రాజేశం కుటుంబ సభ్యులకు రూ.లు 2లక్షల 10వేల ఎల్‌వోసిని చికిత్స నిమిత్తం అందజేశారు.

## అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత



ప్రజాపక్షం/ ముత్తారం : అక్రమంగా తరలిస్తున్న పిడిఎస్ బియ్యాన్ని ఎస్సై మధుసూదన్ రావుతో పాటు సివిల్ సప్లై అధికారులు కలిసి ముత్తారం ప్రధాన చౌరస్తా వద్ద పట్టుకున్నట్లు ముత్తారం ఎస్సై మధుసూధన్ రావు తెలిపారు. ఎస్సై తెలిపిన అలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా రవాణా చేస్తున్నారనే నమ్మదగిన సమాచారం మేరకు సివిల్ సప్లై అధికారులు, ముత్తారం పోలీసులు కలిసి వాహనంతో పాటు 100 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని బుధవారం పట్టుకోవడం జరిగిందన్నారు. బుధవారం జమ్మికుంట పరిధిలోని మోతుల గూడెం గ్రామానికి అంబాల అనిల్ అనే వ్యక్తి చెందిన వాహనం నెంబర్ TS05 UB3197 వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా వాహనంలో 100 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పెద్దపల్లి జిల్లా కి చెందిన ఆంజనేయులు జుక్కల్ గ్రామం చిట్యాల మండలం తరలిస్తుండగా సివిల్ సప్లై అధికారులు, ముత్తారం ఎస్సై మధుసూదన్ రావు కలిసి ముత్తారం ప్రధాన రహదారిపై పట్టుకోవడం జరిగిందన్నారు. అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేయడం జరిగిందని ముత్తారం ఎస్సై మధుసూధన్ రావు తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాశీంపల్లి తోపాటు చుట్టుపక్కల గ్రామాలలో తక్కువ ధరకు వసూలు చేసిన రేషన్ బియ్యం అధిక ధరకు అమ్ముకొని అక్రమ బాటలో డబ్బులు సంపాదించుకోవాలని సమ్మయ్య తోపాటు మరికొందరి ని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మధుసూధన్ రావు నాయక్ తెలిపారు.

## మొక్కలు నాటిన జిఎం




ప్రజపక్షం/రామగిరి : ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్నిపురస్కరించుకుని ఏ.ఎల్.పీ గనీ ఆవరణ లోబుధవారం జరిగిన కార్యక్రమము నందు పర్యావరణ ప్రతిజ్ఞ నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి ఏ.పీ.ఏ ఏరియా జనరల్ మేనేజర్ కె.వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.అనంతరం గని ఆవరణ లో మొక్కలను నాటారు.సింగరేణి సంస్థ ఛైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. బలరామ్,ఐఆర్ఎస్ పర్యావరణం పై విడుదల చేసిన సందేశ పత్రాన్ని అందరికీ అందజేసి,చదివి వినిపించారు.ఈ సందర్భంగా జీ.ఎం మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవడం మన అందరి బాధ్యత అని, మనమంతా ఒక్కటై రాబోయే తరాలకు మంచి ప్రకృతినీ అందించడానికి కృషి చేయాలని ప్రతి ఒక్కరు మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని అన్నారు.కార్యక్రమం లో ప్రాజెక్ట్ అధికారి కె.నాగేశ్వర రావు, ప్రాజెక్ట్ ఇంజినీర్ టి. రఘు రాం, ఎస్ వో ఎం లు కె. జనార్దన్, ఎం.తిరుపతి తో పాటు ఇతర అధికారులు,ఉద్యోగులు పాల్గొన్నారు.

## మైనార్టీ కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలి

### ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య




ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో వివిధ విభాగాల్లో పనిచేసే నాన్ టీచింగ్ కార్మికుల సమావేశం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో మీరజ్ హుస్సేన్ అధ్యక్షతన జిల్లా జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సంధర్భంగా ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య మాట్లాడుతూ రాష్ట్రంలోని మైనార్టీ కార్మికులకు ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించి ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయడం లేదని, దీనివల్ల చాలా మంది కార్మికులు చాలీచాలని జీవనం కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈపిఎఫ్ సౌకర్యం, ఇన్సూరెన్స్ సౌకర్యం, అధికారుల వేధింపులు అరికట్టాలని, 2024–25 నూతన విద్యాసంవత్సరంలో గతంలో పనిచేసినటువంటి కార్మికులందరినీ విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ గత ప్రభుత్వానికి అనేక సమస్యలపై విన్నవించామని తెలిపారు. కానీ ఇప్పటి వరకు ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనేక ఆశలతో ఈ ప్రభుత్వానికి కార్మిక లోకం మద్దతు తెలిపిందని, కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, ఉద్యోగ భద్రత కనీస వేతనం వెంటనే కల్పించుటకు తగు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐటియుసి జిల్లా అధ్యక్షుడు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, ఎలకపల్లి శ్రీకాంత్, మీరజ్ హుస్సేన్, స్రవంతి, నజీర్, స్వప్న, అరుణ, బేగం, ప్రవీణ్, సరస్వతి, ఎస్‌కె ఆనంద్, హమీద్, ఖలీల్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లా మైనార్టీ నాన్ టీచింగ్ కార్మికుల కన్వీనర్‌గా ఎలుకపెల్లి శ్రీకాంత్, కో కన్వీనర్‌గా మీరజ్ హుస్సేన్‌లతో పాటుగా 21 మంది కమిటీ సభ్యులను ఎన్నుకోవడం జరిగిందని సమ్మయ్య తెలిపారు.

## ఏళ్ల తరబడి సాగుతున్న బాబ్లీ కేసు విచారణ

### విచారణకు హాజరైన ఎమ్మెల్యేలు



ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : బుధవారం మహారాష్ట్రలోని బిలోలి సేషన్ కోర్టులో బాబ్లీ కేసు విచారణకు పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే హన్మంతు షిండేలు హాజరయ్యారు. ఈ సందర్భంగా పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ మహారాష్ట్ర ప్రభుత్వం గోదావరి నదిపై బాబ్లీ ప్రాజెక్టు నిర్మించి నీళ్ళు రాకుండా చేయడంతో 2010 సంవత్సరంలో టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో అప్పటి ఉమ్మడి కరీంనగర్ ఎమ్మెల్యేలము అందరం భారీ ఆందోళనలకు దిగడం జరిగిందని బాబ్లీ గేట్లు ఎత్తి నీటిని విడుదల చేసే వరకు కదలకుండా మేమందరం ఉండడంతో మహారాష్ట్ర పోలీసులు అప్పటి టిడిపి నాయకులపై లాఠీ ఛార్జి చేసి చంద్రబాబుతో సహా మా పై కేసులు నమోదు చేశారన్నారు. ఆ కేసుల విచారాలలో భాగంగా ఏళ్ల తరబడి మా వాదనలు వినిపించడం జరుగుతుంది అని అన్నారు. ఇలాంటి కేసులు తమపై ఎన్ని మోపిన ప్రజల కోసం నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తా

### పెద్దపల్లి ఎంపి గడ్డం వంశీకృష్ణ



ప్రజాపక్షం / చెన్నూర్ : పెద్దపెల్లి నియోజకవర్గ ప్రజలకు తాత మాజీ కేంద్ర మంత్రి వెంకటస్వామి, స్థానిక ఎంఎల్‌ఏ నాన్న వివేక్ పైన ఉన్న అభిమానంతోనే నియోజకవర్గ ప్రజలు నన్ను అధిక మెజారిటీతో గెలిపించారని పెద్దపెల్లి ఎంపి గడ్డం వంశీకృష్ణ అన్నారు. బుధవారం మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంఎల్‌ఏ వివేక్ వెంకటస్వామితో ఆయన పాల్గొని మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా ఎటువంటి పదవులు లేనప్పటికీ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేసిన వివేక్ వెంకటస్వామితో పాటు తాత వెంకటస్వామి హయాంలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ప్రజలు తనను ఆదరించి అభిమానించి ఎంపిగా విజయం సాధించడానికి దోహద పడిందని ఆయన అన్నారు. తనపై నమ్మకంతో కాంగ్రెస్ పార్టీ అధిష్టానం యువకులకు టికెట్ కేటాయించడం నా అదృష్టమని, నాపై నమ్మకంతో నా విజయానికి కృషి చేసిన ప్రతి నాయకునికి, కార్యకర్తకు తగిన న్యాయం చేస్తానని ఆయన అన్నారు. నియోజకవర్గంలో ఇండస్ట్రీని ప్రారంభించి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా కృషి చేస్తానని, కాలేశ్వరం ప్రాజెక్టుతో నష్టపోతున్న రైతులకు కూడా తగిన న్యాయం చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. మొన్నటి వరకు నియోజకవర్గంలో నియంత పాలన ఉండేదని, ప్రస్తుతం ప్రజా పాలన ఉందని ప్రజలు ఏ సమస్య వచ్చిన నిర్భయంగా తన దృష్టికి తీసుకువస్తే నాన్న సహకారంతో పరిష్కరిస్తానని ఆయన అన్నారు. అనంతరం స్థానిక ఎంఎల్‌ఏ వివేక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బిఆర్ఎస్ కథ ముగిసిందని, దేశంలో కూడా నరేంద్ర మోడీ నియంత పోకడలతో నల్లేరు మీద నడకలాగా బిజెపి విజయం సాధించిందని, దేశంలోని ప్రజలకు కాంగ్రెస్ పై నమ్మకం ఉందని అందుకే బిజెపికి పోటీగా కాంగ్రెస్ పార్టీ సీట్లు సాధించిందని ఆయన అన్నారు . వంశీ గెలుపు కోసం పనిచేసిన ప్రతి నాయకునికి కార్యకర్తకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు సూర్యనారాయణ, కోటపల్లి మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజమల్ల గౌడ్, రాజిరెడ్డి బాపిరెడ్డి, సుశీల్ కుమార్, నాగరాజ్, శ్రీధర్ పాల్గొన్నారు.

## జీవో నెంబర్ 60 ప్రకారం జీతాలు చెల్లించాలి



ప్రజాపక్షం/ఆసిఫాబాద్ ప్రతినిధి : గ్రామపంచాయతీ కార్మికులందరికీ జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దుచేసి, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శిగా నియమించాలని, పెండింగ్లో ఉన్న వేతనాలు చెల్లించి ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎఐటియుసి ఆధ్వర్యంలో మంత్రి సీతక్కకి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసఫ్, జిపిడబ్ల్యు రాష్ట్ర అధ్యక్షులు నర్సింహారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ జయ చంద్ర, ప్రధాన కార్యదర్శి బి. వెంకట రాజ్యం, ఎఐటియుసి కొమరం భీం జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్, జిపిడబ్ల్యు ఆర్ఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచంద్రయ్య, జిల్లా కమిటీ సభ్యులు రవి తదితరులు పాల్గొన్నారు.

## జూనియర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

### ఎఐఎస్ఎఫ్ నాయకుల డిమాండ్



ప్రజాపక్షం/జగిత్యాల జిల్లా ప్రతినిధి : అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఎఐఎస్ఎఫ్) జగిత్యాల జిల్లా సమితి ఆధ్వర్యంలో ఇంటర్ విద్యాధికారి కార్యాలయంలో డిఐఇఒ రవీందర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సమీర్, అక్రమ్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉన్నటువంటి సమస్యలు పరిష్కరించాలని, ప్రయివేట్, కార్పోరేట్ కళాశాల్లో వసూలు చేస్తున్న అధిక ఫీజులను నియంత్రించి, జిల్లాలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలల సమస్యలను పరిష్కరించి, ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులు భర్తీ చేసే విధంగా చర్యలు చేపట్టాలని పేద మధ్య తరగతి విద్యార్థులకు అందుబాటులో ఉండేలా ప్రభుత్వ కళాశాలలు అభివృద్ధి పరచాలని, నాణ్యమైన విద్య అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అట్లాగే ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నారని, కనీసం ఫీజుల బోర్డు ఎక్కడ ఏర్పాటు చేయడం లేదని, పిల్లలకు ప్లే గ్రౌండ్, పిఈటిలు, లైబ్రరీలు కూడా లేరని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జగిత్యాల జిల్లా కార్యదర్శి అక్రమ్ మాలిక్, అధ్యక్షులు సమీర్, పట్టణ అధ్యక్షులు శివ సాయి రెడ్డి, నాయకులు విజయ్, అనిల్ కుమార్, రాహుల్, నాగరాజు, రామస్వామి, నాయకర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## నీట్ ఫలితాల్లో ఆల్ఫోర్స్ విద్యార్థులు జయకేతనం



ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ : అల్ఫోర్స్ విద్యాసంస్థలు సంచలన ఫలితాలను మారుపేరని, నాణ్యమైన విద్యకు మారుపేరని అందుకు నిదర్శనం వివిధ ఫలితాలలో అగ్రగామిగా ఉండడమే అని అల్ఫోర్స్ విద్య సంస్థల అధినేత డా.వి.నరేందర్ రెడ్డి ఫోన్ ద్వారా నిన్న ప్రకటించిన నీట్ 2024 ఫలితాల్లో స్థానిక నిర్మల్లోని నీట్ అకాడమీకి చెందిన విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.జాతీయస్థాయి అత్యుత్తమ మార్కులతో జయకేతనం ఎగురవేసిందని తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో రాథోడ్ స్వాతి 480 మార్కులు,3555 జాతీయ ర్యాంకు,సిద్రషకీపీన్ 420 మార్కులు సాధించినదని చెప్పారు.జాతీయ స్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించినందుకు గాను వారికి అభినందనలను తెలిపారు.విజయానికై అహర్నిహలు కృషి చేసినటువంటి అధ్యాపకులకు,నిరంతరం ప్రోత్సాహం అందిస్తున్న తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలియజేశారు.భవిష్యత్తులో మరిన్ని విజయాలను సాధించి కీర్తిప్రతిష్ఠలను పెంపొందించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రజల ఆశీర్వాదంతోనే భారీ మెజారిటీ

### ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్



ప్రజాపక్షం/భైంసా : ముధోల్ నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదంతోనే పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపికి భారీ మెజార్టీ వచ్చిందని ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ అన్నారు. బుధవారం భైంసాలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడురు. అసెంబ్లీ ఎన్నికల కంటే పదిహేను వేల మెజారిటీ అధికంగా వచ్చిందని, ముధోల్ నియోజకవర్గం నుండి 38 వేల మెజార్టీ ఇవ్వడం కార్యకర్తల కృషేనని వెల్లడించారు. ఎంపి గెడం నగేష్ గెలుపు కోసం ఆహో రాత్రులు శ్రమించిన కార్యకర్తలకు కృతజ్ఞతలు చెప్పారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత మొదటి ఎన్నికల్లో ఇంత పెద్ద మెజార్టీ ఇవ్వడం తనకు ప్రజలు మరింత బాధ్యత పెంచారన్నారు. ముగ్గురు మాజీ ఎమ్మెల్యేలు,ఇద్దరు మాజీ జిల్లా పరిషత్ చైర్మన్‌లు,ప్రస్తుత జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తో పాటు అందరు ఉన్నప్పటికీ ప్రజలు తన వైపు నిలిచారన్నారు.అధికార పార్టీలో ఉన్నామని మాజీ ఎమ్మెల్యేలు అధికారులకు ఒత్తిడి,తెస్తే ఊరుకునేది లేదన్నారు.ప్రజలు ఓడించారని ఈ విషయాన్ని మాజీ ఎమ్మెల్యేలు గుర్తు ఎరగాలన్నారు.ఎమ్మెల్యే ఎమ్మెల్యే అనుకుంటున్నట్లు మాజీ ఎమ్మెల్యేలు వ్యవహరిస్తే ప్రజలు ఇలాంఇ గుణపాఠమే చెబుతారన్నారు.ప్రజా ఆశీర్వాదంతోనే గెలిచినవారు.చట్టసభల్లోకి వెళ్తారన్నారు.ఇకనైనా ప్రజపల తీర్పుకు గౌరవించి ప్రజా సేవ చేయాలని సూచించారు.సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ దీపం గంగాధర్,ఎంపీపీ అబ్దుల్ రజాక్,నాయకులు సాప్లీ రమేష్,వెంగళరావు,తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ.. మానవ మనుగడకు రక్షణ

### జనరల్ మేనేజర్ సంజీవరెడ్డి



ప్రజాపక్షం / శ్రీరాంపూర్ : పర్యావరణ పరిరక్షణతోనే సకల ప్రాణుల మనుగడ ఆధారపడిందని, అటువంటి పర్యావరణాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి. సంజీవరెడ్డి అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జనరల్ మేనేజర్ కార్యాలయం, ఆర్‌కె 8 డిస్పెన్సరీలలో ఉద్యోగులతో పర్యావరణ రక్షణ ప్రతిజ్ఞ చేయించి, చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ బలరాం సందేశాన్ని ఆవిష్కరించారు. అనంతరం జిఎం మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతపైనే సకల ప్రాణుల మనుగడ ఆధారపడిందని, అందుకే ప్రతి ఒక్కరు పర్యావరణ రక్షణలో ముందుండాలని పిలుపునిచ్చారు. ప్రతి పర్యావరణ పరిరక్షణ దినోత్సవం నాడు ఒక స్లోగన్ తీసుకుంటామని, ఈ సంవత్సరం స్లోగన్ నేల పునరుద్ధరణ.. ఎడారీకరణ, కరువును తట్టుకునే శక్తి అని అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో ఏరియాలో పర్యావరణ రక్షణ కోసం అనేక మొక్కలు నాటడం, వాటి పరిరక్షణ కోసం తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, పెయింటింగ్ పోటీలలో గెలుపొందిన ఉద్యోగులకు ఆయన బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఒటు జిఎం పురుషోత్తం రెడ్డి, అధికారుల సంఘం అధ్యక్షులు కె. వెంకటేశ్వర్ రెడ్డి, ఎజిఎం ఫైనాన్స్ మురళీధర్, డిజిఎం లు చిరంజీవులు, అరవింద రావు, ఎన్విరాన్మెంటల్ ఆఫీసర్ హనుమాన్ గౌడ్, డివై సిఎంఓపి రమేష్ బాబు, రక్షణ అధికారి శ్రీధర్ రావు, పర్చేజ్ అధికారి చంద్రశేఖర్, ఎస్టేట్స్ అధికారి వరలక్ష్మి , సెక్యూరిటీ ఆఫీసర్ మురళీమోహన్, కిరణ్ కుమార్, రామచందర్ పాల్గొన్నారు.

## రూ. 6. 75 లక్షల విలువైన నకిలీ విత్తనాలు స్వాధీనం



ప్రజాపక్షం/బెల్లంపల్లి : వేమనపల్లి మండలంలోని ఫెర్రీ పాయింట్ వద్ద రూ. 6, 75, 000 విలువచేసే 2. 05 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలను బుధవారం నీల్వాయి పోలీసులు పట్టుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు వ్యవసాయ అధికారులు నీల్వాయి పోలీసులు సంయుక్తంగా దాడులు చేసి ఎద్దుల బండి ద్వారా తరలిస్తున్న విత్తనాలను పట్టుకున్నారు. కోలా సాయికిరణ్ నిందితుడిని పట్టుకోగా మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రామగుండం సిపి శ్రీనివాస్ మాట్లాడుతూ నకిలీ విత్తనాల విక్రయం, రవాణాపై రామగుండం కమిషనరేట్ పరిధిలో గట్టి నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. రైతులను మోసం చేసేందుకు యత్నించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నకిలీ విత్తనాలు, నింధితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన నీల్వాయి ఎస్ఐ శ్యామ్ పటేల్, కానిస్టేబుల్ రాజేందర్, రాజశేఖర్ లను ప్రత్యేకంగా అభినందించి రివార్డ్ అందచేయడం జరిగింది. ఈ సమావేశంలో మంచిర్యాల డిసిపి అశోక్ కుమార్, అడిషనల్ డిసిపి అడ్మిన్ రాజు, జైపూర్ ఎసిపి వెంకటేశ్వర్లు, చెన్నూర్ రూరల్ సిఐ సుధాకర్, నీల్వాయి ఎస్ఐ శ్యామ్ పటేల్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## గోవుల అక్రమ రవాణాను అరికట్టేందుకు చర్యలు



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : నిర్మల్ జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం ఆన్లైన్‌లో బుధవారం రోజు నిర్వహించారు. పోలీస్ విభాగం కీర్తి ప్రతిష్టలను దిగజార్చే విధంగా వ్యవహరిస్తే సహించేది లేదని జిల్లా ఎస్పీ జానకి షర్మిల పోలీస్ అధికారులను హెచ్చరించారు. ఈ నెల 17న బక్రీద్ పండుగ సందర్భంగా తీసుకోవలసిన ముందు జాగ్రతల గురించి గోవుల అక్రమ రవాణను అడ్డుకోవడానికి తీసుకోవలసిన జాగ్రత్తల గురించి అధికారులకు పలు సూచనలు చేయడంతో పాటు ఆదేశాలు జారీ చేశారు. గోవుల రవాణా గురించి అన్ని పోలీస్ స్టేషన్‌ల పరిధిలో ముందస్తు సమాచారాన్ని సేకరించాలని తెలిపారు. భైంసా నిర్మల్ పరిధిలలో మొత్తం 10 తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. పోలీస్ శాఖకు సహాయపడేలా రెవిన్యూ అధికారులు, సిబ్బంది సహాయం తీసుకోవాలని చెప్పారు. తనిఖీ కేంద్రాలలో 24 గంటలు ఉండాలని ఆదేశించారు. గోవుల రక్షక్ సమితి నుండి కేవలం సమాచారం తీసుకోని గౌవుల రవాణాన్ని అడ్డుకోనే వారికి నమ్మకం కలిగించాలని పేర్కొన్నారు.ఎట్టి పరిస్తితుల్లో గోవుల అక్రమ రవాణాన్ని అడ్డుకోవాలని ఆదేశించారు. అట్టి రవాణా చేసే వారి పైన కేసులు నమోదు చేయాలని సూచించారు. జిల్లాలోని పోలీస్టేషన్‌లలో పెండింగులో ఉన్న కేసుల వివరాలను పోలీసు అధికారులను అడిగి తెలుసుకుని పెండింగులో ఉన్న కేసులను సత్వరమే పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలని పోలీ సు అధికారులను ఆదేశించారు. నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల అధికారులను ఉద్యేశిస్తూ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ లలో విధులు నిర్వహించే ప్రతి పోలీస్ అధికారి నీతినీజాయితీతో విధులు నిర్వహించాల్సి వుంటుందని ఆదేశించారు. ప్రతి ఒక్కరు సమయపాలన పాటిస్తూ నిరంతరం ప్రజలకు అందుబాటులో వుంటూ వారి ఫిర్యాదులను పరిష్కరించే దిశగా అధికారులు విధులు నిర్వహించాలని అన్నారు. శాంతి భద్రతలకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదులు వున్న ప్రజలు ముందుగా సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని, మీ ఫిర్యాదు పై సరైన న్యాయం జరగని పక్షంలో మాతమే ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేయాలని కోరారు.ఎదైనా ఫిర్యాదు చేయాలనుకునేవారు ఫిర్యాదుదారులు 8712659599 వాట్సప్ నంబర్‌కు మీ ఫిర్యాదులను పోస్ట్ చేయడం ద్వారా ఫిర్యాదులపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ జానకీ షర్మిల తెలియజేసారు. ఈ సమావేశంలో కాంతిలాల్, గంగారెడ్డి, డీఎస్పీ జిల్లాలో గల అందరూ సిఐలు,ఎస్ఐలు పాల్గొన్నారు.

## ధర్మపురి విద్యార్థినికి నీట్‌లో అత్యుత్తమ ర్యాంక్



ప్రజాపక్షం / ధర్మపురి : జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణానికి చెందిన మదిరె హిమ ధృతి నీ యూజీలో జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంక్ సాధించింది. మంగళవారం వెలువడిన నీట్ యూజి పరీక్షా ఫలితాలలో హిమధృతి 98.798 పర్సంటైల్‌తో 720 మార్కులకు గాను 652 సాధించింది. 27341 ఆలిండియా ర్యాంకు, బిసి ఏ కేటగిరిలో 12285 ర్యాంకు సాధించి శభాష్ అనిపించింది. ధర్మపురి పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు చిలివేరి ఉమాదేవి కృష్ణ మురళి దంపతుల కూతురైనా హిమధృతి చిన్నతనం నుండి ప్రతి తరగతిలో మంచి మార్కులతో ముందు వరుసలో ఉండేది. జాతీయ ర్యాంకుతో సత్తా చాటిన హిమధృతి తను డాక్టర్ కావాలనే అమ్మ కోరికను నెరవేర్చినందుకు ఆనందంగా ఉందని తెలిపింది. ఉత్తమ వైద్యురాలిగా నిరుపేదలకు సేవ చేస్తానని చెప్పింది. ఈ సందర్భంగా పట్టణ వాసులు హిమధృతిని అభినందించారు.

## నీట్‌లో పారమిత విద్యార్థుల ప్రభంజనం



ప్రజాపక్షం/కొత్తపల్లి : నగరంలోని పద్మనగర్ పారమిత క్షేత్ర సిబిఎస్ఇ పాఠశాల సీనియర్ సెకండరీ విద్యార్థులు నీట్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ ఫలితాల్లో బొమ్మిడి శివ 647 మార్కులతో ప్రథమ స్థానంలో, ఎండి ఆయాన్ 608 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచి అత్యుత్తమ ర్యాంకులు సాధించారని పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్. ఇ.ప్రసాదరావు తెలిపారు. మొత్తం తొమ్మిది మంది విద్యార్థులు పరీక్ష రాయగా ముగ్గురు విద్యార్థులు నీట్ కోసం అర్హత సాధించారు. ఈ సందర్భంగా పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ప్రసాదరావు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు అనూకర్‌రావు, రశ్మిత, వియియం ప్రసాద్, ప్రిన్సిపాల్ శ్రీకర్, సమన్వయకర్త ఆర్.నాగరాజు తదితరులున్నారు.